ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**
**LEGISLATIVE COUNCIL DEBATES**

అధికార నివేదిక

# OFFICIAL REPORT

సోమవారం, డిసెంబర్ 22, 2014,

ఇరవై రెండో సమావేశం, సంపుటం-1, నంబరు-4,

జయనామ సంవత్సరం, పుష్య -1.

**MONDAY, THE 22nd DAY OF DECEMBER, 2014,**

**TWENTY SECOND SESSION, VOLUME - 1, NO.4,**

**1ST PAUSH, 1936 S.E.**

* * * * *

శాసన పరిషత్తు సచివాలయము,

పబ్లిక్ గార్డెన్స్,

హైదరాబాద్ – 500 004.

**LEGISLATURE SECRETARIAT,**
**PUBLIC GARDENS,**
**HYDERABAD - 500 004.**

## ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **ఛైర్మన్** | : | డా. ఎ. చక్రపాణి |
| **కార్యదర్శి (ఇన్‌ఛార్జ్)** | : | శ్రీ కె. సత్యనారాయణరావు |
| **ఉప కార్యదర్శులు** | : | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎమ్. విజయరాజు |
| **సహాయ కార్యదర్శులు** | : | శ్రీ పి.వి. సుబ్బారెడ్డి<br>శ్రీ కె. రాజ్‌కుమార్<br>శ్రీమతి ఆర్. వనితారాణి<br>శ్రీ పి. నరసింహ<br>శ్రీ బి. కమలాకర్<br>డా. వై. కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె. వెంకటేశ్వరరావు<br>శ్రీ డి. జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి. ప్రభాకర్‌రావు |
| **చీఫ్ రిపోర్టర్** | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

## ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు

## సోమవారం, డిసెంబర్ 22, 2014.

## అధికార నివేదిక

---

## విషయ సూచిక

---

(1) సభా కార్యక్రమం – వాయిదా తీర్మానం

(2) నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానాలు.

(3) ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్య విధాన, కార్యక్రమ నిర్వహణ తాత్కాలిక నియమావళిలోని 329 (1) నియమాన్ని అనుసరించి సభా సమక్షంలో ఉంచే పత్రాలు

(4) సభా కార్యక్రమం – ప్రత్యేక ప్రస్తావన

(5) రాష్ట్రంలో కరవు పరిస్థితిపై లఘు చర్చ – ఉప ముఖ్యమంత్రి ప్రత్యుత్తరం

(6) హుద్‌హుద్ తుఫాన్‌పై లఘు చర్చ కొనసాగింపు – తీర్మానం

# ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL
# MONDAY, THE 22nd DECEMBER,2014

(THE HOUSE ASSEMBLED AT 10.00 A.M., THE HON'BLE CHAIRMAN IN THE CHAIR)

* * *

## సభా కార్యక్రమం – వాయిదా తీర్మానం

MR. CHAIRMAN: Today, I have received One Adjournment Motion Notice.

The Adjournment Motion Notice given by Sri V. Balasubrahmanyam Garu and Others with regard to non payment of salaries to Animators, VOAs under Indira Kranthi Patham (Velugu), has been dis-allowed.

Now, I will take up Question Hour.

శ్రీ ఎం.వి.యస్. శర్మ (పట్టభద్రుల నియోజకవర్గం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం)ః అన్నీ డిస్ఎలో చేస్తే సాధ్యం కాదు సార్.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం (ఉపాధ్యాయ నియోజకవర్గం, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు)ః అధ్యక్షా, వాయిదా తీర్మానం సభదృష్టికి తీసుకురావడానికి అవకాశం ఇవ్వండి. ఈ యానిమేటర్స్‌కు గత కాంగ్రెస్ ప్రభుత్వంలో 18 నెలల నుండి జీతాలు లేవు. ఆఖరికి ఏదో ఇస్తామని వాగ్దానం చేసి సరిపెట్టారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ వాగ్దానాన్ని అమలు చేయండి, లేదా మీరు అధికారంలోకి వచ్చిన తరువాత నుండైనా సరే ఆ రెండువేల రూపాయల జీతం ఇవ్వండి అని కోరారు. అదీ లేదు, ఇదీ లేకపోగా ఈ రోజు వాళ్లు ఇక్కడ ధర్నా చేయాలని వస్తుంటే ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. వాళ్లను, వాళ్ల నాయకులను బలపరుస్తున్న వారిని కూడా అరెస్ట్ చేశారు. నేను నిన్న విజయనగరంలో ఉన్నాను. విజయనగరంలోనే వాళ్లను అరెస్టు చేయడం జరిగింది. వారి సమస్యను ఈ సందర్భంగా సభ దృష్టికి తెస్తూ, కనీసం ప్రజాస్వామికంగా అడిగే హక్కు కూడా మాకు లేదా? వాళ్లందరూ మహిళలు, ఇందిరా క్రాంతి పథకం (వెలుగు) క్రింద వారిని నియమించారు. వాళ్లు లేకుండా ఇందిరా క్రాంతి పథకం (వెలుగు) కార్యక్రమాలు జరగడం అనేది కష్టమైన సంగతి. ఇది చాలా బాధాకరమైన విషయం. ప్రజాస్వామ్యంలో ఇది అంగీకరించాల్సిన విషయం కాదు.

శ్రీ ఎం.వి.యస్. శర్మ ః ఎవరిని పడితే వాళ్లను అరెస్టు చేస్తున్నారు సార్. We can't follow certain norms, which was given by the Government. ప్రజాస్వామ్యం అంటే మనలేని విధంగా ఉంది. ఎవరినీ నోరెత్తనీయడం లేదు. మేము ఎలా సహిస్తాం సార్?

(అంతరాయం)

SRI RUDRARAJU PADMA RAJU (Assembly Constituency): Chairman Sir, 25,000 people are suffering. They have received only two months salary during the regime of the Congress Government. Later, it was discontinued. I therefore, request you Sir to kindly restore it. We are giving our solidarity to them.

శ్రీ ఎం.వి.యస్. శర్మ : యానిమేటర్స్‌కి న్యాయం జరగాలి సార్.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యంః అధ్యక్షా, ప్రభుత్వం వారి పట్ల అంత అప్రజాస్వామికంగా ప్రవర్తించాల్సిన అవసరం లేదు.

శ్రీ ఎం.వి.యస్. శర్మ : ప్రభుత్వం వారికి గౌరవ వేతనాలు ఇచ్చి 18 నెలలు అవుతోంది సార్. రూ. 2000 పెంచుతామన్నారు, ఇంతవరకూ చేసింది ఏదీ లేదు.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు (శాసనసభ నియోజకవర్గం)ః అధ్యక్షా, గతంలో వాళ్లు పోరాటం చేసినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వీళ్లందరూ (తెలుగుదేశం సభ్యులు) బలపర్చిన వాళ్లే. ఇప్పుడు పాలకపక్షంలో ఉన్న వాళ్లందరూ వాళ్ల వద్దకు వెళ్లిన వాళ్లే. వాళ్లని బలపర్చిన వాళ్లే.

SRI RUDRARAJU PADMA RAJU: Chairman Sir, Animators played a pivotal role and they have received salary of Rs.2,000/- p.m. during the regime of Congress Government.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు : అధ్యక్షా, ఇందిరా క్రాంతి పథకం క్రింద ఉన్న యానిమేటర్స్‌కి తెలుగుదేశం పార్టీ మద్దతు ఇచ్చి వెనకుండి నడిపించి, వారి యొక్క హక్కులను కాపాడతామని చెప్పడమే కాకుండా, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వాళ్లకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో ముందుండి మద్దతు ఇచ్చారు. వారు అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోవడం లేదు.

డా. ఎం. గేయానంద్ (పట్టభద్రుల నియోజకవర్గం, కడప, అనంతపురం, కర్నూలు)ః సార్, నిన్న వాళ్లు ప్రభుత్వానికి చెప్పుకోవాలని హైదరాబాదు వస్తుంటే వాళ్లను అరెస్ట్ చేయడమే కాకుండా వాళ్ల భర్తలను కూడా పోలీస్ స్టేషన్స్‌లో కూర్చోబెడుతున్నారు. ఇంత నిరంకుశమా? ప్రభుత్వానికి చెప్పుకునే హక్కు లేదా? మరి ప్రభుత్వాలు ఎందుకున్నాయి? దీని మీద ప్రభుత్వం సమాధానం ఇవ్వాలి.

(అంతరాయం)

( గౌరవసభ్యులు శ్రీ ఎం.వి.యస్. శర్మ, శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం, డా. ఎం. గేయానంద్, శ్రీ పి.జె. చంద్రశేఖర రావు, శ్రీ ఆదిరెడ్డి అప్పారావు, శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి, శ్రీ మేక శేషుబాబు, శ్రీ బొడ్డు నాగేశ్వర రావు, శ్రీ కె.యస్ లక్ష్మణరావు పోడియం వద్దకు వచ్చి తమ నిరసన తెలియజేశారు.)

శ్రీ ఎం.వి.యస్. శర్మ : దీని మీద ప్రభుత్వం రెస్పాండ్ అవ్వకపోతే ఇంత కంటే దారుణం ఉండదు సార్. రాజధానికి వచ్చి నిరసన తెలియజేసే హక్కు లేదని పోలీసులు ఇండ్ల దగ్గరే అరెస్ట్ చేస్తే ఎలా?

శ్రీ బొడ్డు నాగేశ్వర రావు (పట్టభద్రుల నియోజకవర్గం, కృష్ణా, గుంటూరు) : అధ్యక్షా, దాదాపుగా ఆరు మాసాలనుండి వారు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

(అంతరాయం)

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : ఒకరుకాదు, ఇద్దరు కాదు, దాదాపుగా 27 వేలమంది మహిళలు.

MR. CHAIRMAN: Mr. Balasubrahmanyam, it has come to the notice of the House. Let us wait.

డా. ఎం. గేయానంద్ : ఎవ్వరినీ రానివ్వకుండా అందరినీ ఇళ్ల దగ్గరే ఆపేశారు. ఇది ఏంటిసార్?

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు (శాసనసభ నియోజకవర్గం) : ఫలానారోజు చర్చిస్తాం, పరిష్కారం చేస్తామని స్పష్టమైన హామీని ఇవ్వండి సార్.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : వాళ్లతో కూర్చొని మాట్లాడతామనిప్రభుత్వాన్ని హామీ ఇవ్వమనండి సార్.

శ్రీ బొడ్డు నాగేశ్వర రావు : గౌరవ ముఖ్యమంత్రి గారితో సమస్యను పరిష్కరించడానికి ఒక హామీని ఇప్పించండి సార్. మొత్తం 13 జిల్లాలకు సంబంధించి దాదాపు 27 వేలమంది మహిళలు ఆందోళన చేస్తుంటే వాళ్లను అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్‌లో పెట్టి రాష్ట్ర ముఖ్య పట్టణానికి రాకుండా చేశారు. ఎలా సార్?

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి (పట్టభద్రుల నియోజకవర్గం, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు): గౌరవ ముఖ్యమంత్రిగారు వారితో చర్చించి ఈ సమస్యను పరిష్కారం చేయాలని కోరుతున్నాము. యానిమేటర్స్ మొత్తం 23 రకాల పనులు చేస్తుంటారు.

డా. ఎం. గేయానంద్ : మహిళా సంఘాలకు చాలా కీలకమైన వాళ్లు యానిమేటర్స్. విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్ అంటున్నారు. డ్వాక్రావాళ్ల గురించి వాళ్లు ఇన్ని రోజులు పని చేస్తుంటే వాళ్లని వదిలివేయడం ఏమిటి సార్?

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : పోలీసులు వాళ్ల ఫోన్ నెంబర్స్ తీసుకుని వాళ్లకు ఫోన్లు చేసి, బస్సుల్లో ఎక్కినవాళ్లని బలవంతంగా దించేయడం విజయనగరం, విశాఖపట్టణాలలో ప్రత్యక్షంగా చూశాం సార్. ఎందుకు వాళ్లని నిర్బంధం చేస్తారు సార్. పాత కథ రిపీట్ అవుతోంది, రిపీట్ అయితే చరిత్ర కూడా రిపీట్ అవుతుంది.

డా. ఎం. గేయానంద్ : హైదరాబాదుకు వచ్చి వాళ్ల హక్కుల గురించి మాట్లాడే హక్కు వాళ్లకు లేదని చెప్పమనండి సార్.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : మినిమం హక్కులు కూడా ఉండవా సార్? వాళ్లకి ఫోన్లు చేసి ఎవరు ఫోన్ ఎత్తితే వాళ్లని అరెస్ట్ చేశారు సార్.

ఉ.10.10

డా. ఎం. గేయానంద్ ః అధ్యక్షా, రైల్వే స్టేషన్‌లో టిక్కెట్లు కొని రైలు ఎక్కుతుంటే వాళ్లను కిందకి దించి పంపించారు.

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డిః ఇది చాలా దారుణం. ఇది మహిళలను అవమాన పరచడం కూడా.

శ్రీ విటపు బాల సుబ్రహ్మణ్యం ః అవమానపరచడం ఏమిటి?

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డిః ఏమిటి సార్ ఇది? ఎంత శాంతంగా ప్రభుత్వానికి సహకరించాలన్నా ఇది ఆపుకోలేని పరిస్థితిలా ఉంది. ప్రభుత్వం నుండి ఖచ్చితంగా ఒక హామీ కావాలి.

శ్రీ పి.జె.చంద్రశేఖర్‌రావు ః అధ్యక్షా, ప్రభుత్వాన్ని స్పందించమనండి.

డా. ఎం. గేయానంద్ ః అధ్యక్షా, ప్రభుత్వం నుంచి ఒక స్పష్టమైన హామీ కావాలి. ముఖ్యమంత్రిగారిని వచ్చి చెప్పమనండి. చాలా విషయాలు ముఖ్యమంత్రిగారికి తెలియడంలేదేమో? చెప్పడంలేదేమో అనే అభిప్రాయం కూడా ఉంది.

మిస్టర్ ఛైర్మన్ ః సరే మీరన్నట్టు I will call the Government and the concerned Minister will give reply on this. మరల చర్చించుదాము.

డా. ఎం. గేయానంద్ ః ప్రభుత్వాన్ని స్పందించమనండి. ప్రభుత్వాన్ని మాట్లాడమనండి. ప్రభుత్వానికి మాట్లాడడం రాదా?

శ్రీ సి. రామచంద్రయ్య (శాసనసభ నియోజకవర్గం)ః అధ్యక్షా, ఏమిటి సార్ ఇది. వాళ్ల సమర్థంగా వస్తుంటే జిల్లాల్లో అరెస్ట్ చేయడం ఏమిటి? ఆడవారు, మగవారు అనిలేకుండా వాళ్ల టెలిఫోన్ నెంబర్లు తీసుకోవడం ఏమిటి? Sir, the Government should be a continuous one. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా కూడా అంతకు ముందు వచ్చిన ఆర్డర్లు ఈ ప్రభుత్వం అమలు చేయాలి. కాంగ్రెస్ వాళ్లు నియమించారు కాబట్టి, మీరు వెళ్లండి అని అంటున్నారు ఇదేమిటి? కాంగ్రెస్ వచ్చాక మీరు అన్ని వదిలేస్తారా? ఇది చాలా దారుణం.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం ః వాళ్లను నిర్బంధించడం అన్యాయం. వాళ్లను నిర్బంధించవలసిన అవసరం ఏమిటి సార్?

శ్రీ బి. గోపాలకృష్ణారెడ్డి ః అధ్యక్షా, తప్పకుండా విచారణ చేస్తాము.

శ్రీ సి. రామచంద్రయ్యః ఇప్పుడు విషయం అది కాదు. What made you to arrest all those people in the District?

శ్రీ ఎం.వి.యస్.శర్మ ః ఎవరూ దీని మీద చర్చలు చేయలేదు సార్. 150 రోజులు అయింది.

శ్రీ సి. రామచంద్రయ్యః వాళ్లను నిర్బంధించి పోలీసు స్టేషనులో పెట్టడం ఏమిటి ? వాళ్లు రూ.1500/- ల టిక్కెట్ కొని తూర్పుగోదావరి నుంచి వారు వస్తుంటే, వాళ్లను నిర్బంధించి, మీ ఆడవాళ్లను తీసుకువస్తేనే మిమ్మల్ని విడిచిపెడతామని అక్కడి ఎస్పీ చెబుతున్నారు,ఇది ఎంత దారుణం ? ఇంత అనాగరికమైన ప్రభుత్వం ఎక్కడా కనిపించలేదు.

SRI B. GOPALA KRISHNA REDDY: Okay, Sir.

SRI M. V. S. SARMA: Okay ఏమిటి సార్? ప్రభుత్వం స్పందన చూడండి.

(గౌరవ సభ్యులు డా. ఎం. గేయానంద్, శ్రీ ఎం. వి. యస్. శర్మ, శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం,శ్రీ పి.జె.చంద్రశేఖరరావు, యండపల్లి శ్రీనివాసులు రెడ్డి పోడియం ముందు బైఠాయించారు.)

శ్రీ సి. రామచంద్రయ్యః అధ్యక్షా, మంత్రులను ప్రవర్తన మార్చుకోమనండి.

శ్రీ ఎం.వి.యస్.శర్మః ఇది చాలా సీరియస్ విషయం. పరిశీలనలో ఉంది అంటున్నారు. 158 రోజుల నుంచి ఏమి పరిశీలించారు? మంత్రులు వెళ్లి ముఖ్యమంత్రిగారి దగ్గర రోజులు తరబడి పడిగాపులు కాసినా ఇంటర్వ్యూ ఇవ్వలేదు. అది ఏమి పరిశీలన?

శ్రీ సి. రామచంద్రయ్యః అసలు వాళ్లు చేసిన నేరం ఏమిటి?

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి ః వాళ్లు 23 రకాల ప్రభుత్వ పనులు చేయడమా తప్పు. ప్రభుత్వం దగ్గర జీతాలు లేకుండా పనిచేయడమా వాళ్లు చేసిన తప్పు. ఇంత సీరియస్ విషయాన్ని, సులువైన విషయాన్ని ఎందుకు రాద్ధాంతం చేయడం.

శ్రీ విటపు బాల సుబ్రహ్మణ్యం ః వాళ్లను ఎవరూ ఆపలేరు సార్, వాళ్లు మనం చెప్తే వినే పరిస్థితిలో కూడా లేరు. అంత సీరియస్‌గా వాళ్లను అణచి వేశారు. వాళ్ల మాట వినని వాళ్లను తీసేస్తున్నామని కూడా చెప్పారు.

శ్రీ బొడ్డు నాగేశ్వరరావు ః నెలకు 5 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడం పెద్ద సమస్య కాదు. ఈ విషయం మన మంత్రులందరి దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది.

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి ః అధ్యక్షా, కేవలం రూ.60 కోట్లతో 27 వేల మంది దగ్గర మనం పని చేయించుకుంటున్నాము. ప్రభుత్వం వైపు నుంచి గట్టి హామీ ఏమి రాలేదు.

SRI R. PADMA RAJU: Sir, the amount is so meager and the Government can afford.

శ్రీ బి. గోపాలకృష్ణా రెడ్డి : అధ్యక్షా, విషయాన్ని గందరగోళంగా తయారు చేశారు. దీనిపై సమగ్రంగా చర్యలు తీసుకోవలసి ఉంది. ప్రభుత్వం కూడా తగిన విధంగా చర్యలు తీసుకుంటుంది.

శ్రీ ఎం.వి.యస్.శర్మ: వాళ్లు 150 రోజుల నుంచి నిరసన తెలియజేస్తుంటే ఈ సమాధానం మాకు సంతృప్తికరంగా లేదు సార్.

శ్రీ విటపు బాల సుబ్రహ్మణ్యం : చర్యలంటే ఏమిటి సార్? అరెస్ట్ చేయడమా?

శ్రీ బి. గోపాలకృష్ణా రెడ్డి : అధ్యక్షా, తప్పుచేస్తే తప్పు చేశామని చెప్తారా?

శ్రీ ఎం.వి.యస్.శర్మ: మమ్మల్ని కూడా తీసుకువెళ్ళి లోపల వెయ్యమనండి. మమ్మల్ని అరెస్ట్ చేయించండి. తప్పు చేయడం ఏమిటి సార్? అరెస్ట్ చేసి.

మిస్టర్ ఛైర్మన్ : ఇప్పుడు శాల్యూయిస్ట్ అనేది ముఖ్యం. ఏం తప్పు చేశారో కనుక్కొని దాని గురించి చెప్పండి.

శ్రీ పి.జె. చంద్రశేఖరరావు : సార్, ముందుగా జీతాలు చెల్లించే విషయం గురించి చెప్పమనండి.

శ్రీ ఎం.వి.ఎస్. శర్మ : సార్, మంత్రులు పరిశీలిస్తామంటే మేము లేచి మాట్లాడడం దండగ మాకు పరిశీలన వద్దు, మాకు పరిశీలిస్తామనే హామీ ఏదైనా ఇస్తే, వినడానికి మేము సిద్ధం.

(అంతరాయం)

మిస్టర్ ఛైర్మన్ : శర్మగారూ, మంత్రిగారు లేచి నిలబడ్డారు, కొంచెం ఆగండి, ఆయన సమాధానం చెపుతారు. ఉగాది వరకు ఉన్నా ఉడికే దాకా ఉండలేరు.

శ్రీ ఎం.వి.ఎస్. శర్మ: అదే సార్, ఉగాది వరకూ ఉండడమే వాళ్ళు చేసిన తప్పు. కాబట్టి, ముందే తేల్చుకోవాలి.

శ్రీ యనమల రామకృష్ణుడు : అధ్యక్షా, దీనిలో రెండు ముఖ్యమైన సెపరేట్ ఇష్యూస్ ఉన్నాయి. ఒకటేమో వాళ్లు వస్తుంటే అరెస్ట్ చేశారు. ఎందుకు అరెస్ట్ చేశారు ఏమిటి అనేది తెలుసుకొని సభకు తెలియచేస్తాము. రెండవది, వాళ్ల జీతము గురించి, ఇతర విషయాల గురించి చేస్తున్నారు. అయితే, they are not the employees of the Government. ఏ ప్రభుత్వము కూడా వాళ్లకు జీతాలు నేరుగా ఇవ్వలేదు.

శ్రీ ఎం.వి.ఎస్. శర్మ: రెండు నెలలు జీతాలు ఇచ్చారు సార్. జివో కూడా ఉంది. Sir, you should not mislead the House.

శ్రీ యనమల రామకృష్ణుడు ః 10 సంవత్సరాలు అధికారంలో ఉంటే రెండు నెలలే ఎందుకిచ్చారు. రెండు నెలలు , ఒక నెల ఇవ్వడం సమస్య కాదు. వాళ్లు వచ్చిన దగ్గర నుంచి ప్రభుత్వం జీతాలు ఇవ్వలేదు. ఇస్తే ఒకటి రెండు నెలలు జీతాలు ఇవ్వొచ్చు. పాత ప్రభుత్వం ఏదైనా జీవో ఇవ్వొచ్చు. అందువలన ఇది ఈ రోజు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. వచ్చిన తరువాత పరిశీలించాలి. దానిలో మిమ్మల్ని కూడా పిలిచి మాట్లాడుతాము.

శ్రీ ఎం.వి.ఎస్. శర్మః వాళ్లకు ఒక జీవో ఇచ్చారు. దానిలో రూ.2000/- ల జీతం ఇవ్వాలని నిర్ణయించారు. ప్రభుత్వం ఆ జీవో మీద ఆరు నెలలు అయ్యి మేము జీవో రద్దు చేస్తున్నాము మీకు జీతాలివ్వము, ఆ పాత జీవో రద్దు చేస్తున్నామని చెప్పే ధైర్యం ఉండాలి. జనాలొచ్చి ఇక్కడ నిరసన తెలియచేస్తే ప్రజాస్వామ్య స్ఫూర్తి అయినా ఉండాలి. అదీ లేదు. వీళ్ల సూచనలు లేకుండా అకారణంగా ప్రదర్శనకు వచ్చిన వాళ్ల భర్తల్ని ఎవరైనా అరెస్ట్ చేస్తారా? ఇదేమి ప్రజాస్వామిక ప్రభుత్వం సార్. చాలా నిదానంగా మేము ఎంక్వైరీ చేస్తామంటున్నారు. Without instructions from the headquarters, nothing is going on Sir. అక్కడ జిల్లాల్లో ఏమి చెబుతున్నారంటే ఇక్కడ తెలంగాణా పోలీసులు పర్మిషన్ ఇవ్వలేదని. ఈ విడ్డూరం ఏమిటంటే it is a combined Law and Administration area. మన రాజధానిలో మన ప్రజలు నిరసన తెలియ చేయడానికి తెలంగాణా పోలీసుల పర్మిషన్ ఏమిటి సార్. పర్మిషన్ ఇవ్వలేదని ఆ పేరు మీద రకరకాలుగా భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

శ్రీ యనమల రామకృష్ణుడు ః అధ్యక్షా, గౌరవ సభ్యులకు అన్నీ తెలుసు. హైదరాబాదు, సైబరాబాదు గాని ఇవన్నీ కూడా హైదరాబాదు పోలీసు కంట్రోలులో ఉన్నాయి. తెలంగాణా ప్రభుత్వం కంట్రోలులో ఉంటాయి. అయినా కూడా ఏమి జరుగుతుందో మాకు తెలుసు. తెలిసిన తరువాత ఏమి జరిగిందో మీకు ఖచ్చితంగా చెబుతాము. వాళ్ల జీతాలకు సంబంధించి మేము పరిశీలిస్తున్నాము.

శ్రీ ఎం.వి.ఎస్. శర్మః మా సంఘం పరిగణను పెంచి ఏమైనా నిర్దిష్ట హామీ మాకు ఇస్తారా. ఇలాంటివి చాలా చెప్పారు. We want a concrete assurance. రేపు మాట్లాడతామని చెప్పకండి. ఈరోజు సాయంత్రం మాట్లాడుతామని చెప్పండి.

SRI YANAMALA RAMAKRISHNUDU: No, this is not correct Sir. They can't compel the Government to speak like this. You see, in the society, they belong to certain class. They are paid by the Local Organizations. The Government has not concern with them. అందుచేత మేము తెలుసుకుని మాట్లాడుతాము. నా దగ్గరకు కూడా వాళ్లు వచ్చారు. We are examining the matter. How the Government is responsible for it? అవసరమయితే వాళ్లతో మాట్లాడుతాము.

డా. ఎం. గేయానంద్ ః సార్ ప్రభుత్వ పనులన్నీ వాళ్లతో చేయించండి. అన్ని సర్వేలో వాళ్లతో చేయించండి. ప్రభుత్వంతో సర్వే చేయండి.

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి ః సార్, సమావేశాలకు హాజరయ్యేది వాళ్లే.

ఉ.10.20

శ్రీ సి. రామ చంద్రయ్యః అధ్యక్షా, ఫైనాన్స్ మినిస్టర్ గారు చెప్పిన దాంట్లో నేను కాదనడం లేదు. గవర్నమెంట్ మాత్రం జీఓ ఇష్యూ చేసింది వాస్తవం. సెర్ప్ వాళ్లు శాలరీ ఇచ్చారు..

( ఆ సందర్భంలో మంత్రి వర్యులు శ్రీ బొజ్జల గోపాలకృష్ణా రెడ్డి గారు అభ్యంతరం వ్యక్తం చేశారు)

మంత్రిగారికి ఇంత ఇన్‌టాలరెన్స్ ఉంటే కష్టం. మేము అడిగేటప్పుడు మీరు విని సమాధానం చెప్పాలి. మీరు ప్రతి దానికి రియాక్ట్ అవుతుంటే, మేం ఏం మాట్లాడతాము. మీకు అపోజిషన్ అనేది లేదనే దృష్టితో వెళుతున్నారు. ఇలాగైతే కష్టం. మీకు కేవలం 5 లక్షల మెజారిటీ మాత్రమే వచ్చింది. ఎక్కువ రాలేదు. అది మీరు దృష్టిలో పెట్టుకోండి. ఇక్కడ రెస్పాన్సిబుల్ అపోజిషన్ ఉంది. ఒక పద్ధతి లేకుండా బుల్‌డోజ్ చేసుకుని పోదామనుకుంటే కష్టం.

శ్రీ బొజ్జల గోపాలకృష్ణా రెడ్డి : మీది సున్నా కదా!

శ్రీ సి. రామ చంద్రయ్యః మాది సున్నానే.

శ్రీ ఎం.వి.ఎస్. శర్మ : సార్, మాది సున్నానే. కానీ, ప్రజలు సున్నా కాదు. We are talking about people.

శ్రీ సి. రామ చంద్రయ్యః మీరు చేసిన విష ప్రచారానికి మేం సిక్ అయ్యాం. ఇంకా చావలేదు. కేవలం సిక్ అయ్యాము. బౌన్స్ అయ్యి మళ్లా కొడతాము. కొడితే అట్లా, ఇట్లా కాదు. మాకేం అనుమానం లేదు. కాబట్టి, అధ్యక్షా..

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : మీరూ.. మీరూ.. కొట్టుకోండి గానీ, ఆ కార్మికులను మాత్రం కొట్టకండి సార్.

శ్రీ సి. రామ చంద్రయ్యః కాదు సార్. వాళ్లు 150 రోజుల నుండి స్ట్రైక్‌లో ఉన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆర్నెల్లు అయ్యింది. Government should have seized the matter long time back. ఆ పని వీళ్లు ఇంత వరకు చెయ్యలేదు. వాళ్ల సర్వీసులన్నీ వాడుకుంటున్నారు. ఇది బేసిక్ ఇష్యూ కాదు. కానీ, ఇష్యూ ఏమంటే, ఎందుకు వాళ్లను అరెస్ట్ చేయాల్సి వచ్చింది. ఇదేంటి సార్? మర్డర్ చేసిన వాళ్లకు మాదిరిగా, మగవాళ్లను తీసుకువెళ్లి మీ భార్యలను తీసుకురండి అనంటే ఏమిటి సార్ ఇది? ఎంత దారుణమిది? వాళ్లు వచ్చి మిమ్మల్ని అడుగుతారు. వాళ్లేమన్నా మిమ్మల్ని ఇబ్బందిపెడుతున్నారా? అడిగే దానికి కూడా మీరు అవకాశమివ్వకపోతే, is it a democratic set up or banana republic?

శ్రీ యనమల రామకృష్ణుడుః అందుకనే నేను చెప్పాను. ఇవి రెండు వేర్వేరు అంశాలు. I am not dealing with the Police. సడెన్‌గా ఇక్కడికి వచ్చాను. సభ్యులందరూ చెప్పారు.

శ్రీ సి. రామచంద్రయ్యః అధ్యక్షా, కలెక్టివ్ రెస్పాన్సిబిలిటీ ఉంది. You are second to the Chief Minister.

శ్రీ యనమల రామకృష్ణుడు: హ్యావ్ పేషన్స్.

శ్రీ సి. రామచంద్రయ్య: సార్, నేను చెబుతున్నాను. మామూలు ఇన్ఫర్మేషన్..

శ్రీ యనమల రామకృష్ణుడు: సార్, ఆయన చెప్పినప్పుడు మేం విన్నాం. మేము చెప్పినప్పుడు వినకపోతే ఎట్లా? He should have some patience.

శ్రీ సి. రామచంద్రయ్య: లేదు సార్. To elicit the information this question is created. దానికి ముందే ఈ ఇష్యూ వచ్చింది. 15, 20 వేల మందికి సంబంధించిన ఇష్యూ వచ్చినప్పుడు, we have to spend more time. Time factor కాదు, time constraint ఉండకూడదు. నిన్న పల్వరైజింగ్ మిల్స్ విషయంలో కూడా అలాగే చేశారు.

మిస్టర్ ఛైర్మన్: రామ చంద్రయ్య గారూ.. మీరు ఒక దానికొకటి క్లబ్ చేస్తున్నారు. You are wasting the time.

శ్రీ సి. రామచంద్రయ్య: ఇదేం వేస్ట్ సార్. మనుషుల్ని అరెస్ట్ చేస్తే వేస్ట్ అంటారు. మగవాళ్లని అరెస్ట్ చేసి, భార్యల్ని తెమ్మంటారా? ఏమిటి సార్ ఇది? You have to come to the rescue of the Opposition. పబ్లిక్ ఇష్యూస్ రెయిజ్ చేసినప్పుడు, మీరు మా రెస్క్యూకి రావాలి. ఏమిటి సార్ ఈ క్వశ్చన్స్. జనరల్ ఆన్సర్స్ ఇస్తారు.

SRI YANAMALA RAMAKRISHNUDU: Sir, this is not correct. ఎందుకంటే, ఈ ఇష్యూ మీద వారు ఎలాంటి నోటీస్ ఇవ్వలేదు.

శ్రీ ఎం.వి.ఎస్.శర్మ : 150 రోజుల క్రితం వారు నోటీస్ ఇచ్చారు. Don't run the Government through technique. Run the Government with heart. హృదయంతో ప్రభుత్వాన్ని నడపండి. అదెక్కడా కనపడటం లేదు.

శ్రీ యనమల రామకృష్ణుడు: శర్మ గారూ.. మీరు చదువుకున్న వ్యక్తి. అసెంబ్లీ ప్రొసీడింగ్స్ వేరు. బయట నోటీసులివ్వడం వేరు. మీకు ప్రభుత్వం తరఫున సమాధానం రావాలంటే, మీరు నోటీస్ ఇచ్చి ఉండాలి. మీరు అడ్జర్న్‌మెంట్ మోషన్ క్రింద నోటీసు ఇచ్చారు. అది ఛైర్మన్ గారు డిస్ అలౌ చేశారు. గవర్నమెంట్‌కు నోటీస్ రాలేదు. ఇన్సిడెంటల్‌గా వచ్చింది. ఇన్సిడెంటల్‌గా నేను వచ్చాను. సమాధానం చెప్పాము. రేపు కలెక్టివ్ రెస్పాన్సిబిలిటీతో తెలుసుకుంటాము. ఏమయ్యిందనేది తెలుసుకుని హౌస్‌కు నేనే చెబుతాను.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు : నిర్దిష్టమైన ప్రతిపాదన లేకుండా ఎట్లా? వారం, పది రోజుల్లో చేస్తామని చెప్పండి సార్. నిర్దిష్టమైన ప్రతిపాదన లేకుండా చూస్తామనంటే ఎట్లా సార్?

మిస్టర్ ఛైర్మన్: చెబుతానన్నారు కదా?

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు : చెప్పలేదు సార్. ఏదో వారం రోజుల్లో పిలిచి మాట్లాడతామని చెప్పండి సార్. ఒక హామీ లేకపోతే ఎట్లా?

శ్రీ ఎం.వి.ఎస్.శర్మ ః సమస్యను చెప్పుకోవడానికి వినే పరిస్థితి కూడా లేకపోతే ఎట్లా?

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు ః బయట జరుగుతున్న ఘటనలకు కళ్లు మూసుకుని ఉండలేం సార్.

(అంతరాయం)

SRI VITAPU BALASUBRAMANYAM: Without dialogue, what is the democracy at all? డైలాగ్ లేని డెమోక్రసీ ఏమిటండీ?

(అంతరాయం)

శ్రీ యనమల రామకృష్ణుడుః అధ్యక్షా, నేను కేటగారికల్‌గా చెప్పాను. ఇష్యూ తెలుసుకుంటాము. తెలుసుకున్నాక వాళ్లతో కూడా మేము మాట్లాడతాము. మాట్లాడాక, how far the Government is responsible అనేది మేం చెబుతాము. అందుచేత మీరు ఇక్కడ కమిట్‌మెంట్ ఇవ్వండి, కమిట్‌మెంట్ ఇవ్వండి అంటే సాధ్యం కాదు. We cannot say like that.

శ్రీ ఎం.వి.ఎస్.శర్మః సార్, సంఘం వాళ్లని పిలిపించి, మాట్లాడతామనే కమిట్‌మెంట్ కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదు సార్.

శ్రీ యనమల రామకృష్ణుడుః మొన్న అసెంబ్లీలో నోటీస్ ఇచ్చారు. మేము సమాధానమిచ్చాము.

శ్రీ ఎం.వి.ఎస్.శర్మః సార్, 150 రోజుల క్రితమే వారు నోటీసిచ్చి, మీ చుట్టూదేవులాడుతునా, సంఘాన్ని పిలిచి మాట్లాడతామనే కమిట్‌మెంట్‌ని కూడా మీరివ్వడం లేదు.

శ్రీ యనమల రామకృష్ణుడుః అధ్యక్షా, నేను పిలిచి మాట్లాడతానని చెబుతున్నా, శర్మ గారు మళ్లీ రిపీట్ చేస్తున్నారు.

## నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానాలు.

## గిరిజన బోరు బావుల ఎనర్జైజేషన్

ప్రశ్న నెం. 7640(31)
శ్రీ బి.చంగల్ రాయుడు, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన గిరిజన సంక్షేమం & సాధికారత శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) వ్యవసాయ బోరుబావుల కొరకు విద్యుత్తు సర్వీసు ఛార్జీలను గిరిజన ఉప-ప్రణాళిక నుండి గిరిజన సంక్షేమ శాఖ భరిస్తున్న విషయం వాస్తవమేనా ?
ఆ) అయితే, 2013-14 కాలంలో లబ్దిపొందిన లబ్దిదారుల సంఖ్య ఎంత?
ఇ) ఈ 2014-15 సంవత్సరంలో అనేక దరఖాస్తులు పెండింగులో వున్న విషయం వాస్తవమేనా? ఎప్పటిలోగా వాటిని పరిష్కరించడమవుతుంది?

గౌరవనీయులైన గిరిజన సంక్షేమం & సాధికారత శాఖ మంత్రి (శ్రీ రావెల కిశోర్‌బాబు):

అ) అవునండీ. ట్రైబల్ డిపార్టుమెంటుకు సంబంధించినంత వరకు ఎనర్జైజేషన్ సర్వీస్ చార్జెస్‌ని ట్రైబల్ సబ్‌ప్లాన్ యాక్ట్ అయిన దగ్గర నుండి ట్రైబల్ సబ్ ప్లాన్ నిధుల నుండి ఖర్చుపెడుతున్నాము. జనవరి, 25, 2013 వ సంవత్సరం నుండి ఈ చట్టం అమలులోకి వచ్చింది. అంతకుమునుపు ఒక్కొక్క బోర్‌వెల్‌కు రూ.50,000 చొప్పున ట్రైకార్ భరించేది. చట్టమయిన తరువాత, అది రూ.90,000 గానీ, రూ.1,00,000 గానీ మొత్తం కూడా ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధుల నుండే ఖర్చుపెడుతున్నాము.
ఆ) 2013-14, కాలంలో, 688 దరఖాస్తులు అందాయి. అందులో రూ.150.09 లక్షల వ్యయంతో ఎస్‌టి రైతులకు చెందిన 169 వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్తును కల్పించడమయింది.
ఇ) అవునండీ.

2013-14, 2014-15 సంవత్సరాలకు సంబంధించిన 1788 దరఖాస్తులు విద్యుత్తు కోసం పెండింగులో వున్నాయి. వాటిలో 519 దరఖాస్తులను పరిష్కరించడమయింది. అంటే, 2013-14 సంవత్సరంలో మిగిలిపోయిన వాటిని 2015, మార్చి నాటికి పూర్తి చేయడమవుతుంది.

ఏపీ ట్రాన్స్‌కో యొక్క టిఎస్‌పి క్రింద "విద్యుదీకరించని ఎస్‌టి జనావాసాలను విద్యుదీకరించడం, ఎస్‌టి బోరుబావులకు విద్యుత్తును కల్పించడం" అనే పథకం క్రింద రూ.16.54 కోట్ల వ్యయంతో 2015-16 కాలంలో మిగిలిపోయిన 1269 దరఖాస్తులను పరిష్కరించమవుతుంది.

శ్రీ బి. చంగల్ రాయుడు (శాసనసభ నియోజకవర్గం) : అధ్యక్షా, ఇది నోరులేని గిరిజనులకు సంబంధించిన విషయం. వాళ్లు సొంతంగా బోర్లు వేసుకోవడం ఒకటి. రెండవదేమంటే, గ్రౌండ్ వాటర్ డిపార్టుమెంటు ద్వారా బోర్లు వేసుకున్నారు. వాటికి ఎనర్జైజేషన్ చార్జెస్‌ని కట్టమని అడిగితే, మా పరిస్థితి ఇలా ఉంది. 2013–2014 కి సంబంధించినవే మేం కట్టలేకపోతున్నాం. 2014–2015 లో కూడా కొంచెం వడ్డిస్తామని అంటున్నారు. ఇది న్యాయమా? సబ్‌ప్లాన్‌లో భర్తిస్తామంటే ఎవరు వద్దన్నారు? ఎనర్జీ డిపార్టుమెంటు వారే భరించాలని మీరంటున్నారు. ఎనర్జీ డిపార్టుమెంటులో ఆ డబ్బును నాలుగు హెడ్‌ల క్రింద తీసుకున్నారు. ఎలక్ట్రిఫికేషన్ ఆఫ్ విలేజెస్, ఎనర్జైజేషన్ ఆఫ్ అగ్రికల్చరల్ సర్వీసెస్, ఎనర్జైజేషన్ ఆఫ్ ఆర్‌డబ్ల్యూఎస్ స్కీమ్స్, ఫార్మేషన్ ఆఫ్ ఇమ్‌ప్రూవ్‌మెంట్స్ కోసమని తీసుకున్నారు. వాళ్ల సబ్‌స్టేషన్ దగ్గరకు, వాళ్ల ఫ్లాట్‌ఫామ్ దగ్గరకు పోయేందుకు.. ఈ డబ్బులో మిగతా హెడ్ క్రింద డబ్బు ఖర్చు కాలేదు. డబ్బు మిగిలి ఉంది. ఈ ఎనర్జైజేషన్ ఆఫ్ అగ్రికల్చరల్ సర్వీసెస్‌కు మిగతాది తీసుకువచ్చి చేస్తే, ఒక 5 నిమిషాలు మంత్రి గారు కాన్‌సెంట్రేట్ చేస్తే ఈ సమస్య పరిష్కారమౌతుంది. మంత్రి గారు బాధపడనంటే ఒక మాట చెబుతాను. నేను 45 పీఠాలకు అధిపతిని. నన్ను గుర్తించి కడప జిల్లా సామ్రాజ్యానికి రాజును చేసేశారు. అవసరమైతే నేను మాయల ఫకీరులాగా సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. మరి దీన్ని చేయలేరా? ట్రైబల్ గవర్నింగ్ బాడీ మూడు నెలలకు ఒకసారి కూర్చోవాలి. మొన్న 12 వ తారీకున పెట్టారు. దాన్ని కూడా క్యాన్సిల్ చేసేశారు. 2012–2013 సంవత్సరానికి సంబంధించిన బిల్లులు ఇంకా పెండింగులో ఉన్నాయి. 2013–2014 సంవత్సరానికి సంబంధించి క్వార్టర్లీ పేమెంట్ జరిగింది. 2014–2015 సంవత్సరంలో మేం పే చేస్తామని చెబుతున్నారు. గిరిజనులకు ఇలాంటి హామీనివ్వడం భావ్యమా? సార్, మీరు మొదటిసారిగా కౌన్సిల్‌లో చేసిన ప్రసంగానికి ముగ్దుణ్ణి అయిపోయాను. నేను సామాన్య కుటుంబం నుండి వచ్చాను, హాస్టల్లో చదువుకున్నాను. మూడు ఇడ్లీల బదులు రెండు ఇడ్లీలే తిన్నాను. కడుపు మాడ్చుకుని చదువుకున్నాను అన్నారు. ఇదేనా సార్ మీరు చేయాల్సింది? నోరు లేని గిరిజనులకు కరెంటు ఇచ్చేదానికి మీకు అవకాశం లేదా?

MR.CHAIRMAN: I am not allowing you.

శ్రీ బి. చంగల్ రాయుడు: అధ్యక్షా, ఇంకేం అలా చేస్తారు మీరు? నోరు లేని గిరిజనులు బోర్లు వేసుకుంటే, వాళ్లకు కరెంటు ఇచ్చేందుకు ఈ ప్రభుత్వానికి గతి లేదా అని అడగాలా నేను? ఇది తప్పు సార్.

మిస్టర్ ఛైర్మన్: మీకు ఎమోషన్స్ ఎక్కువ ..

శ్రీ బి. చంగల్ రాయుడు: సార్, వాళ్ల మాటలు మీరు కూడా మాట్లాడొద్దు సార్.

మిస్టర్ ఛైర్మన్: మీరు మామూలుగా అడగొచ్చు కదండీ. ఇంత ఊగి చెప్పక్కర్లేదు కదా.

శ్రీ బి. చంగల్ రాయుడు: మా దగ్గర నోరు లేని గిరిజనులు. యానాదులు. అప్పోసప్పో చేసి బోర్లు వేసుకున్నారు. వాళ్లకు ఎనర్జీ ఇవ్వండి. జనవరి, 1 గిఫ్ట్‌గా అందరికీ ఎనర్జైజేషన్ చేస్తామని మంత్రి గారు చెప్పారు. ఆ మంచి మాటను, వాళ్లు బ్రతికే మంత్రాన్ని చెప్పమనండి.

ఉ.10.30 & 10.40

శ్రీ రావెల కిషోర్ బాబు : అధ్యక్షా, గత ప్రభుత్వాలు చేసినటువంటి పాపాలను మేము సరిచేయడానికి ఎంతో శ్రమ పడవలసి వస్తుంది. వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయాయి. ఎస్సీ, ఎస్టీ నిధులను కూడా గత ప్రభుత్వాలు దారి మళ్లించాయి.

శ్రీ సి. రామచంద్రయ్య : అధ్యక్షా, గత 10 సంవత్సరాలలో మా ప్రభుత్వం performance ఏ విధంగా ఉందో నేను ఛాలెంజ్ చెప్తాను. ఎవరైనా చర్చకు రావచ్చు.

శ్రీ రావెల కిషోర్ బాబు : అధ్యక్షా, ఎస్సీ కార్పోరేషన్ నిధులను ఓఆర్ఆర్‌కు బదిలీ చేశారు. ఎస్సీ కార్పోరేషన్ నిధులను హుస్సేన్‌సాగర్ బ్యూటిఫికేషన్ కోసం వాడుకున్నారు.

శ్రీ బి. చంగల్ రాయుడు : మంత్రి గారూ.. ఈ సంవత్సరంలో మీరు చేసింది చెప్పండి.

శ్రీ రావెల కిషోర్ బాబు : అదే చెబుతున్నాను. ఈ సంవత్సరం ట్రైబల్ సబ్-ప్లాన్ క్రింద రూ.1500కోట్లు కేటాయించడం జరిగింది. దీనిలో రూ.12.98కోట్లు పవర్ డిపార్ట్‌మెంట్‌కు కేటాయించడం జరిగింది. ఈ సంవత్సరం ట్రైకార్ నిధుల నుంచి పెద్ద ఎత్తున నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధి కల్పించడం కోసం చూపిస్తున్నాము. గత సంవత్సరం 2012-13లో కేవలం రూ.19కోట్లు మాత్రమే నిధులను మంజూరు చేసి ఎస్సీ కార్పోరేషన్ ద్వారా, ట్రైకార్ ద్వారా ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువకుల కోసం ఖర్చు పెట్టడం జరిగింది. నేను చంగల్‌రాయుడు గారికి గుండె మీద చెయ్యి వేసుకొని చెప్పేదేమిటంటే.. మేము ఈరోజు చరిత్రను సృష్టిస్తున్నాము. రూ.850కోట్ల నిధులతో దాదాపు 94 వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రత్యామ్నాయ నిరుద్యోగ అవకాశాలను కల్పించడానికి చేస్తున్నాము. గత సంవత్సరం రూ.19కోట్లు మూడు వేల మందికి ఇస్తే, ఈ సంవత్సరం రూ.850కోట్లు 94 వేల మందికి ఇవ్వడం జరుగుతోంది. ఇది చరిత్రను సృష్టించడం కాదా? మా ప్రభుత్వం దళిత, గిరిజనుల పక్షపాత ప్రభుత్వం. దళిత, గిరిజనుల అభ్యున్నతికి, సంక్షేమానికి పనిచేసే ప్రభుత్వం మాది.

శ్రీ బి. చంగల్ రాయుడు : అధ్యక్షా, నేను అడిగిన ప్రశ్నకు సమాధానం రాలేదు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన నిధులలో 75 శాతం నిధులను విద్యావ్యవస్థకే అని పెట్టినప్పుడే ఈ energisation మూలపడ్డదని నేను బడ్జెట్‌పై జరిగిన చర్చ సందర్భంలోనే చెప్పాను. ఒకసారి బడ్జెట్‌పై జరిగిన చర్చను చూస్తే మీకే తెలుస్తుంది. గిరిజనులకు ఇచ్చినటువంటి నిధులలో 75 శాతం విద్యా రంగానికి కేటాయిస్తే, మిగతా 25 శాతం సిబ్బంది జీతాలకు సరిపోతుంది. ఇక వాళ్లకు energisation ఏమి చేస్తారు? నిరుద్యోగ సమస్యను ఎలా తీరుస్తారు? బోర్లు ఏమి వేస్తారు? నీళ్లు ఏమి ఇస్తారు? Energisation కావాల్సిన కాలనీలు ఎన్ని ఉన్నాయి? వీటన్నింటిని స్టడీ చేయాలని కోరుతున్నాను. బోర్డు మీటింగ్‌లో మంత్రి గారి ప్రమేయం లేకుండా చూడండి. గవర్నింగ్ బాడీ మీటింగ్‌కు మంత్రి గారికి సంబంధం ఏమీ లేదు. కాని, దాని కూడా వాయిదా వేయించేస్తున్నారు.

మిస్టర్ ఛైర్మన్ : చంగల్ రాయుడు గారూ.. ముందుగా మంత్రి గారు చెప్పేది వినండి. మధ్యలో intervention ఎందుకు?

శ్రీ బి. చంగల్ రాయుడు : అధ్యక్షా, సబ్జెక్ట్‌ను డీవియేట్ చేసింది ఎవరు?

శ్రీ సి. రామచంద్రయ్య : మంత్రిగారూ, పాపాలు ఎవరు చేశారో డిబేటుకు కూర్చుందామా?

శ్రీ రావెల కిషోర్ బాబు : కుప్పకూలిపోయిన వ్యవస్థలన్నింటిని సరిచేయాలి కదా. వాటిని సరిచేస్తున్నటువంటి క్రమంలో చేస్తున్న పనిని చెబుతున్నాను. ఎస్సీ, ఎస్టీ నిధులను గత ప్రభుత్వాలు దారి మళ్లించ లేదా? చెప్పండి.

మిస్టర్ ఛైర్మన్ : ఇప్పుడు దాని గురించి వద్దు.

శ్రీ సి. రామచంద్రయ్య : మేము ఎటువంటి చర్చకైనా రెడీ. మీరు రెడీనా చెప్పండి.

మిస్టర్ ఛైర్మన్ : రామచంద్రయ్య గారూ.. చంగల్ రాయుడు గారూ. మంత్రి గారు మాట్లాడుతున్నప్పుడే మీరు కల్పించుకొని స్టేట్‌మెంట్ ఇస్తున్నారు. ఏమిటండి ఇది? దయచేసి కూర్చొండి.

శ్రీ బి. చంగల్ రాయుడు : అధ్యక్షా, డిసెంబర్, 31 లోపు కథను సుఖాంతం చేస్తామని చెప్పమనండి.

శ్రీ రావెల కిషోర్ బాబు : అధ్యక్షా, గౌరవ శాసన పరిషత్తు సభ్యులకు నేను విన్నవించేదేమిటంటే.. మొత్తం అన్ని వ్యవస్థలను కూడా కుప్పకూల్చిన ఈ పరిస్థితులలో అవినీతి, దుర్మార్గం, దౌర్జన్యం, దోపిడీ వీటన్నింటితో అన్ని వ్యవస్థలను కుప్పకూల్చిన ప్రభుత్వాలు ఈరోజు వాటన్నింటిని సరిచేసే క్రమంలో మేము ముందుకు వెళుతున్నాము.

శ్రీ సి. రామచంద్రయ్య : అధ్యక్షా, వారు అధికారంలో ఉన్నారు. ఆయన చెప్పిన రిప్లై ఏమిటి? ప్రజలు వాళ్లకు అధికారం ఇచ్చారు. రాష్ట్రంలో వివిధ ఏజెన్సీలున్నాయి. వాళ్లకు రిఫర్ చేయండి. వాళ్లు చూస్తారు. వాళ్ల మెదళ్లలో వచ్చిన ఊహలతోనే అన్నీ అయిపోయినట్లు కలలు కంటున్నారు. వారి ఊహలకే అంతా అయిపోయినట్లు, ప్రజలంతా ఆనందపడిపోయినట్లు కలలు కంటున్నారు. ప్రతిసారి గత ప్రభుత్వం అని ఎందుకు అంటున్నారు? ఇది సరైన పద్ధతి కాదు.

శ్రీ రావెల కిషోర్ బాబు : అధ్యక్షా, బోర్‌వెల్స్ ఎనర్జైజేషన్ అనేది గిరిజనుల అభివృద్ధిలో ఒక అంశం. వారు (చంగల్ రాయుడు గారు) మాట్లాడుతూ సర్‌కాస్టిగా (ఎగతాళిగా ) మాట్లాడారు. కడప జిల్లా ఇన్–ఛార్జ్ అని మాట్లాడారు. అది అప్రస్తుతం. అల్లాఉద్దీన్ అద్భుత దీపం అని అర్థం వచ్చేటట్లుగా మాట్లాడారు. అది అప్రస్తుతం.

శ్రీ బి. చంగల్ రాయుడు : నేను అల్లాఉద్దీన్ అద్భుత దీపం అని ఏమీ మాట్లాడలేదు. కావాలంటే రికార్డులు చూచుకోండి. నేను పీఠాలు అని మాట్లాడాను.

శ్రీ రావెల కిషోర్ బాబు : అధ్యక్షా, ఏదేమైనప్పటికి, మా ప్రభుత్వం దళిత, గిరిజనుల అభివృద్ధికి, సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పడానికి ఒకే ఒక నిదర్శనం. దాని మీద చర్చకు రండి. నేను మాట్లాడుతాను. 2012-13 వ సంవత్సరంలో కేవలం రూ.19కోట్లు విడుదల చేసి మూడు వేల మందికి లబ్ది చేకూరిస్తే, ఈ సంవత్సరం ట్రైకార్ ద్వారా, ఎస్సీ కార్పోరేషన్ ద్వారా రూ.840కోట్లు విడుదల చేస్తున్నాము. దాదాపు 94 వేల మందికి ప్రత్యామ్నాయ ఉద్యోగవకాశాలు కల్పిస్తున్నాము.

అధ్యక్షా, ఈ ప్రభుత్వం మంచి పనులు చేస్తుందనే అసూయ తప్ప మరేమి లేదు. ఈ ప్రభుత్వం మంచి పనులు చేస్తుంది కాబట్టి మేము ప్రజలకు ముఖం చూపించుకోలేకపోతున్నామనే అసూయ.

మిస్టర్ ఛైర్మన్ : కిషోర్ బాబు గారు జనరల్‌గా మాట్లాడండి. ముందు మొదటి ప్రశ్నను పూర్తి చేయండి. అసలు ప్రశ్నకు ఆన్సర్ రావడం లేదు. ఇక్కడున్న సభ్యులందరూ సీనియర్సే.

శ్రీ యనమల రామకృష్ణుడు : అధ్యక్షా, సభ్యుల యొక్క ఆందోళన అర్థమైంది. ఇది రెండు డిపార్ట్‌మెంట్లకు సంబంధించిన ప్రశ్న. దీనిలో కొంత సమస్య ఉంది. ఎందుకంటే కంబైన్డ్ స్టేట్ విడిపోవడం వల్ల, ట్రైబల్ వెల్ఫేర్ కార్పోరేషన్ డివైడ్ కాకపోవడం వల్ల ఈ సమస్య వచ్చింది. ఏదేమైనప్పటికి కూడా, ఈ ట్రైబల్ ఎనర్జైజేషన్ బోర్‌వెల్స్ గురించి రెండు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన మంత్రులతో మాట్లాడి పరిష్కరించడం జరుగుతుందని తెలియజేస్తున్నాను.

## గిరిజన సలహా సమితి

**ప్రశ్న నెం. 7769(32)**

శ్రీమతి టి. రత్నాబాయి, **ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలో గిరిజన సలహా సంఘం ఏర్పాటు చేయబడిందా?

ఆ) అయితే, కమిటీ, దాని విధివిధానాలేమిటి?

గౌరవనీయులైన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి (శ్రీ రావెల కిషోర్ బాబు) :

అ & ఆ) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొదట 28-01-1958 తేదీ గల సాంఘిక సంక్షేమ, కార్మిక శాఖ, జి.ఓ.ఎం.ఎస్. నెం.117లో ఆంధ్రప్రదేశ్ గిరిజన సలహా సంఘం ఏర్పాటు చేయడమ యింది. జి.ఓ.ఎం.ఎస్.నెం.36లో ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ గిరిజన సలహా సంఘాన్ని తిరిగి ఏర్పాటు చేసింది. కమిటీ పదవీకాలం కాలపరిమితి 3 సంవత్సరాలుగా వుంది. రాష్ట్రాన్ని పునర్వ్యవస్థీకరించిన పర్యవసానంగా క్రొత్త సభ్యులతో గిరిజన సలహా సంఘాన్ని తిరిగి ఏర్పాటు చేయ వలసి వుంది. ఆంధ్రప్రదేశ్ గిరిజన సలహా సంఘాన్ని త్వరలో తిరిగి ఏర్పాటు చేయ డమవుతుంది.

శ్రీమతి టి. రత్నాబాయి (నామినేటెడ్)ః అధ్యక్షా, క్షేత్రస్థాయిలో జరిగిన లోపాలు ముఖ్యంగా 10 వేల ఉద్యోగాలు ప్లైవుడ్ ఫ్యాక్టరీకి ఇచ్చినటువంటి హామీలకు భిన్నంగా జరిగిన విషయంలో కాని, జలయజ్ఞంలో హామీలకు భిన్నంగా కోట్లాది రూపాయలు దారి మళ్లించిన విషయంలో కాని మీరు తీసుకున్న చర్యలు ఏమిటి? వీటి గురించి ప్రభుత్వ దృష్టికి ఏమైనా వచ్చిందా? వస్తే చెప్పమని కోరుతున్నాను.

శ్రీ ఎం.వి.ఎస్. శర్మ ః అధ్యక్షా, గిరిజన సలహా సంఘం అనేది యాక్టు 1/ 70 తో కలిపి చూసినప్పుడు ఆ కమిటీకి చాలా అధికారాలున్నాయి. గిరిజన సలహా సంఘం కన్సెంట్ లేకుండా ఏజెన్సీ ప్రాంతానికి సంబంధించి ఎటువంటి పథకాలను కూడా ప్రకటించే అధికారం ప్రభుత్వానికి లేదు. Governer is having extraordinary rights over the Fifth Scheduled Area. కాని, ఇంతవరకు ఆ గిరిజన సలహా సంఘాన్ని constitute చేయలేదు. But, Government is going ahead with its own declarations and proclamations about tribal development. ఇది కరెక్ట్ కాదని తెలియజేస్తున్నాను. బహుశా పొలిటికల్ కన్సిడరేషన్స్ ఏవైనా వీటి వెనుక ఉన్నాయా? ఎందుకు ఇంత కాలం ఆలస్యమైంది. Tribal Advisory Coucil consists of the elected MLAs from those areas. అప్పుడు శాసన పరిషత్తు లేదు. ఇప్పుడు శాసన పరిషత్తు వచ్చింది కాబట్టి గిరిజన ప్రాంతం నుండి ఎం.ఎల్.సీలను కూడా సభ్యులుగా కాకపోయినా కనీసం ప్రత్యేక ఆహ్వానితులుగానైనా పెట్టాలని గతంలో ఇదే హౌస్‌లో కోరడం జరిగింది. ఆ విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందా అనేది చెప్పాలి. Tribal Advisory Council ఏర్పాటు చేయడానికి ఆలస్యం అక్కరలేదు. దీనిని పరిశీలించడమనేది లేదు. It is a legal obligation. Government can't implement any policy decision without the concurrence of the TAC. It is not free to decide. దీనికి సంబంధించి సుప్రీంకోర్టు జడ్జిమెంట్లు కూడా ఉన్నాయి. కాని ఇంత కాలం ఆలస్యం చేయడమనేది కూడా itself is not legal. Are they going to correct and anounce the TAC which includes the MLCs from Tribal Areas.
ఇంక్లూడ్ చేయం అని అంటే చెయ్యం అని చెప్పమనండి.

మిస్టర్ ఛైర్మన్ ః ఎందుకు చెయ్యరు? చేస్తారు.

శ్రీ రావెల కిషోర్ బాబు ః అధ్యక్షా. ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్‌ను రెండు రాష్ట్రాలుగా విడిపోయినా కారణంగా సపరేట్ ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయవలసిన అవసరం వచ్చింది కాబట్టి కొంత ఆలస్యం జరిగిన మాట వాస్తవమే. అది ప్రాసెస్‌లో ఉంది. అయితే ఈ కౌన్సిల్లో వాస్తవానికి మెంబర్లుగా అందరూ ఎం.ఎల్.ఏలే ఉన్నారు. గౌరవ మండలి సభ్యులను కూడా మెంబర్లుగా నియమించమని అడిగారు. ఈ ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్‌కు సంబంధించినంతవరకు వారు చెప్పిన సలహాలను, సూచనలను తీసుకొని ముందుకు వెళ్లతామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్ ః ఇక్కడ నుండి కూడా కొంతమందిని తీసుకోండి. దానిలో సమస్య ఏముంది.

## దళిత పారిశ్రామిక వేత్తలకు పరిశ్రమలు

ప్రశ్న నెం. 7793(33)
శ్రీమతి పి.శమంతకమణి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలో దళిత పారిశ్రామికవేత్తలకు ఏమైనా మేజర్ ఇండస్ట్రీస్‌ను కేటాయించడం జరిగినదా?

ఆ) అయితే, వాటి వివరాలు ?

గౌరవనీయులైన ముఖ్యమంత్రి తరపున ఆర్థిక మరియు ప్రణాళిక శాఖ, వాణిజ్య పన్నులు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి (శ్రీ యనమల రామకృష్ణుడు)ః

అ) ప్రభుత్వం దళిత పారిశ్రామికవేత్తలతో సహా ఏ వ్యాపారవేత్తకూ మేజర్ ఇండస్ట్రీస్‌ను కేటాయించదు. కానీ పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక విధానం క్రింద ప్రోత్సాహకాలు మరియు ఎపిఐఐసి భూ కేటాయింపు నిబంధనల మేర ప్రోత్సాహకాలుగా భూ కేటాయింపులు సాధారణ పారిశ్రామికవేత్తలకంటే అధికముగా దళిత పారిశ్రామికవేత్తలకు ఇవ్వడం జరుగుతుంది.

ఆ) ప్రభుత్వం పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక విధానం 2005-10 మరియు 2010-15 క్రింద రాష్ట్రంలో ఎస్సీ పారిశ్రామికవేత్తలచే స్థాపించబడిన 886 సూక్ష్మ/చిన్న పరిశ్రమలకు 80.64 కోట్ల రూపాయలను, ఎస్టీ పారిశ్రామికవేత్తలచే స్థాపించబడిన 135 సూక్ష్మ/చిన్న పరిశ్రమలకు 14.60 కోట్ల రూపాయలను విడు దల చేసింది. ఎపిఐఐసి ఇప్పటివరకు 566 మంది ఎస్సీ/ఎస్టీ పారిశ్రామికవేత్త లకు 231.88 ఎకరముల భూమిని కేటా యించడంతోపాటుగా వివిధ రిబేటులు అనగా భూమి ధర, భూమి లీజు అద్దె, దరఖాస్తు సమయలో చెల్లింపవలసిన 10% భూమి ధరను మినహాయించడం వంటివి ఇవ్వబడును. క్రొత్త పారిశ్రామిక పార్కులలో ఎస్సీ పారిశ్రామికవేత్తలకు 16.2% ప్లాట్లు, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు 6% ప్లాట్లు కేటాయించబడుతున్నాయి. ప్రస్తుతం ఉన్న పారిశ్రామిక పార్కులలో, ప్రతిపాదిత 16.2% మరియు 6% కేటాయంపులు చేరుకునేవరకు ఎస్సీ-ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ఖాళీ ప్లాట్లను కేటాయించడంలో ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

శ్రీమతి పమిడి శమంతకమణి (శాసనసభ నియోజకవర్గం)ః అధ్యక్షా, మేము భారీ పరిశ్రమల గురించి అడిగాము. మంత్రి గారు మాత్రం మినీ పరిశ్రమల గురించి, ఎస్సీలకు ఇస్తున్న ప్రోత్సహకాల గురించి చెప్పారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో ఇండస్ట్రీ పాలసీని కొత్తగా తీసుకుని వచ్చారా? రెండవది, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ఇండస్ట్రీ పాలసీని ఎప్పుడు తీసుకొని వస్తారు? వాటిలో ఉన్న ముఖ్యాంశాలు ఏమిటి? ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక ఔత్సాహికుల గురించి ఏమైనా ఆలోచన చేస్తారా?

శ్రీ యనమల రామకృష్ణుడు ః అధ్యక్షా, ఇప్పటి వరకు కూడా existenceలో ఉన్న ఇండస్ట్రీ పాలసీలో ఉన్న బెనిఫిట్స్ గురించి నేను చెప్పడం జరిగింది. భవిష్యత్తులో కొత్త ఇండస్ట్రియల్ పాలసీ వస్తుంది. ఆ ఇండస్ట్రీ పాలసీలో కూడా వీటి గురించి కూడా ఎగ్జామిన్ చేస్తాము. ఇంతకంటె ఎక్కువ

బెనిఫిట్స్‌ను ఇవ్వడానికి అవకాశం ఉన్నప్పుడు వాటిని కూడా ఇవ్వడానికి పరిశీలిస్తాము. ఎందుకంటే, సమాజంలో ఉన్నటువంటి అట్టడుగు వర్గాల వారిని inclusive growth లోకి తీసుకురావాలనేది తెలుగుదేశం ప్రభుత్వం యొక్క ఆలోచన. Inclusive growth రావాలంటే వాళ్లు కూడా పరిశ్రమలు పెట్టుకోవాల్సిన అవసరముంది. వాళ్లు పరిశ్రమలు పెట్టుకోవడానికి ఇప్పుడు కొన్ని పాలసీలున్నాయి. భవిష్యత్తులో కూడా మరిన్ని మెరుగైన పాలసీలను తీసుకురావడానికి ఇండస్ట్రీ పాలసీ గురించి వర్కవుట్ చేస్తున్నాము. త్వరలోనే కొత్త ఇండస్ట్రీ పాలసీ నవ్యాంధ్రలో రావడానికి అవకాశముంది. దానిలో వీరికి కావలసిన బెనిఫిట్స్‌ను ఇవ్వడానికి తప్పకుండా పరిశీలించడం జరుగుతుంది.

రెండవది, ఇప్పటికే ఎస్సీ, ఎస్టీల సంబంధించి already చెప్పడం జరిగింది. భవిష్యత్తులో బి.సీలకు, ఈబిసీలను కూడా కన్సిడర్ చేయవలసిన అవసరముంది. ఉమెన్‌గ్రూప్‌కు కొంత మేరకు చేశారు. కాకపోతే, వీరికిచ్చిన small and medium ఇండస్ట్రీలు ఏవైతే ఉన్నాయో అవి సరిగా పనిచేయడం లేదు. అందుచేత వీటన్నింటిని re-orient చేయవలసిన అవసరముంది. ఫరదర్‌గా వాళ్లను బలోపేతం చేస్తే తప్ప వాళ్లు ఇండస్ట్రీని నడుపుకునే పరిస్థితిలో లేరు కాబట్టి దాని గురించి కూడా ఆలోచిస్తాము. మేజర్ ఇండస్ట్రీలను పెట్టుకోవడానికి వాళ్లకు కెపాసిటీ ఉండదు. మేజర్ ఇండస్ట్రీలను పెట్టే సందర్భంలో ఇండస్ట్రీ పాలసీ ప్రకారంగా వాళ్లకు వచ్చే బెనిఫిట్స్ కంటే అవతల తీసుకున్న బెనిఫిషరీస్ ఎవరైతే ఉన్నారో వారికి ఎవరినైనా ఎంటర్‌ప్రెన్యువర్స్‌ను ఎక్కువగా పెట్టుకోగల శక్తి ఉన్నట్లయితే వారికి కూడా ప్రోత్సాహకాలు ఇస్తామని తెలియజేస్తున్నాను.

## లిడ్‌క్యాప్‌ద్వారా లెదర్ పార్క్‌లు

ప్రశ్న నెం. 7783(34)
శ్రీమతి పి.శమంతకమణి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) గతంలో లిడ్ క్యాప్ ద్వారా లెదర్ పార్కులను నిర్మించిన విషయం వాస్తవమేనా?
ఆ) అయితే, సదరు పార్కుల ప్రస్తుత పరిస్థితి ఏమిటి ?

గౌరవనీయులైన ముఖ్యమంత్రి తరపున ఆర్థిక మరియు ప్రణాళిక శాఖ, వాణిజ్య పన్నులు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి ( శ్రీ యనమల రామకృష్ణుడు)ః

అ) అవునండి.
ఆ) లిడ్ క్యాప్ ద్వారా ఆంధ్రప్రదేశ్ లోని వివిధ జిల్లాలలో ఉత్పాదక మరియు శిక్షణ ఉద్దేశ్యంతో ఈ క్రింది 9 చిన్న లెదర్ పార్కులను స్థాపించడమైంది. 2003లో ప్రవేశపెట్టబడిన "మలుపు కార్యక్రమం" ద్వారా, 25 ఎకరాల భూమి గల ప్రతీ పార్కునందు చర్మకారులు పాదరక్షల ముడి పదార్థాలను శుద్ధి చేయడం జరుగుతుంది. పార్కు వారీ ప్రస్తుత పరిస్థితి మరియు వాటి వివరాలను ఈ క్రింది విధంగా కలవుః

1) విజయనగరం జిల్లాలోని అడ్డపుశీల పార్కుః ఆధీనంలో గల 25 ఎకరాల భూమిలో, 15.76 లక్షల రూపాయల విలువ గల షెడ్డు నిర్మించబడింది.

2) గుంటూరు జిల్లాలోని అడిగొప్పుల పార్కు: ఆధీనంలో గల 34.25 ఎకరాల భూమిలో, 14.60 లక్షల రూపాయల విలువ గల షెడ్డు నిర్మించబడింది. 6.82 లక్షల రూపాయల విలువ గల పాదరక్షల తయారీ యంత్రసామాగ్రి అందుబాటులో కలదు.

3) ప్రకాశం జిల్లాలోని యడవల్లి పార్కు : ఆధీనంలో గల 27.18 ఎకరాల భూమిలో, 17.25 లక్షల రూపాయల విలువ గల షెడ్డు నిర్మించబడింది.

4) అనంతపురం జిల్లాలోని రాచేపల్లి పార్కు: ఆధీనంలో గల 42.28 ఎకరాల భూమిలో, 24.18 లక్షల రూపాయల విలువ గల భవనం నిర్మించబడింది. 6.82 లక్షల రూపాయల విలువ గల పాదరక్షల తయారీ యంత్ర సామాగ్రి అందుబాటులో కలదు.

5) అనంతపురం జిల్లాలోని R. అనంతపురం పార్కు : ఆధీనంలో గల 23.79 ఎకరాల భూమిలో, 14.00 లక్షల రూపాయల విలువగల షెడ్డు నిర్మించబడింది. 0.32 లక్షల రూపాయల విలువ గల పాదరక్షల తయారీ యంత్ర సామాగ్రి అందుబాటులో కలదు.

6) శ్రీకాకుళం జిల్లాలోని వెన్నెలవలస పార్కు : ఆధీనంలో గల 1 ఎకరం భూమిలో, 16.06 లక్షల రూపాయల విలువ గల భవనం నిర్మించబడింది. 8.72 లక్షల రూపాయల విలువ గల పాదరక్షల తయారీ యంత్ర సామాగ్రి అందుబాటులో కలదు.

7) కృష్ణా జిల్లాలోని నూజివీడు పార్కు: 17.65 లక్షల రూపాయల విలువ గల భవనం నిర్మించబడింది మరియు 6.82 లక్షల రూపాయల విలువగల పాదరక్షల తయారీ యంత్ర సామాగ్రి అందుబాటులో కలదు.

శ్రీమతి పి. శమంతకమణి : అధ్యక్షా, గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ' మలుపు' అనే కార్యక్రమం క్రింద ముఖ్యంగా ఎస్సీలలో ఉప కులమైన మాదిగలకు కులవృత్తిగా ఉన్న చర్మకారుల గురించి ఈ 'మలుపు' కార్యక్రమం తీసుకురాబడింది. అప్పుడు ఆనాటి ప్రభుత్వంలో ఇక్కడ కూర్చున్న బొజ్జల గోపాలకృష్ణా రెడ్డి గారు సంబంధిత మంత్రిగా ఉన్నారు. ఆయన సమక్షంలో 76 మినీ పార్కులు, 16 మీడియం పార్కులు, 5 మెగా పార్కులను కొన్ని కోట్ల రూపాయల ఖర్చుతో ఈ పథకాన్ని తీసుకురాబడింది. ఎందుకంటే.. 10 వతరగతి, ఇంటర్ చదివిన నిరుద్యోగులైన మాదిగ యువకులకు వాళ్ల కులవృత్తిగా ఈ కార్యక్రమం తీసుకురాబడింది. మూడు నెలలు చెన్నైలో శిక్షణ ఇచ్చి, వారికి తర్ఫీదునిచ్చి, వారికి మిషనరీని ఇచ్చి మంచి మినీ పార్కులను, మెగా పార్కులను ఏర్పాటు చేయడం జరిగింది. తద్వారా నిరుద్యోగులైన వారందరూ కూడా వారు ట్రైనింగ్ పొందిన తరువాత, కొద్దో, గొప్పో ఆ స్కిల్ నేర్చుకున్న తరువాత వాళ్లు చిన్న, చిన్న పారిశ్రామికవేత్తలుగా తయారు కావడం జరిగింది. కాని, ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం వీళ్లను కాలరాచింది. అది మాకు బాధగా ఉంది. ఇప్పుడు మాకు కొత్తగా ఆ భయం పట్టుకుంది. గతంలో జరిగిందే మరల ఇప్పుడు జరుగుతుందా అనేది మా భయం. గతంలో ఎస్సీ కార్పోరేషన్ నిధులన్నింటిని దారి మళ్లించడం జరిగింది. లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి ఏర్పాటు చేయబడ్డ మినీ పార్కులను, మెగా పార్కులన్నీ మూతవేశారు. అక్కడున్న భవనాలన్నీ అసాంఘిక వ్యక్తులతో నిండిపోయి ఉన్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ వాళ్లు ఏదేదో మాట్లాడుతున్నారు. వెళ్లి చూద్దాం రమ్మనమనండి.

(అంతరాయం)

నేను కోరేదేమిటంటే, గత ప్రభుత్వం చేసిన చర్యలను మరల ఈ ప్రభుత్వం చేయవద్దని కోరుతున్నాను. మా మాదిగ నిరుద్యోగ యువకులకు భవిష్యత్తును ఏర్పాటు చేయండి. 'కులవృత్తులకు మించింది లేదు గువ్వల చెన్నా' అని అన్నారు. గత ప్రభుత్వం చేసిన మాదిరిగా ఈ ప్రభుత్వం చేయకూడదని మనవి చేస్తూ, దానికి కావలసిన సమాధానం ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.

ఉ.10.50

శ్రీ యనమల రామకృష్ణుడు : అధ్యక్షా, గతంలో ఏం జరిగినప్పటికీ, భవిష్యత్తులో మాత్రం ఆ విధంగా జరగకుండా చూసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది. మంచి ఉద్దేశ్యంతోనే లిడ్‌క్యాప్ సంస్థను ప్రారంభించడం జరిగింది. కానీ, ఇప్పుడు లిడ్‌క్యాప్ అంతగా పనిచేయడం లేదు. అక్కడక్కడా లిడ్‌క్యాప్ బడ్డీలు కూడా ఉన్నాయి. ఇటువంటి వాటితో వాళ్లకు పెద్దగా ఒరిగేది ఏమీ లేదు. ప్రస్తుతం ఆ వృత్తులు చేసేవారు కూడా తగ్గిపోయారు. అయితే, పార్కులు అభివృద్ధి చేసి కొత్తవారికి శిక్షణనిచ్చి వాళ్ల స్కిల్స్‌ను అప్‌గ్రేడ్ చేసి నియమించినట్లైతే, బహిరంగ మార్కెట్‌లో వారు నెగ్గుకు రాగలుగుతారు. అందుకు Skill Development Corporation ఉంది. దాని ద్వారా వీళ్లందరికీ శిక్షణనివ్వచ్చు. అలాగే తగు ఆర్థిక సహాయమందించి లిడ్‌క్యాప్‌ను re-orient చేయవలసిన అవసరం ఉన్నది. అర్హతగల వారికి తగు రాయితీలు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తామని మనవి చేస్తున్నాను.

## విశాఖపట్టణంలో కాలుష్యం

ప్రశ్న నెం. 7720(35)
శ్రీ అంగర రామమోహన్, ఎం.ఎల్.సి.,

గౌరవ అడవులు, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక విజ్ఞాన శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) విశాఖపట్టణం ఓడరేవు ప్రాంతంలో గాలిలో బొగ్గు, ఇనుముల ధూళి విడుదల కావడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారా ?

ఆ) అయితే, కాలుష్యాన్ని నియంత్రించడానికి ప్రభుత్వంచే తీసుకున్న చర్యలు ఏమిటి?

గౌరవ అడవులు, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక విజ్ఞాన శాఖ మంత్రి (శ్రీ బి. గోపాలకృష్ణారెడ్డి):

అ) అవునండీ.

ఆ) ఓడరేవు కార్యకలాపాలను కాలుష్య నియంత్రణ మండలి నిరంతరంగా పర్యవేక్షిస్తూ, ఆ ప్రాంతంలో సమస్యను తగ్గించడానికి ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నది.

శ్రీ అంగర రామమోహన్ (స్థానిక సంస్థలు, పశ్చిమ గోదావరి)ః సమాధానం సంతృప్తికరంగానే ఉన్నది సార్.

శ్రీ రుద్రరాజు పద్మరాజుః అధ్యక్షా, విశాఖపట్టణంలో మరీ ముఖ్యంగా పాత విశాఖపట్టణంలో ఎప్పటి నుంచో బొగ్గు, ఫాస్ఫరస్ దిగుమతి అవుతున్నది. ఇవి దిగుమతి చేసేటప్పుడు జరిగే ట్రాన్స్‌పోర్టు వల్ల అక్కడ పరిస్థితి ఎంతో దయనీయంగా మారింది. అక్కడ వాతావరణం అంతా కాలుష్యభరితమై fragment లాగా అనిపిస్తున్నది. ఈ పరిస్థితులలో అక్కడ నివాసముంటున్న ప్రజలు తమ బాధను వ్యక్తం చేసినప్పుడు అప్పటికప్పుడు ఏదో నీటిని చల్లి తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నారే తప్ప concrete steps తీసుకోవడం లేదు. మంత్రిగారు అనుభవజ్ఞులు కాబట్టి, దయచేసి ఈ అంశంపై అధ్యయనం చేసి తగు చర్యలు తీసుకుని స్థానికంగా ఉన్నవారికి ఇబ్బంది లేకుండా చూడాలని తమ ద్వారా కోరుతున్నాను.

శ్రీ బి. గోపాల కృష్ణారెడ్డి ః అధ్యక్షా, పద్మరాజు గారు చెప్పిన విషయాలు నోట్ చేసుకున్నాను, మా అధికారులకు చెప్పి తగు చర్యలు తీసుకుంటాము.

మిస్టర్ ఛైర్మన్ః ఈ మధ్య విశాఖపట్టణం కాలుష్యంపై చాలా డిబేట్లు జరిగాయి, ఆర్టికల్స్ కూడా వచ్చాయి. విశాఖపట్టణంలో వాతావరణ కాలుష్యం చాలా ఎక్కువగా ఉంటోంది.

శ్రీ బి.గోపాల కృష్ణారెడ్డి ః అది జనరల్ సబ్జెక్ట్ సార్. But, this question pertains to Vishakapatnam Port.

మిస్టర్ ఛైర్మన్ ః ఈ మధ్య తిరుపతిలో నేషనల్ సెమినార్ జరిగింది. అప్పుడు కూడా ఈ సబ్జెక్ట్ వచ్చింది. పట్టణాలలో వాతావరణ కాలుష్యం పెరిగిపోతోంది.

MR. CHAIRMAN: Question No. 7650 (36) postponed at the request of the Member.

## హుద్‌హుద్ బాధిత రైతులకు నష్టపరిహారం

ప్రశ్న నెం. 7666 (37)
సర్వశ్రీ మహ్మద్ జానీ, ఆదిరెడ్డి అప్పారావు, మెట్టు గోవింద రెడ్డి, ఎం.ఎల్.సి.లు.,

గౌరవనీయులైన ఉపముఖ్యమంత్రి (హోం & విపత్తు నిర్వహణ)గారు, దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

(అ) హుద్‌హుద్ తుఫాను కారణంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు జరిగిన మరియు నష్టపోయిన పంటల నష్టం జిల్లావారీగా తెలుపండి;

(ఆ) పునరావాస కార్యక్రమాలు చేపట్టడానికి ప్రజలు, ప్రైవేటు సంస్థలు & వ్యక్తుల నుండి అందిన నిధుల వివరాలు ఏమిటి?

(ఇ) పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఏమిటి?

గౌరవనీయులైన ఉపముఖ్యమంత్రి (హోం & విపత్తు నిర్వహణ శాఖమంత్రి శ్రీ నిమ్మకాయల చినరాజప్ప):

(అ)

| వరుస సంఖ్య | జిల్లా పేరు | గృహనిర్మాణంతో కలుపుకొని వ్యవసాయ& అనుబంధ రంగాలు | ప్రభుత్వ ఆస్తులు | ప్రైవేటు ఆస్తులు | మొత్తం (రూ.లక్షలలో) |
|---|---|---|---|---|---|
| 1. | శ్రీకాకుళం | 53084.82 | 111086.9 | 62678.7 | 226850 |
| 2. | విజయనగరం | 136271.98 | 168106.6 | 105645 | 410023 |
| 3. | విశాఖపట్టణం | 371187.06 | 534218.6 | 572204 | 1477610 |
| 4. | తూర్పుగోదావరి | 23025.59 | 51677.13 | 589.526 | 75292 |
| 5. | పశ్చిమ గోదావరి | 0.00 | 1067.37 | 0.00 | 1067 |
| | మొత్తం | 583569.44 | 8,66,156.6 | 7,41,117.0 | 21,90,843 |

(ఆ) 16-12-2014 నాటికి మొత్తం రూ.1,28,61,35,000/- (ఒక వంద ఇరువది ఎనిమిది కోట్ల అరువది ఒక్క లక్ష ముప్పై ఐదు వేలు మాత్రమే) హుద్‌హుద్ తుఫాను సహాయ నిధికి అందింది.

(ఇ) అవునండీ, హుద్‌హుద్ తుఫాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు సహాయంగా ఉద్యానవన శాఖకు రూ.20,895.35 లక్షల మొత్తాన్ని, వ్యవసాయ శాఖకు రూ.14,036.83 లక్షల మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేసింది.

శ్రీ మహ్మద్ జానీ (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, నేను చర్యలు ఏమిటీ అని ప్రశ్నిస్తే, నష్టం గురించి చెప్పారు కానీ, తీసుకున్న చర్యలు చెప్పలేదు. తీసుకున్న చర్యల గురించి చెప్పవలసిందిగా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ నిమ్మకాయల చినరాజప్ప : తుఫాను వచ్చిన వెంటనే రైతులకు పెద్ద నష్టం జరిగింది. ఆ నష్టాన్ని పూడ్చడం కోసం చర్యలు తీసుకోవడం జరిగింది. ఇతర జిల్లాల నుండి కూడా తీసుకువచ్చి ఎన్యూమరేషన్ చేయించి ఎంత నష్టపోయిందో నిర్ణయించడం జరిగింది. దాదాపు 2,39,781 మంది రైతులు నష్టపోయారు. దెబ్బతిన్న ప్రాంతం 81,455 హెక్టారులు. మంజూరైన ఇన్‌పుట్ సబ్సిడీ రూ.208కోట్లు. ఈ మొత్తాన్ని జిల్లాలకు పంపించడం జరిగింది. జిల్లా అధికారులు రైతుల అకౌంట్‌లకు అడ్జస్ట్ చేయడం జరుగుతున్నది.

శ్రీ మహ్మద్ జానీ : నష్టం గురించి చెప్పారు. బాగుంది. రైతులకు ఎంత మొత్తం చెల్లించారు, ఎంత మంది రైతులకు అందింది? శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో ఎంతమంది రైతులకు చెల్లించారో చెప్పాలని మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ నిమ్మకాయల చినరాజప్ప : అధ్యక్షా, మొత్తం 5 జిల్లాలలోనూ కలిపి మొత్తం 2, 39, 781 మంది రైతులను గుర్తించాము. అలాగే, 81,451 హెక్టారుల పంట నష్టపోయినట్లుగా గుర్తించడం జరిగింది. వారికి రూ.208 కోట్ల 95 లక్షలు డబ్బు రిలీజ్ చేసి ఆయా జిల్లాలకు అడ్జస్ట్ చేయడం జరిగింది. జిల్లాలలోని అధికారులు ఆయా గ్రామాలలోని రైతుల అకౌంట్లకు నాలుగైదు రోజులలో జమ చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమం త్వరలోనే పూర్తవుతుందని మనవిచేస్తున్నాను.

## తుఫాను షెల్టర్ల నిర్మాణం

ప్రశ్న నెం. 7730(38)
శ్రీ అంగర రామమోహన్, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన ఉపముఖ్యమంత్రి (విపత్తు నిర్వహణ శాఖ మంత్రి)గారు, దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలోని తుఫాను షెల్టర్లు శిథిలావస్థలో ఉన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా?
ఆ) అయితే, తీరప్రాంతాలలోని సురక్షిత ప్రాంతాల వద్ద కొత్త షెల్టర్లను నిర్మించడంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటి?

గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి, హోం మరియు విపత్తు నిర్వహణ శాఖ (శ్రీ నిమ్మకాయల చిన రాజప్ప):

అ) అవునండీ, కొన్ని తుఫాను షెల్టర్లు శిథిలావస్థలో ఉన్నాయని ప్రభుత్వం దృష్టికి వచ్చింది.
ఆ) జాతీయ తుఫాను నష్టనివారణ ప్రాజెక్టు (ఎన్‌సిఆర్‌ఎంపి) క్రింద తీరప్రాంతాలలోని వివిధ ప్రదేశాలలో బహుళ ప్రయోజన తుఫాను షెల్టర్ (ఎంపిసిఎస్) భవనాల నిర్మాణాన్ని చేపట్టడమయింది.

శ్రీ అంగర రామ మోహన్ : తుఫాను వచ్చినప్పుడు గుర్తించబడ్డ ప్రాంతాలలో ఇప్పుడున్న షెల్టర్లు శిథిలావస్థకు చేరాయి. తుఫానులు వచ్చినప్పుడు బాధితులు దూర ప్రాంతాలలో షెల్టర్లుగా అక్కడున్న పాఠశాలలకు వెళ్లమంటే వెళ్లలేకపోతున్నారు. కాబట్టి, బాధితులకు తీరప్రాంతాలలోని సురక్షిత ప్రాంతాలకు దగ్గరలోనే షెల్టర్ల నిర్మాణాలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఉ.11.00

శ్రీ ఎస్.చినరాజప్ప: అధ్యక్షా, తుఫాను షెల్టర్లకు సంబంధించి చర్యలు తీసుకోవడంపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోవడం జరిగింది. మొత్తం 1130 తుఫాను షెల్టర్లు ఉన్నాయి. మరమ్మత్తులు చేయవలసినవి 623 తుఫాను షెల్టర్లు, శిథిలావస్థలో ఉన్నవి 128 తుఫాను షెల్టర్లు, కొత్తగా నిర్మించవలసినవి 138 తుఫాను షెల్టర్లు ఉన్నాయి. అదనపు సహాయం కోసం 84 తుఫాను షెల్టర్లతో కలిపి మొత్తం 222 తుఫాను షెల్టర్లను 2015 వ సంవత్సరంలోపు నిర్మించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తమరిద్వారా గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను.

## కడప జిల్లా, బద్వేల్ వద్ద సాగిలేరు ప్రాజెక్టు

ప్రశ్న నెం. 7767 (39)
శ్రీ పి.జె.చంద్రశేఖర్ రావు, ఎం.ఎల్.సి.

గౌరవనీయులైన సాగునీటి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) దిగువ సాగిలేరు ప్రాజెక్టు షట్టర్లు శిథిలావస్థ స్థితిలో ఉన్న విషయం వాస్తవమేనా?

ఆ) ఈ విషయంలో తీసుకున్న చర్య ఏమిటి?

గౌరవనీయులైన సాగునీరు ఆయకట్టు అభివృద్ధి మరియు నీటి వనరుల నిర్వహణ శాఖ (శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు):

అ) లేదండీ, దిగువ సాగిలేరు ప్రాజెక్టు ఐదు షట్టర్లు కలిగి ఉండగా, వాటిలో నాలుగు షట్టర్లు పనిచేస్తున్న స్థితిలో ఉన్నవి. ఒక షట్టరు యొక్క కౌంటర్ వెయిట్ దెబ్బతిన్నది.

ఆ) దిగువ సాగిలేరు ప్రాజెక్టు షట్టర్లకు మరమ్మత్తుల కోసం సవివరమైన అంచనాను తయారు చేయడమయింది. ఆమోదం కోసం ఇది ప్రాసెస్‌లో ఉన్నది.

శ్రీ పి.జె. చంద్ర శేఖర రావు: అధ్యక్షా, ఈ దిగువ సాగిలేరు ప్రాజెక్టు షట్టర్లయొక్క శిథిలావస్థ మరియు వాటి ప్రస్తుత పరిస్థితి గురించి అధికారులు మరియు ప్రభుత్వానికి అక్కడున్న ప్రజలు వివరించిన విషయం గురించి మంత్రిగారు మాట్లాడుతూ, నాలుగు షట్టర్లు పనిచేస్తున్న స్థితిలో ఉన్నాయని చెప్పారు. ఆ ప్రజలు ఇచ్చిన రిప్రజెంటేషన్ ప్రకారం వాటిని తక్షణమే మరమ్మత్తులు చేయకపోతే తీవ్రమైన నష్టం జరుగుతుందనే అవకాశమున్న దృష్ట్యా మొత్తం ఐదు షట్టర్లను పునఃపరిశీలించి వీలైనంత త్వరలో నిధులను కేటాయించి ఆ పనులను ప్రభుత్వం చేపట్టాలని తమరిద్వారా మంత్రిగారిని నేను కోరుతున్నాను.

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు: అధ్యక్షా, షట్టర్ల మరమ్మత్తులకు సంబంధించి సవివరమైన ఎస్టిమేట్‌ను తయారుచేసి ప్రాసెస్‌లో పెట్టమని చెప్పాము. సుమారు రూ. 49 లక్షల వరకు ఆ పనులకోసం ఖర్చవుతుందని నివేదిక వచ్చింది. తప్పకుండా ఈ సీజన్‌లోనే ఆ పనులు పూర్తిచేయడం జరుగుతుంది.

MR. CHAIRMAN: Next question (last question i.e. LCQ No.7727) is postponed at the request of the Member. Now, questions are over. Question Hour is also over.

ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్య విధాన, కార్యక్రమ నిర్వహణ తాత్కాలిక నియమావళిలోని

**329 (1) నియమాన్ని అనుసరించి సభా సమక్షంలో ఉంచే పత్రాలు**

Item No. II – All the papers deemed to have been laid on the Table.

PAPERS LAID ON THE TABLE

A copy of the Letter No.RS.1/35/2014-B, dated 25th August, 2014 from the Secretary General, Rajya Sabha together with a copy in each of the following:-

1. The Constitution (One Hundred and Twenty-First Amendment) Bill, 2014 as introduced in Lok Sabha.

2. The Constitution (One Hundred and Twenty-First Amendment) Bill, 2014 as passed by the Houses of Parliament.

3. The National Judicial Appointments Commission Bill, 2014 as introduced in Lok Sabha.

4. The National Judicial Appointments Commission Bill, 2014 as passed by the Houses of Parliament.

5. Debates of Lok Sabha.

6. Debates of Rajya Sabha.

We will continue the short discussions after tea-break. Now, tea-break for 15 minutes.

(Then the House adjourned at 11.03 a.m. for 15 Minutes Tea-Break)

ఉ. 11.30

THE HOUSE RE-ASSEMBLED AT 11.37 A.M.
(HON'BLE CHAIRMAN IN THE CHAIR)

* * *

## సభా కార్యక్రమం – ప్రత్యేక ప్రస్తావన

MR. CHAIRMAN: Now, I will take up Special Mention.

శ్రీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి : అధ్యక్షా, మన రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి మండలం, వెంకటగిరికి 10 కిలో మీటర్ల సమీపంలో 2008లో యంపిటిసి, బిహెఇయల్ అనే రెండు మహారత్న కంపెనీలు కలిసి యంపిపియల్‌ను ఏర్పాటు చేయడం, తరువాత 2009 అక్టోబరు 10వ తేదిన ప్రధానమంత్రిగారు పెద్ద ప్రాజెక్టు అయిన యంపిపిటిసికి శంఖుస్థాపన చేయడం జరిగింది. రూ.6000 కోట్లతో బహుశా విశాఖ ఉక్కు తరువాత అలాంటి ఒక పెద్ద పబ్లిక్‌ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఇది. టర్బైన్స్, బాయిలర్స్, జనరేటర్లను ఉత్పత్తి చేయాలనేది ఆ కంపెనీ లక్ష్యం. ఆ రోజుల్లో ఈ ప్రాజెక్టుకోసం మహారాష్ట్ర, హిమాచల్ వంటి అనేక ఇతర రాష్ట్రాలు పోటీ పడ్డాయి. కానీ మన రాష్ట్రం వెంటనే 750 ఎకరాల స్థలాన్ని కేటాయించడం ద్వారా ఆ ప్రాజెక్టును సాధించుకోవడం జరిగింది. దీని వల్ల 6000 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు, 15000 మందికి పరోక్ష ఉద్యోగాలు రావడానికి, 18 అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉంది. కానీ ఈ నిర్మాణం 2010 తరువాత నత్తనడక నడిచింది. కానీ ప్రస్తుత పరిస్థితిని పరిశీలించినట్లయితే, దాని లక్ష్యంలో కొంత మార్పులు చేసి గ్యాస్ మిషన్స్, యాష్ హ్యాండ్లింగ్ మిషన్స్, కోల్ హ్యాండ్లింగ్ మిషన్స్‌గా మార్చడం, ఇందుకు కేవలం రూ.200 కోట్లు మాత్రమే సరిపోతుందనడం, 100 ఉద్యోగాలు మాత్రమే దీని వల్ల వస్తాయనే సమాచారం ఉంది. కాబట్టి అటువంటి పెద్ద పబ్లిక్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీని కాపాడుకోవాల్సిన బాధ్యత మనకు ఉందని మీ ద్వారా సభకు తెలియజేస్తున్నాను. ఇందుకు ప్రభుత్వం కూడా తగు చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నాను.

ఉ11.40

## రాష్ట్రంలో కరవు పరిస్థితిపై లఘు చర్చ – ఉప ముఖ్యమంత్రి ప్రత్యుత్తరం

MR CHAIRMAN : Now, reply by the Deputy Chief Minister on drought.

శ్రీ ఎన్. చినరాజప్ప ః అధ్యక్షా, నైఋతి రుతుపవనాల కారణంగా రాష్ట్రంలో సాధారణంగా రావాల్సిన 554.1 మీటర్ల వర్షపాతం కంటే తక్కువగా కేవలం 357.7 మిల్లీమీటర్లు మాత్రమే 2014 సంవత్సరంలో నమోదైంది. 2014 నైరుతీ రుతుపవనాల కాలంలో 664 మండలాలకుగాను 541 మండలాలలో లోటు వర్షపాతం నమోదైంది. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 664 మండలాలకుగాను 12 అధికం, 111 సాధారణం, 448 లోటు, 93 అత్యల్ప మండలాలుగా వర్గీకరించడమైంది. 2014 ఖరీఫ్ కాలంలో కరువుమండలాల ప్రకటన కోసం 13 జిల్లాల కలెక్టర్లను కూడా ప్రతిపాదనలిమ్మని కోరడం జరిగింది. అందులో శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి ఈ నాలుగు జిల్లాలు మినహా మిగిలిన జిల్లాలకు సంబంధించిన 324 మండలాలకు ఈ ప్రతిపాదన పంపించడం జరిగింది. 9.12.2014న కరువు మండలాలపై అధికారులతో సమావేశం నిర్వహించాము. 226 మండలాలను కరువు మండలాలుగా గుర్తిస్తూ 17.12.2014న జీ.ఓ నెం.17ను విడుదల చేయడం జరిగింది. అందులో అనంతపూర్ 59, కడప 48, కర్నూలు 12, ప్రకాశం 54, చిత్తూరు 42, నెల్లూరు 7, గుంటూరు 4 మండలాలను కరువు మండలాలుగా నిర్ధారించాము. ఈ మండలాలలో ప్రతికూల వాతావరణం ఉంది కనుక 2014 సంవత్సరంలో వ్యవసాయాన్ని ప్రత్యేక పంటలకు మార్చాలని ప్రభుత్వం నిర్ణయించి కందులు, మొక్కజొన్న, ఉలవ, జొన్న, పెసలు, మినుములు, కొర్రలు, సజ్జలు, ఆముదము, నువ్వులు, వేరుశెనగ, రాగి వంటి పంటలను ప్రత్యామ్నాయ పంటలుగా మార్చడం జరిగింది. అలాగే కంటింజెంట్ ప్లాన్ కింద ఆచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలను సంప్రదించి విత్తనాలను సరఫరా చేయడానికి ప్రణాళిక రూపొందించడం జరిగింది. అలాగే ఉద్యానశాఖకు సంబంధించి 2014 ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం తక్కువ కారణంగా కాయగూరల పంటల విస్తీర్ణం లక్షా ఐదువేల హెక్టారుకు గణనీయంగా పడిపోయింది. అందుచేత కరువు నివారణలో భాగంగా కోటి రూపాయల విలువగల కాయగూరల విత్తనాల మినీకిట్లను రాయితీపై సరఫరా చేయడం జరిగింది.

అనంతపురం, చిత్తూరు, కడప, కృష్ణా, కర్నూలు, నెల్లూరు ఈ ఏడు జిల్లాలలో 617 గ్రామాలలో త్రాగునీటి సమస్య వచ్చింది. దీనికోసం ప్రభుత్వం జీ.ఓ.143 ద్వారా రు.17.55 కోట్లు విడుదల చేసింది. అయితే 110 పురపాలక సంఘాలలో నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. రోజుకు ఒకసారి 67 పురపాలక సంఘాలు, రెండు రోజులకు ఒకసారి 35 పురపాలక సంఘాలు, మూడు రోజులకు ఒకసారి 7 పురపాలక సంఘాలు, నాలుగు రోజులకు ఒకసారి ఒక పురపాలక సంఘానికి త్రాగునీరు ఇవ్వడం జరుగుతుంది. నీటి పరిస్థితిని గమనించి ముఖ్యంగా మదనపల్లె, పుంగనూరు, గుత్తి, హిందూపూర్, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, బద్వేలు, ఆత్మకూరు పురపాలక సంఘాలలో చాలా సమస్య ఉంది. వీటన్నింటినీ గమనించి ప్రభుత్వం కొన్ని పురపాలక సంఘాలకు కొన్ని ప్రాజెక్టులను అప్రైజ్‌చేసింది. అందులో 9 పురపాలక సంఘాలకు రు.644 కోట్లు, చేయాల్సిన 3 పురపాలక సంఘాలకు రు.317 కోట్లు, ప్రతిపాదన పంపాల్సిన 3 పురపాలక సంఘాలకు రు.320 కోట్లు అందచేయాలని నిర్ణయం తీసుకున్నారు. మొత్తం రు.6,286 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదన కేంద్రానికి పంపించి క్లియర్ చేయించడం జరిగింది. అలాగే పట్టణ ప్రాంతాల్లో

త్రాగునీటి సమస్య తగ్గడానికి జీ.ఓ నెం.114 ద్వారా రు.17.34 కోట్లు విడుదల చేయడం జరిగింది.

పశుగ్రాసంలో కూడా సమస్య వచ్చింది. అనంతపురం, చిత్తూరు, కడప, కృష్ణా, కర్నూలు, నెల్లూరు జిల్లాలలోని చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కార్మికులకు 70 శాతం రాయితీపై పశుగ్రాసం సరఫరా చేయడానికి రు.6.30 కోట్లు ఖర్చుచేయడం జరిగింది. అలాగే వ్యక్తిగత రైతులద్వారా పశుగ్రాసానికి కూడా 35 హెక్టార్లు, 11,500 క్వింటాళ్ళ పశుగ్రాసాన్ని కూడా ఇవ్వడం జరిగింది. తద్వారా పశుగ్రాసానికి ఇబ్బందిలేకుండా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకోవడం జరిగింది.

అనంతపురం జిల్లాలోని కరువుగురించి, నీటి ఎద్దడి గురించి తిప్పేస్వామిగారు, ఇతర సభ్యులందరూ కూడా చెప్పారు. అనంతపురం జిల్లాలో కరువు నిత్యమూ ఉంటోంది. శాశ్వత ప్రాతిపదికన దీనిని నిర్మూలించేందుకు ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో 11.2 టి.యం.సిల నీటితో దాదాపు 40 చెరువులను నింపడం జరిగింది. ఈ విధంగా హంద్రీనీవా, సుజల స్రవంతిద్వారా ఈ ప్రయత్నం చేయడం జరిగింది. అలాగే గాలేరు, నగరి ప్రాజెక్టులు పూర్తిచేయడానికి ఇరిగేషన్ శాఖ నిధులిచ్చి శాశ్వత ప్రాతిపదికన చిత్తూరు, కడప జిల్లాలకు నీళ్ళిచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు పనులను పూర్తిచేస్తామనీ, గత ప్రభుత్వం మధ్యలో వదిలేసిన ప్రాజెక్టులను కూడా పూర్తిచేసి భవిష్యత్తులో ఈ ప్రాంతం కరువు బారిన పడకుండా ప్రయత్నం చేస్తాం. అలాగే తిప్పేస్వామిగారు కూడా పశుగ్రాసం గురించి చెప్పారు. తప్పనిసరిగా రైతులకు 70 శాతం సబ్సిడీతో పశుగ్రాసాన్ని ఇవ్వడం జరుగుతుంది. లక్షా ఇరవై అయిదు ఎకరాల్లో ఈ పశుగ్రాసాన్ని పెంచి ఇబ్బందిలేకుండా అన్ని చర్యలూ కూడా ప్రభుత్వం తీసుకోవడం జరుగుతుందని సభ్యులకు తెలియజేస్తున్నాను.

అలాగే గౌరవ సభ్యులు పి.జె.చంద్రశేఖర్‌రావుగారు రాష్ట్రంలోని కరువు పరిస్థితి, ఉద్యానశాఖ గురించి కొన్ని ప్రశ్నలడిగారు. 2014 ఖరీఫ్ సీజన్‌లో కాయగూరల విస్తీర్ణం లక్షా అయిదువేల హెక్టార్లకి పడిపోయింది. దీని ప్రభావంగా రాష్ట్రంలో తీవ్ర కరువు నెలకొంది. కరువు నివారణ చర్యల్లో భాగంగా ఉద్యానశాఖ కోటి రూపాయల విలువైన కూరగాయల విత్తనాలు, మినీకిట్లు రాయితీలపై సరఫరా చేయడం జరుగుతుంది.

రబీ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు పునరావృతం అవుతుందనే మండలాలను గుర్తించి వాటికి కార్యాచరణ ప్రణాళిక తయారుచేయడం జరుగుతుంది. అలాగే సభ్యులు మెట్టు గోవిందరెడ్డిగారు డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్‌లద్వారా తక్కువ నీటి పంపులను ప్రోత్సహించాలని కోరారు. ఈ అంశాన్ని సంబంధిత శాఖకు కూడా పంపడం జరిగింది. అలాగే ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ శాఖద్వారా అనంతపురానికి కూడా ఇవి కేటాయించడానికి కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. గౌరవ సభ్యులు పెద్దలు సి.రామచంద్రయ్యగారు, తిప్పేస్వామిగారు వ్యవసాయ పంటకు పెట్టుబడి రాయితీ పెంచడం గురించి అడిగారు. వరి, చెరుకు, పత్తి, వేరుశెనగకి రు.10,000 నుంచి రు.15,000కి, మొక్కజొన్నకి రు.8,300 నుంచి రు.12,500, సోయా చిక్కుడుకి రు.6,250 నుంచి రు.10,000 పెంచడం జరిగింది.

గౌరవ సభ్యులు మెట్టు గోవిందరెడ్డిగారు, వాకాటి నారాయణరెడ్డిగారు వేరుశెనగకు బదులుగా ప్రత్యేక పంటలను ప్రోత్సహించడం గురించి అడిగారు. వ్యవసాయశాఖ ప్రత్యేక పంటలు ప్రోత్సహించడానికి ఈ క్రింది విధమైన చర్యలు తీసుకోవడం జరిగింది. దాని ప్రకారం మొక్కజొన్న, పెసలు, మినుము, జొన్న, కంది మొదలగు పంటల విత్తనాలను రాయితీపై సరఫరా చేయడం జరుగుతుంది. వ్యవసాయశాఖ రైతులకు పొలం పిలుస్తుంది, రైతు సదస్సులు, జన్మభూమి మొదలైన కార్యక్రమాలద్వారా ప్రత్యామ్నాయ పంటల గురించి విస్తృతంగా అవగాహన కల్పించడం జరుగుతుంది. వ్యవసాయశాఖ తీసుకుంటున్న చర్యలమూలంగా అనంతపురం జిల్లాలో గత రెండు, మూడు సంవత్సరాలుగా వేరుశెనగపంట విస్తారంగా పెరిగింది.

గౌరవ సభ్యులు తిప్పేస్వామిగారు అనంతపురం పంటలబీమా గురించి చెప్పడం జరిగింది. కందులు, సజ్జ, పొద్దుతిరుగుడు, జొన్న, మొక్కజొన్న, మిరప, పత్తిపంటల మీద పంటలబీమా పథకం అమలుచేయడం జరుగుతుంది. ఈ పథకంలో రైతులు విత్తనం వేయలేకపోయినా, విత్తనం మొలకదశలో పంటనష్టం జరిగినా, పంట మధ్యదశలో పంటనష్టం జరిగినా, పంటకోతలకు ముందు వడగండ్లవానలవల్ల నష్టం జరిగిన రైతులకు బీమా పరిహారం చెల్లించడం జరుగుతుంది. అలాగే భారత ప్రభుత్వం కొత్తగా రూపొందించిన బీమా పథకం ద్వారా పంట నష్టం జరిగినప్పుడు, మద్దతు ధర తగ్గినప్పుడు కూడా రైతులకు లబ్ధిపొందే అవకాశం కల్పించింది. ఈ పథకం ఈ సంవత్సరం నుంచే ప్రారంభమవుతుంది. అలాగే కరువుమీద ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకోవడం జరిగింది.

డా. ఎం.గేయానంద్ : సార్, ఉప ముఖ్యమంత్రిగారు చర్చకు సమాధానం చెప్పారు. మీకు అభినందనలు. కానీ చర్చలో అనంతపురం నుంచి నేను మాట్లాడాను. ఎవరు మాట్లాడారు? ఎవరు మాట్లాడలేదు? అనే విషయాన్ని మీ అధికారులైనా మీకు చెప్పి ఉండాలి. పి.డి.ఎఫ్ తరఫున నేను మాట్లాడాను. మీరు ఒక్కమాట కూడా ప్రస్తావన చెయ్యకపోతే ఎట్లా? నేను చాలా కీలకమైన అంశం లేవనెత్తాను.

శ్రీ ఎన్.చినరాజప్ప : అప్పుడు నేను సభలో లేను. నాకిచ్చిన సమాచారం ప్రకారం చెప్పాను.

Dr M.GEYANAND: Take your Officials to task. అధికారులమీద చర్య తీసుకోండి. అనంతపురం నుంచి చాలా ముఖ్యమైన అంశం నేను చెప్పాను. ఈరోజు త్రాగునీరు చాలా సమస్యగా ఉంది. రు.15 కోట్ల రూపాయలు ప్రభుత్వం విడుదల చేయాలి. జిల్లా యంత్రాంగం నుంచి మీకు ప్రతిపాదనలు వచ్చినాయి. ఏం చేశారని నేను అడిగాను. కనీసం మీరు నా పేరు కూడా ప్రస్తావించలేదు.

(అంతరాయం)

శ్రీ ఎన్.చినరాజప్ప : నేను ఆరోజు రాలేదు. అధికారులు రికార్డు చెయ్యలేదు.

డా. ఎం.గేయానంద్ : ఆ అధికారులమీద చర్య తీసుకోండి. You take them to task.

శ్రీ ఎన్.చినరాజప్ప : తప్పకుండా చర్య తీసుకుంటాము. మీరు చెప్పిన విధంగా రు.15 కోట్లు కూడా ..........

డా. ఎం.గేయానంద్ ః ఇక్కడ నేను మాట్లాడినప్పుడు కనీసం నా పేరు చెప్పాలి కదా.

శ్రీ ఎస్.చినరాజప్ప ః నేను లేనుకదా.

డా. ఎం.గేయానంద్ ః మీరు లేరు. కానీ మీ అధికారులేం చేస్తున్నారు చెప్పండి.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి ః మంత్రిగారు లేరని చెప్తున్నారు కదా.

డా. ఎం.గేయానంద్ ః అధికారులేం చేస్తున్నారు? పి.డి.ఎఫ్ తరఫున మాట్లాడాను. What is this?

(అంతరాయం)

శ్రీమతి నన్నపనేని రాజకుమారి ః మంత్రిగారు నేను లేను, మాట్లాడతానని చెప్పారు కదా.

డా. ఎం.గేయానంద్ ః మంత్రిగారు ఉండాల్సిన అవసరంలేదు.

(అంతరాయం)

శ్రీ ఎం.వి.ఎస్. శర్మ ః అధ్యక్షా, ఆరోజు డిప్యూటీ ఛైర్మన్‌గారు ఛైర్‌లో ఉన్నారు.

డా. ఎం.గేయానంద్ ః మంత్రిగారు ఉండాల్సిన అవసరంలేదు.

(అంతరాయం)

శ్రీ ఎం.వి.ఎస్.శర్మః ఆరోజు స్పెసిఫిక్‌గా అందరమూ రైజ్ చేశాము. అప్పుడు సభలో సంబంధిత అధికారులు కానీ, మంత్రులు కానీ లేరు. ఎవ్వరూ లేరు ఈ చర్చ ఎందుకు అన్నప్పుడు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మేము అనుకున్నదే జరిగింది. ఇది సభను అవమానపరచడమే. దీనిమీద something should be done.

(అంతరాయం)

డా. ఎం.గేయానంద్ ః వాళ్ళు ఈ ప్రొసీడింగ్స్‌ను ఫాలో కావడంలేదు. ఎవ్వరూ లేనప్పుడు చర్చలెందుకండి? మీరు రాసుకొచ్చింది చదివినట్లుగా ఉంది. పి.డి.ఎఫ్ తరఫున నేను మాట్లాడాను.

(అంతరాయం)

శ్రీ ఎస్.చినరాజప్ప ః సారీ సార్, నేను తప్పకుండా రిలీజ్ చేయిస్తాను.

(అంతరాయం)

డా. ఎం.గేయానంద్ ః ఇది నాకు సంబంధించిన సమస్య కూడా కాదు. మిగిలిన అందరూ ఎవరేం మాట్లాడతారో రాసుకుని మంత్రిగారికి చెప్పాలి.

మిస్టర్ ఛైర్మన్ ః గేయానంద్ గారూ, ఒక్క నిమిషం.

Dr M.GEYANAND: Sir. we want action.

ఉ.11.50

మిస్టర్ ఛైర్మన్ః ఇప్పుడు మంత్రిగారు సమాధానమిచ్చారు. అయితే క్లారిఫికేషన్‌లో అడిగిన దానిని ఒమిట్ చేసినపపుడు సమాధానం రానప్పుడు you have a right to demand and also you have a right to get reply from the Minister.

డా. ఎం.గేయానంద్ః సార్, సభ్యులు ఎవరెప్పుడు ఇంటర్వీన్ అయినా కూడా మీరు అందరిపేర్లు చెప్పండి.

(అంతరాయం)

శ్రీమతి నన్నపనేని రాజకుమారి ః మంత్రిగారు సారీ అన్నాక కూడా మళ్ళీ రిపీట్ చేయడమేమిటి?

(అంతరాయం)

డా. ఎం.గేయానంద్ ః మీకేమి ఇబ్బందమ్మా? నా సమస్యను చెప్తున్నాను. మీరెందుకు ఇంటర్‌ఫియర్ కావడం?

(అంతరాయం)

శ్రీ ఎం.వి.ఎస్.శర్మ ః ఆరోజు సభలో అందరమూ రైజ్ చేశాము.

(అంతరాయం)

శ్రీ ఎస్.చినరాజప్ప ః ఆరోజు నేను సభకు రాలేదు.

(అంతరాయం)

శ్రీ ఎం.వి.ఎస్.శర్మ : సార్, మీరుండాల్సిన అవసరంలేదు.

(అంతరాయం)

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : ఆయనేమైనా ఆషామాషా మనిషా ?

(అంతరాయం)

శ్రీ ఎం.వి.ఎస్.శర్మ : మేమందరమూ ఆషామాషీగా ఉన్నామా? ఏమిటి ఆషామాషీ అంటారు? అనవసర విషయాలు ఎందుకు మాట్లాడతారు.

(అంతరాయం)

డా. ఎం.గేయానంద్ : ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్‌లో ఉన్న ఆరుమంది ఎం.ఎల్.సిల తరఫున నేను మాట్లాడాను. కనీసం మా పేరులేదు. అపాలజీ కూడా లేదు.

(అంతరాయం)

మిస్టర్ ఛైర్మన్ : గేయానంద్‌గారూ, రామచంద్రయ్యగారూ దయచేసి కూర్చోండి.

శ్రీ సి.రామచంద్రయ్య : సార్, ఆరోజు జరిగిన విషయమేమిటంటే, డిప్యూటీ ఛైర్మన్‌గారిని ఛైర్‌లో కూర్చోబెట్టి మీరు వెళ్ళారు. కానీ సంబంధిత మంత్రిగారు లేరు. నేను అభ్యంతరం వ్యక్తంచేశాను. వేరే వాళ్ళున్నారు, వాళ్ళుండచ్చు. కానీ ఆయన అందుబాటులో ఉన్నప్పుడే చర్చ పెట్టమని అడిగాం. Unfortunately, no Officer from the concerned department was present in the House. అప్పుడు గేయానంద్‌గారు మాట్లాడినట్లున్నారు. అందువల్ల పేరు అక్కడ నోట్ కాలేదు.

MR CHAIRMAN : One minute Ramachandraiah garu, they will go through the proceedings.

SRI C.RAMACHANDRAIAH : You have to direct Sir. మేము ప్రతి స్టేజ్‌లో ఈ విధంగా జరుగుతోందని మీ దృష్టికి తీసుకువస్తున్నాము. మీరు దానిని రెక్టిఫై చేయకుండా పోయినారు. ఏం చెప్తాము మేము?

MR CHAIRMAN : I am openly telling everything.

శ్రీ సి.రామచంద్రయ్య : అది డెలివరీ కావాలి కదా సార్?

మిస్టర్ ఛైర్మన్ : ఆ ప్రొసీడింగ్స్ చూడాలని చెప్పాను. Proceedings are there.

శ్రీ సి.రామచంద్రయ్య : సార్, ఆ దినం మీరు లేరు, మంత్రులెవరూ కూడా లేరు.

MR CHAIRMAN : I am directing the Ministers concerned to go through the proceedings, whether the Officers are there or not? Why the Officers are absent? Action should be taken against them and there is no dispute about it.

శ్రీ సి.రామచంద్రయ్య ః డిస్ప్యూట్ కాదు సార్. Issue is not surprising .You have to chalk out the solution.

MR CHAIRMAN : We are correcting the system. రఘునాథరెడ్డిగారూ మాట్లాడండి.

డా. పల్లె రఘునాథరెడ్డిః సర్, గౌరవ సభ్యులు శ్రీ గేయానంద్ గారు పడిన ఆవేదన మాకు అర్థమైంది. అనంతపురం జిల్లాలో భయంకరమైన కరువు వచ్చింది. చాలా కష్టాలు, సమస్యలున్నాయి. దానిమీద అయన పడే అవేదనను మేముకూడా అర్థం చేసుకుంటున్నాము. ఉప ముఖ్యమంత్రిగారు సభలో ఉన్నారు. శాసన సభలో హుద్‌హుద్ తుఫాను మీద మాట్లాడాలి. అక్కడ కరువుమీద చర్చ ఉంది కాబట్టి ఆరోజు నన్ను ఇక్కడికి డెప్యూట్ చేశారు. కాబట్టి దయచేసి మన్నించవలసినదిగా కోరుతూ, అనంతపురం జిల్లాలో ఉన్న కొన్ని సమస్యలు ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి........

డా. ఎం.గేయానంద్ః సార్, ఆ విషయం నాకు సంబంధించినదికాదు. అనంతపురం జిల్లాకు 15 కోట్ల రూపాయలు త్రాగునీటికి సంబంధించిన అంశం. ఈ 15 కోట్ల రూపాయలు ప్రభుత్వం ఇవ్వాలి అని చెప్పడానికి నేను ప్రయత్నం చేశాను. స్పష్టంగా సూటిగా చెప్పాను. ఆ 15 కోట్ల రూపాయల విషయం ఏం చేశారనేది చెప్పండి.

డా. పల్లె రఘునాథరెడ్డిః నేను విన్నాను సార్, కాబట్టి నాకు అవకాశం ఇవ్వండి. ఎందుకంటే, ఆరోజు నేను ఉన్నాను కాబట్టి కొద్దిగా సమాధానం చెప్తాను. తమరు అధ్యక్షులుగా ఉండే ఈ ప్రతిష్టాత్మకమైన శాసన మండలిలో నాకు మాట్లాడటానికి అవకాశం ఇచ్చినందుకు మొదట నా హృదయపూర్వక ధన్యవాదాలు మీకు తెలియజేస్తున్నాను.

డా. ఎం.గేయానంద్ ః సార్, జవాబుకు ముందు ఎందుకు జరిగిందనేది చెప్పాలి.

డా. పల్లె రఘునాథరెడ్డి ః సార్, నాకు తెలిసిన అన్ని అంశాలు మీకు చెప్తాను. రాష్ట్ర ప్రజలను కలచివేస్తున్న, కలవరపెడుతున్న అతి ప్రధానమైన బాధాకరమైన సమస్యలు రెండున్నాయి. ఒకటి కరువు. ఇది ఆంధ్రప్రదేశ్‌లో దక్షిణ ప్రాంత నియోజక వర్గాలకు వస్తుంది. రెండవది తుఫాను, ఉత్తర ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి ఇవి వస్తాయి. ఎప్పుడూ కనీవినీ ఎరుగని రీతిలో, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి అతి భయంకరమైన కరువు వచ్చింది.

మిస్టర్ చైర్మన్ః అది అందరూ ఒప్పుకునేదే.

డా. పల్లె రఘునాథరెడ్డిః 130 సంవత్సరాల చరిత్ర చూస్తే 69 సంవత్సరాలు కరువు రాగా, . 30 సంవత్సరాలు చూస్తే 18 సంవత్సరాలు కరువు వచ్చింది. ఈ రోజు వచ్చిన కరువు అతి పెద్ద కరువుల్లో రెండవది, డొక్కల కరువు అనే ఆ కరువు కంటే భయంకరమైనది. కాబట్టి ప్రభుత్వం

తప్పకుండా స్పందించవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా మీకు గుర్తుచేస్తున్నాము. మన గౌరవ ఉపముఖ్యమంత్రిగారు చెప్పినట్లు ఇక్కడ దాదాపు 226 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం జరిగింది. దాదాపు అనంతపురం జిల్లాలో 59, కడప జిల్లాలో 48, కర్నూలులో 12, ప్రకాశం 54, చిత్తూరు 42, నెల్లూరు 7, గుంటూరు 4, అంటే ఈ రాష్ట్రంలో Andhra Pradesh Book for Management of Drought-1995 and Manual for drought management published by Minister for Agriculture, Government of India, 2009 గైడ్‌లైన్స్ ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 226 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం జరిగింది. ఆ గైడ్‌లైన్స్ ప్రకారం కరువుమండలాలలోని రైతుల రుణాలను బ్యాంకులు రీషెడ్యూల్ చేసుకోవచ్చు.

ఈ రాష్ట్రంలో దాదాపు 22.79 లక్షల రైతు కుటుంబాలకు ఈ రుణమాఫీ ప్రకటించడమనేది ఒక వరంగా భావించవచ్చు. కారణమేమంటే ప్రజలు కష్టాలల్లోనూ, బాధల్లోనూ, సమస్యల్లోనూ ఉన్నారు. ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి వచ్చారు. కాబట్టి ఈ నూతన సంవత్సరం కానుకగా, ఒక అపూర్వమైన కానుకగా 22.79 లక్షల కుటుంబాలకు అంటే 71 శాతానికి రుణమాఫీ ప్రకటించడం వల్ల కొద్ది రిలీఫ్ వచ్చిందని నేను భావిస్తున్నాను. ఇకపోతే, దాదాపు 32 లక్షల కుటుంబాలు ఉన్నాయి. దానిలో 10 లక్షల కుటుంబాలకు తదుపరి దశలో దశలవారీగా రుణమాఫీ జరుగుతుంది. ఇక్కడ బ్యాంకులు రుణాలను రీషెడ్యూల్ చేసుకోవాలని చెప్పి ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ చేస్తున్నాము. ఈ రీషెడ్యూల్ చేసుకోవడం వల్ల రైతులకు అప్పులు పోస్ట్‌పోన్ అయితే కొంత వరకు వారు నిర్వహించుకోగలిగే శక్తి ఉంటుంది. రెండవది, అనంతపురం జిల్లాలో చాలా ముఖ్యమైన అంశం ఇన్‌పుట్ సబ్సిడీ. దానిని కూడా రెయిజ్ చేశారు. గత ప్రభుత్వం రు.1200 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చింది. రూ.750 కోట్ల వరకు ఇంకా విడుదల చేయాల్సిన అవసరముంది. ఈ సంవత్సరం దాదాపుగా రూ.140 కోట్లు పంట నష్టపరిహారము తుఫాను బాధితులకు ఇచ్చాము. రూ.260 కోట్లు ఉద్యానవన పంటలకు ఇచ్చాము. రూ.400 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీగా ఇవ్వడమే కాకుండా, రాయలసీమ ప్రాంతంలో ఎక్కడైతే పంట నష్టం జరిగిందో అక్కడ అంచనా వేసి, మదింపుచేసి ఇంకొక రూ.700 కోట్లను అందచేయాలనుకున్నాము.

డా. ఎం.గేయానంద్ః సార్, అనంతపురం జిల్లాలో రాబోయే మూడు, నాలుగు నెలల్లో భయంకరమైన త్రాగు నీటి కరువు ఏర్పడబోతుంది. రాష్ట్రంలోని 600 గ్రామాల్లో వాహనాలతో త్రాగునీటిని సరఫరాచేస్తుండగా, అందులో 300 గ్రామాల వరకు అనంతపురం జిల్లాలోనే ఉన్నాయి. వేసవిలో ఈ కరువు మరింత తీవ్రరూపం దాలుస్తుంది. రూ.15 కోట్ల నుంచి రు.25 కోట్ల వరకు జిల్లా యంత్రాంగానికి విడుదల చేస్తే గానీ ఈ సమస్యను ఎదుర్కోవడం సాధ్యం కాదు. ఆ నిధుల గురించి ఏమి చేస్తారో చెప్పండి.

మ. 12.00

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి : అధ్యక్షా, నేను అన్నీ అంశాలు ప్రస్తావిస్తాను, మీరు సహకరిస్తే నేను చెప్పిన తరువాత ఏవైనా అంశాలు రాకపోతే అప్పుడు మళ్లీ అడగండి.

శ్రీ బి. చంగల్ రాయుడు : అధ్యక్షా, కడప జిల్లాలో కూడా ట్రాన్స్‌పోర్టేషన్ ఆఫ్ వాటర్ గురించి డబ్బు రిలీజ్ చేశారు. అది అయిపోయి మూడు నెలలు అవుతోంది, గత మూడు నెలల నుండి ట్రాన్స్‌పోర్టేషన్ బిల్లులు ఇవ్వడం లేదు. ఒక్క పెనమలూరు మండలంలోనే బోర్లు 1200

అడుగుల లోతు వరకు వేయాల్సి వస్తోంది. ఆహారం, మిగతా విషయాలు తరువాత చూద్దాం ముందు త్రాగడానికి మంచినీళ్లు ఇవ్వండి. అదృష్టం కొద్దీ పంచాయితీరాజ్ శాఖా మంత్రిగారు, మంచినీటి శాఖా మంత్రిగారు కూడా ఇక్కడే ఉన్నారు కాబట్టి మా జిల్లాకు కూడా త్రాగునీటి కోసం రూ. 20 కోట్లతో పెట్టుబడి పెట్టండి. మిగతావి తరువాత చూసుకుందాము. ముందు మంచినీళ్లు పోసి ప్రజల ప్రాణాలు కాపాడండి.

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి : ఆ అంశాల గురించి కూడా చెబుతాను, ఒకవేళ కవర్ కాకపోతే సభ్యులు అడిగేదానికి మరలా సమాధానం చెబుతాము. రెండవది ఇన్‌పుట్ సబ్సిడీ రూ. 1100 కోట్లుగా అంచనా వేశాము. కలెక్టర్ల నుండి అంచనాలు వచ్చిన వెంటనే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వాటిని మంజూరు చేస్తాము. ఇకపోతే ఇన్సూరెన్సు చాలా ముఖ్యమైనది. దీనిలో కొన్ని ఇబ్బందులున్నాయి. నేషనల్ అగ్రికల్చరల్ ఇన్సూరెన్సు స్కీము ఒకటి ఉంది, 2010వ సంవత్సరం వరకూ అనంతపురం, కడప, చిత్తూరు, కర్నూలులో దీనిని అమలు పరుస్తున్నారు. 2011వ సంవత్సరంలో అప్పటి రెవెన్యూ మంత్రి గారు శ్రీ రఘువీరా రెడ్డిగారు వాతావరణ బీమా పథకం ప్రవేశపెట్టడం జరిగింది. అగ్రికల్చర్ స్కీము మాత్రం మన ఉపముఖ్యమంత్రిగారు చెప్పినట్లు వరి, జొన్న, సజ్జ, మొక్కజొన్న, శనగలు, మినప, ప్రొద్దుతిరుగుడు, కందులు, పెసలు మొదలగు పంటలకు వర్తింపచేస్తున్నాము. దీనిలో ఉండే ఇబ్బంది ఏమిటంటే – విలేజ్‌ను యూనిట్‌గా తీసుకోవడమే కాకుండా గత 5 సంవత్సరాల సరాసరిని తీసుకోవడం వలన పంటలు పండకపోయినా కూడా ఇన్సూరెన్సు రావడం లేదు. దానిప్రకారం గా పోతే ఈరోజు బీమా వాతావరణం క్రింద రూ. 227 కోట్లు వస్తే ప్రత్యక్షంగా రూ. 20 కోట్లు కూడా వచ్చే అవకాశం లేదు. ఆ ఇన్సూరెన్సులో నిబంధనలు మార్చాలని చెప్పి మా నాయకులు కోరుతున్నారు. అంటే గత 5 సంవత్సరాలలో మంచి దిగుబడి వచ్చిన సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుని లెక్కించాలని ప్రతిపాదనను కేంద్రప్రభుత్వానికి పంపించాము కానీ వాళ్లు దానిని అంగీకరించే పరిస్థితి లేదు. ఇన్సూరెన్సులో నిబంధనలను మార్చితే తప్ప అనంతపురం జిల్లాకు మాత్రం ఉపయోగపడదు. కానీ, ఈ నేషనల్ అగ్రికల్చరల్ స్కీమ్ అనంతపురం జిల్లాకు ఉపయోగపడదు కాని కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు మాత్రం ఉపయోగపడుతోంది. ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు పెట్టి వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలిలో తేమ, గాలి వేగాన్ని మొదలైనవన్నీ క్యాలిక్యులేట్ చేసి ఇచ్చినప్పటికీ రూ. 227 కోట్లు వచ్చింది. ఈ మధ్య ఒక జీ.ఓ ఇచ్చాము, దాదాపు రూ. 500 కోట్లకు పైగా ఇన్సూరెన్సు వచ్చింది. ఈ ఇన్సూరెన్సు అప్పుల ఖాతాలలో జమ కాకుండా నేరుగా రైతులకు చెల్లించాలని, రైతుల ప్రయోజనాలు కాపాడాలని గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి నాయకత్వంలో ఈ రాష్ట్రప్రభుత్వం చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకుందని తెలియజేస్తున్నాను.

శ్రీ సి. రామచంద్రయ్య : అది ఏవిధంగా చారిత్రాత్మక సంఘటన అవుతుందో చెప్పండి.

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి : ఈ రాష్ట్రప్రభుత్వం రూ. 16వేల కోట్ల లోటుబడ్జెట్‌లో ఉంది. రూ. 3,500 కోట్లను పెన్షన్‌కు ఇస్తున్నాము. రూ. 5,000 కోట్లు పిల్లల స్కాలర్‌షిప్స్‌కు రీయింబర్సుమెంట్ల క్రింద ఇస్తున్నాము, డ్వాక్రా మహిళలకు రూ. 7,600 కోట్లు రుణమాఫీ చేస్తున్నాము. ఇంత కష్టకాలంలో కూడా రుణ ఖాతాలలో జమ చేయకుండా నేరుగా రైతుల ఖాతాలకు ఇస్తున్నామంటే అది చారిత్రాత్మకం కాకుండా ఎలాఉంటుంది అధ్యక్షా. పెద్దవారు వారికి ఈ విషయాలు తెలుసు.

శ్రీ సి. రామచంద్రయ్య ః ఇన్సూరెన్సు డబ్బులు జమచేసుకోవడానికి ప్రభుత్వానికి అధికారం లేదు. లేని పవర్స్‌ని మీరు usurp చేయాలని అనుకుంటున్నారేమో, you have no power. పెన్షన్‌కు, ఇన్సూరెన్సుకు ఒక స్పెషల్ ప్రొటెక్షన్ ఉంటుంది.

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి ః (శ్రీ సి. రామచంద్రయ్యగారిని ఉద్దేశించి) మీకు బ్యాంకుల పట్ల పరిజ్ఞానం ఉంది. కానీ రిజర్వ్ బ్యాంక్ అప్పులకు జమ చేసుకోవడానికి జీ.ఓ ఇచ్చింది. కానీ ఇది ప్రజలకు చెందాలని ముఖ్యమంత్రిగారు చెప్పారు. మంచి పని చేసినప్పుడు దానిని అభినందించాలి. మరో సమస్య త్రాగునీటి సమస్య. ఇది చాలా భయకరమైన సమస్య. దాదాపు 600 నుండి 1000 అడుగులు త్రవ్వినా కూడా నీళ్లు పడని పరిస్థితి. ముఖ్యంగా మా నియోజక వర్గంలో చూస్తే త్రాగునీటి సమస్య అంతా, ఇంతా కాదు. బాగా ఇబ్బంది పడుతున్నాము. ఇప్పుడు దాదాపు మంచినీటి సరఫరా రవాణా ఖర్చుల కోసం 2,155 పనులకు రూ. 39.82 కోట్లతో కొన్ని ప్రపోజల్స్ పంపించాము. రైతుల బోర్లలోతులు పెంచడానికి, బావుల లోతులు పెంచడానికి, చెరువులు నింపడానికి రూ. 55.59కోట్లు ఖర్చవుతుంది. దానికి కూడా ప్రపోజల్స్ పంపించాము. అంతేకాకుండా నీళ్లు పడని ప్రాంతాలలో రవాణా ద్వారా సుమారు 1723 గ్రామాలకు రిహాబిటేషన్ చేస్తున్నాము. చిత్తూరు 1209, అనంతపురం-311, కడప 150, ప్రకాశం 15, నెల్లూరు 6, కర్నూలు 1, కృష్ణా 1.

నీటి సమస్యలు ఏవిధంగా పరిష్కరిస్తున్నామంటే ఒకటి ట్రాన్స్‌పోర్ట్ చేస్తున్నాము. రెండవది, ఎవరైనా ప్రైవేటు రైతులకు బోర్లు ఉంటే వారిని బ్రతిమాలి వాళ్ల వద్దనుండి తీసుకుంటున్నాము. అటువంటివి 339 ప్రాంతాలు ఉన్నాయి. చిత్తూరు 135, అనంతపురం 10, కడప 92, ప్రకాశం 2 ప్రాంతాలలో తీసుకుంటున్నాము. అదే విధంగా, వేసవి కాలంలో మంచినీటి సరఫరా కోసం చెరువులు నింపాము. సమగ్ర మంచినీటి సరఫరా పథకం క్రింద 169 చెరువులు నింపాము. మంచినీటి సరఫరాలో 1165 చెరువులు నింపాము. పంచాయితీల నుండి 106 చెరువులు నింపాము. ఎక్కడ వీలుపడితే అక్కడ కాలువలు నింపాము. అనంతపురం జిల్లాలో మొన్ననే మంచినీటి కోసం రూ. 7,58,00,000/- త్రాగునీటికోసం మంజూరు చేశాము. ఆ వర్కు కూడా డిస్ట్రిబ్యూట్ చేయడం జరిగింది.

డా. ఎం. గేయానంద్ ః ఆ నిధులు సరిపోవని మీకు తెలుసు కదా సార్.

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి ః తెలుసు, గౌరవసభ్యులు 15 కోట్లు కావాలని అడిగారు. ఇప్పుడే నేను, శ్రీమతి శమంతక మణి గారు అనంతపురం జిల్లా నుంచి మాట్లాడాము. త్వరలోనే ముఖ్యమంత్రిగారితో సమావేశం ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నాము. తప్పకుండా అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలలో ఎక్కడైతే త్రాగునీటికి ఇబ్బందిగా ఉందో దానిని పరిష్కరించడానికి ప్రత్యేకమైన బడ్జెట్ పెట్టి ఈ ప్రజలను కాపాడాలనే ఆలోచనలో ఈ ప్రభుత్వం ఉంది. త్రాగునీటి గురించి గౌరవ సభ్యులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు. విపత్తులను ఎదుర్కోవడంలో శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు గారికి ఉన్న శక్తి ప్రపంచంలో ఏ నాయకుడికీ లేదు. ఒకసారి ఒరిస్సాలో జరిగితే అక్కడి ముఖ్యమంత్రి రాకముందే స్వయంగా తానే పోయి, సహాయ పునరావాస కార్యక్రమాలను చేపట్టిన ఘనత గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు

గారికి దక్కుతుంది. అదేవిధంగా బియాస్ నది దగ్గర జరిగిన దుర్ఘటనలో కానీ, ఉత్తరాఖండ్‌లో జరిగిన దుర్ఘటనలో, హుద్ హుద్ తుఫానులో కూడా 220 కిలోమీటర్ల వేగంతో గాలులు వస్తే 440 కిలోమీటర్ల వేగంతో చంద్రబాబునాయుడు గారు, మంత్రివర్గం, అధికార వర్గం స్పందించి కనివిని ఎరుగని రీతిలో చరిత్ర సృష్టించే విధంగా తుఫానును ఎదుర్కొన్నాము. కాబట్టి ఈ కరువును కూడా మా ముఖ్యమంత్రిగారు సమర్థవంతంగా ఎదుర్కొంటారు. నిధులు కూడా మంజూరు చేస్తారని, మా సోదరులు ధైర్యంగా ఉండాలని కోరుతున్నాను.

శ్రీ సి. రామచంద్రయ్య : సార్, మాటలతో సరిపోదు. మంచినీళ్లకు నిధులు ఎప్పుడు ఇస్తారో చెప్పండి.

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి : సార్, ఉన్న వాస్తవాలే మాట్లాడుతున్నాను. వాస్తవాలను దాటి మాట్లాడడం లేదు.

డా. ఎం. గేయానంద్ : డబ్బులు ఎప్పుడు విడుదల చేస్తారో చెప్పండి సార్.

శ్రీ ఆర్. రెడ్డప్పరెడ్డి (నామినేటెడ్) : మంచినీటి గురించి నేను స్పెసిఫిక్ గా అడిగాను. ఎందుకంటే మీరు త్రాగునీటి సమస్య తీవ్రమైనదని అర్థం చేసుకున్నారు. చిత్తూరు జిల్లా మదనపల్లి సబ్ డివిజన్‌లో మినిస్టర్ శ్రీ గోపాలకృష్ణ గారు కూడా పర్యటించారు. ఏ గ్రామానికి పోయినా మహిళలు కుండలతో స్వాగతిస్తున్నారు. ట్రాన్స్‌పోర్టేషన్ అనేది it is not at all possible in the coming summer. I am categorically telling that the transportation will not be possible, because there is no water to transport. So, you need permanent or semi-permanent measures. నేను రెండు విషయాలు మాత్రమే అడిగాను చిత్తూరు జిల్లా కోసం మొదటిది, కండలేరు ప్రాజెక్టును టేకప్ చేస్తారా? అబాండేజ్ చేస్తున్నారా? టేకప్ చేస్తే what is the schedule? What is the Budget? రెండవది హంద్రీనీవా కాలువ. మీరు హంద్రీనీవా కాలువ పూర్తి చేస్తారా, అబాండేజ్ చేస్తారా? ఏవిధంగా మీరు పర్మనెంట్‌గా చిత్తూరు జిల్లాకు నీళ్లు తెస్తారు. ట్యాంకర్స్, బోర్లుకు మీరు even if you allocate Rs.100 Crore to the bore wells, there will be no water in the bore wells. మీరు 1000 ఫీట్ అన్నారు. 1500 ఫీట్స్‌లో కూడా వాటర్ లేవు. So, I want specific answer in this regard. Otherwise, we will keep on pressing and criticize the issue.

మ. 12.10

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి : గౌరవ సభ్యులు శ్రీ రెడ్డివారి రెడ్డపరెడ్డి గారు చెప్పిన విషయం బాగా అర్థమైంది. మామూలుగా త్రాగునీటి విషయంలో ఏ విధంగా పరిష్కారం చేస్తామో, అదేవిధంగా నాకు తెలిసి మొట్టమొదటగా ట్రాన్స్‌పోర్టేషన్ చూస్తాము. మామూలుగా బోర్లలో వెయ్యి, 1500 అడుగుల లోతుకు వెళ్ళినా నీళ్లు పడక పరిస్థితులు చాలా దుర్భరంగా ఉన్నాయి. ఇక రెండవ పద్ధతిలో ఎక్కడైనా నీరు వచ్చే పరిస్థితి ఉంటే రైతులను బ్రతిమాలి, ఆ భూములను తీసుకునే పరిస్థితి ఉంది. మరొక ప్రత్యామ్నాయ పద్ధతి ఏమిటంటే, ఎంతదూరమైనా ట్రాన్స్‌పోర్ట్ చేసే పద్ధతి ఉంది. గౌరవ సభ్యులు అడిగినట్లుగా కండలేరు, హంద్రీనీవా గురించి చెప్పారు. కండలేరు నుంచి ఎంత నీరు వస్తుందో తగిన సమాచారం ప్రస్తుతం నా వద్ద లేదు. అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు ఒక వర ప్రసాదం ఈ హంద్రీనీవా ప్రాజెక్టు. గౌరవ ముఖ్యమంత్రిగారు కేబినెట్, శాసనసభలోనూ చెప్పిన విషయాన్ని తమ ద్వారా సభకు తెలియజేస్తున్నాను. ఎటువంటి కష్టమైనా,

ఎటువంటి నష్టమైనా ఎంత ఇబ్బంది అయినా ఈ హంద్రీనీవాను ఒక సంవత్సరం లోపల పూర్తిచేస్తా నని చెప్పిన విషయాన్ని గుర్తుచేస్తున్నాను. ఈ కాలువలు, ప్రాజెక్టులు పూర్తయితే, గౌరవ సభ్యులు చెప్పినట్లుగా వాటిని చెరువులకు నింపి, భూగర్భజలాలు పెంచి నీరు ఇచ్చే అవకాశం ఉంటుంది. మాకు ఏ మాత్రం వీలున్నా ఎటువంటి వాటిని వదిలిపెట్టే ప్రశక్తే లేదు. ఎంత బడ్జెట్ అయినా, ఎంత కష్టమైనా ఏ ప్రాజెక్టులు పూర్తి చేస్తే రైతులకు సాగునీరు, త్రాగునీరు వస్తుందో, వాటన్నింటిని తప్ప కుండా పూర్తిచేస్తానని ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబునాయుడు గారు చెప్పారు. చిత్తూరు జిల్లా కండలేరు ప్రాజెక్టును కూడా ముఖ్యమంత్రిగారు తప్పకుండా పూర్తిచేస్తారు. ఈ విషయాలన్నీ నేను ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువెళతానని తమ ద్వారా గౌరవ సభ్యులు శ్రీ రెడ్డివారి రెడ్డపరె డ్డి గారికి తెలియజేస్తున్నాను.

డా. ఎం.గేయానంద్ : అధ్యక్షా, ప్రాజెక్టులకు సంబంధించి నిధులు చాలా కీలకమైనవి, వాటి గురించి ఇంతవరకూ జవాబు చెప్పలేదు. సుమారు రూ.7.5కోట్లు ఖర్చుపెట్టారనేది ఈ మధ్యే వచ్చిన విషయం.

శ్రీ సి.హెచ్.అయ్యన్న పాత్రుడు : అధ్యక్షా, త్రాగునీటి విషయంలో మంత్రిగారు సమాధానం చెప్పారు కాబట్టి, సమస్య ఉండదని అనుకుంటున్నాను. ఈ అంశానికి సంబంధించి సభలో చర్చ జరగడం మంచిదే, నేను కాదనడం లేదు. సభలో పెద్దలు అనుభవజ్ఞులు ఉన్నారు, వారి సలహాలు కూడా తీసుకోవలసిన అవసరం ఉంది. అయితే, రెండు రోజుల క్రితం అధికారులతో మేము సమా వేశాలను ఏర్పాటు చేశాము. మాకున్నటువంటి సమాచారం మేరకు కడప, అనంతపూర్, చిత్తూరు జిల్లాలను కరువు మండలాలుగా ప్రకటించడం జరిగింది. ఈ మూడు జిల్లాలలో చాలా భయంకరమైన పరిస్థితులు ఉన్నాయి, ఇది వాస్తవం. అందుచేత ఈ పరిస్థితిని ఎలా అధిగమించా లనేదానికోసం అందరితో మాట్లాడడం జరిగింది. ప్రస్తుతం అక్కడ బోర్లు ఉన్నా, నీరు లేక నీటిని ట్రాన్స్‌పోర్టు చేయడం జరుగుతోంది. ప్రైవేటు బోర్లను తీసుకుందామంటే, అక్కడ కూడా నీరు లేని పరిస్థితి ఉంది. త్రాగునీరు సమకూర్చాలనే మొదటి ప్రయారిటీ ప్రభుత్వం వద్ద ఉంది. ప్రభుత్వం దీనిని దృష్టిలో పెట్టుకుంది. ఈనెల 26, 27 తారీఖులలో మా కార్యదర్శి జవహర్ రెడ్డి గారిని అక్కడ ఉన్న మూడు జిల్లాలకు వెళ్లి, అక్కడ ఇతర స్థానిక అధికారులతో ఆ ప్రాంతాలకు వెళ్ళి అన్నీ పరిశీ లించి, ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి, వాస్తవ పరిస్థితులను పరిశీలించి, అక్కడ ఎంత డబ్బులు అవ సరమవుతాయో చూసుకుని ముఖ్యమంత్రిగారితో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని, ఆ డబ్బు లను మొదటి ప్రయారిటీగా విడుదల చేయడం జరుగుతుందని తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్ : కర్నూలు జిల్లాలోని ప్రత్తికొండలో కూడా నీటి సమస్య ఎక్కువగా ఉంది.

శ్రీ సి.హెచ్. అయ్యన్న పాత్రుడు : కర్నూలు, కడప, ప్రత్తికొండ అన్ని ప్రాంతాలు దృష్టిలో ఉన్నాయి, వాటిని పరిశీలిస్తాము. 28వ తారీఖున ముఖ్యమంత్రిగారితో ఒక మీటింగ్ పెట్టి, అందులో ఎంత అమౌంట్ అవసరముందో చూసుకుని ముందుగా దానికే మొదటి ప్రాధాన్యత ఇస్తామని తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

శ్రీ బి. చంగల్ రాయుడు ః అధ్యక్షా, గౌరవ మంత్రిగారే స్వయంగా పరిశీలిస్తే బావుంటుంది. ముఖ్యకార్యదర్శిగారికన్నా ఈ సభలో మీరంటే ఎక్కువ నమ్మకం ఉంది. మీరు ఆ ప్రాంతాలను సందర్శించినట్లయితే, మా రాయలసీమ ప్రాంతానికి నీళ్లు వస్తాయి. గతంలో వెంగళరావుగారి హయాములో గుంటూరు, విజయవాడ నుంచి రైల్వే వాగన్లలో నీటిని సరఫరా చేసేవారు. ఇప్పుడు కూడా ఆవిధంగా చేస్తే బావుంటుందేమో ఆలోచించాలని గౌరవ మంత్రిగారికి తెలియజేస్తున్నాను.

శ్రీ సి.హెచ్. అయ్యన్న పాత్రుడు ః అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పినట్లుగా కార్యదర్శితోపాటు నేను కూడా ఆ ప్రాంతాలకు వెళ్ళి పరిశీలిస్తాను. అవసరమైతే విజయవాడ, గుంటూరు ప్రాంతాల నుంచి నీటిని తెప్పించే ఏర్పాట్లు చేస్తూ, ఈ మూడు ప్రాంతాలలో నీటి సమస్యను పరిష్కరించే ఏర్పాట్లు చేస్తామని తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

(హర్షధ్వానాలు)

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి ః అధ్యక్షా, సభ్యులకు కొన్ని జంతువుల వివరాలు తెలియవలసి ఉంది. అవి తెల్ల ఏనుగులు సుమారు 86 లక్షలు, గేదెలు సుమారు 64 లక్షలు, గొర్రెలు 135 లక్షలు, మేకలు 44 లక్షలు. మొత్తం 2 కోట్ల 89 లక్షల మూగ జీవాలు ఉన్నాయి. ఇక కోళ్ళు 8 కోట్ల 15 లక్షలు ఉన్నాయి. వీటన్నింటికి గడ్డి నిమిత్తం ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంది. గౌరవ ప్రతి పక్షనాయకులు మాకు మాటలు వద్దు, చేతలు కావాలని అన్నారు కాబట్టి, చేతల గురించి చెపుతు న్నాము. సుమారు 23,710 క్వింటాళ్ళ గడ్డి విత్తనాలను 75 శాతం సబ్సిడీతో మంజూరు చేశాము. ఇవి సుమారు ఒక లక్ష ఎకరాలలో వేయవచ్చు. వాటి నుంచి సుమారు 4.74లక్షల మెట్రిక్ టన్నుల గడ్డి వస్తుంది.

శ్రీ సి. రామచంద్రయ్య ః అధ్యక్షా, తమ ద్వారా మనవిచేసేదేమిటంటే, పెన్నా నది ఒడ్డున 2,000 చీని చెట్లను నీళ్ళు లేక నిన్న కొట్టివేయడం జరిగింది. భూగర్భ నీటి మట్టం పడిపోయింది. ఇంత గడ్డి పెంచడానికి ఏమన్నా ఛూ మంత్రం వేశారేమో? నీళ్ళు లేక గడ్డి ఎలా పెరుగుతుంది? నిజంగా పరిష్కారం ఉంటే చెప్పండి.

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి ః అధ్యక్షా, మేము ఏదన్నా ఇస్తే ఇవ్వలేదంటారు, ఇవ్వకపోతే ప్రభుత్వం డబ్బులు ఇవ్వలేదని అంటారు. రాజకీయాలు మాకు తెలియంది కాదు.

శ్రీ సి. రామచంద్రయ్యః ఏదైనా ప్రాక్టికల్‌గా మాట్లాడండి.

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి ః అధ్యక్షా, రామచంద్రయ్యగారికి తెలియంది ఏమీ లేదు. ఆయన మాకు రాజకీయాలలో గురువులు. అనంతపురం జిల్లాలో ఎక్కడ పడితే అక్కడ చెరువుల దగ్గర ఈ గడ్డి విత్తనాలు వేసుకుంటారు. ఈ మూగ పశువులకు సంబంధించి ఎంత గడ్డి కావాలో అంచనా వేస్తే, సుమారు 127 లక్షల మెట్రిక్ టన్నుల గడ్డి కావాలి. ముఖ్యంగా కొన్ని ప్రాంతాలలో గడ్డికి ఇబ్బంది ఉంది. చిత్తూరు జిల్లాలో అంచనాల ప్రకారం సుమారు 18,900 మెట్రిక్ టన్నుల గడ్డి తక్కువగా ఉంది. అనంతపురం జిల్లాలో సుమారు 1, 53,000 మెట్రిక్ టన్నుల గడ్డి అవసరం ఉంది.

డా. ఎం. గేయానంద్ ః అధ్యక్షా, అనంతపురం జిల్లాలో సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల గడ్డి అవసరం అని జిల్లా యంత్రాంగం ఒక ప్రతిపాదన పంపింది. వీటి గురించి కూడా ఆలో చించండి.

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి ః అధ్యక్షా, ఇంకా కడప జిల్లాలో 12,800 మెట్రిక్ టన్నుల గడ్డి అవసరం అవుతుందని అంచనాలు తెలియజేస్తున్నాయి. ఇంకా కావలసినవి సరఫరా చేస్తాము. దీనికి గాను సుమారు 9.45కోట్ల నిధులను కేటాయించాము. అలాగే, రాష్ట్రీయ కృషి విజ్ఞాన్ నుంచి సుమారు రూ. 1.53 కోట్ల నిధులు నుంచి వచ్చాయి. ఎటువంటి పరిస్థితులలో కూడా ఈ విత్తనాలు, పశుగ్రాసం ఇచ్చి మూగ జీవాలను కాపాడేందుకు ఈ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని తమ ద్వారా తెలియజేస్తున్నాను. అలాగే, గౌరవసభ్యులకు వీటి గురించి ఏ విధమైన సమాచారం తెలిసినా మాకు అందిస్తే, వాటికి సంబంధించి తగిన చర్యలు తీసుకుంటామని తమ ద్వారా గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను. నీటికి ఏ విధంగా ప్రాధాన్యత ఇస్తున్నామో, అలాగే నోరు లేని మూగ జీవాలకు కూడా అదే రీతిలో ప్రాముఖ్యత ఇస్తాము.

మ. 12.20

అధ్యక్షా, మామూలుగా శాసన సభ కంటే శాసన మండలి బాగా జరుగుతుందని చెబుతున్నాను.

మిస్టర్ ఛైర్మన్ః మీరు ఇక్కడి నుండి వెళ్లిన వారే కదా. మీకు మండలి విషయం తెలుసు. ప్లీజ్ కంటిన్యూ.

డా. పల్లె రఘునాథ రెడ్డిః అధ్యక్షా, గతంలో ఎన్ఆర్ఇజిఎస్‌లో వంద రోజుల పని దినాలు ఉండేవి. ఇప్పుడు నూట యాభై రోజులకు పెంచి, కష్ట కాలంలో పేద కూలీలను ఆదుకోవాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వానికి రెండు నెలల క్రితమే ప్రపోజల్స్ పంపించాము. నూటికి నూరు శాతం అనుమతి వస్తుంది. 150 రోజుల పని దినాలు చేస్తాము. అదేవిధంగా ఈ జిల్లాలో దాదాపు ఏప్రిల్ నుండి ఇంత వరకు 52 లక్షల మంది కూలీలకు పని కల్పించాము. ఒక్కరు కాదు, ఇద్దరు కాదు. దాదాపు 52 లక్షల మంది కూలీలకు పని కల్పించాము. అదే విధంగా రూ.2,300 కోట్లు ఖర్చుపెట్టాము. ఇంకా రూ.1300 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపించాము. ఈ వంద రోజులు పూర్తయ్యే వరకు అందరికీ పని కల్పించడమే కాకుండా, ఈ పంట కాలం రోజుల్లో 1.2 లక్షల మంది పని చేస్తున్నారు. ఏప్రిల్, మే మాసాల్లో పొలం పనులు లేనప్పుడు మాత్రం సుమారు 18 లక్షల మంది పనిచేస్తున్నారు. మొత్తం 13,000 గ్రామాల్లో, 5,475 గ్రామాల్లో ఈ మహాత్మాగాంధీ నరేగా పనిచేస్తోంది. భారతదేశంలో ఈ రాష్ట్రం ముందుండేది. రాష్ట్రం విడిపోయిన తరువాత, ప్రస్తుతం తమిళనాడు తరువాత రెండవ స్థానంలో ఉంది. త్రాగునీరు, వ్యవసాయ పనులు మొదలైన అన్ని కార్యక్రమాలు పూర్తి చేస్తాం.

చివరిగా ఒక్కమాట మనవి చేస్తున్నాను. కష్టమొస్తే కొడుకులాగా, ఆపదొస్తే అన్నలాగా ఆదుకోడు ఏ నాయకుడూ చంద్రబాబులాగా అని చెబుతూ, తప్పకుండా ప్రజలను ఆదుకుంటామని ఈ సందర్భంగా చెబుతున్నాను.

శ్రీ పి. జె. చంద్ర శేఖర రావుః అధ్యక్షా, ఒక్కమాట చెబుతాను. నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎక్కడైతే కరువు ప్రాంతాలున్నాయో అక్కడి పశువులకు కావాల్సిన మేత, త్రాగునీరు, గడ్డికి సంబంధించిన అంశాల మీద జాతీయ స్థాయిలో, కరువు పీడిత ప్రాంతాలకు

సహాయం చేసే ఫెడరేషన్ ఉంది. నాకున్నటువంటి సమాచారం మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి వారి ముందుకు ఏ ఒక్క ప్రతిపాదనా పోలేదు. పశువులకు, పశువుల మేతకు, గడ్డికి సంబంధించి గాని విరాళాల రూపంలో, గ్రాంట్ల రూపంలో పూరికే వచ్చే డబ్బుల కోసం మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ప్రతిపాదనలేవీ ఎన్‌డిడిఎఫ్ ముందుకు పోలేదనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించి ఆ రకమైన సాయాన్ని తీసుకోవాలని కోరుతున్నాను. అలాగే, గౌరవ మంత్రివర్యులకు విజ్ఞప్తి చేసేదేమంటే – నీళ్లు దొరకనటువంటి దగ్గర మనం రైళ్లు పెడితే ఏముంది, వెహికల్స్ పెడితే ఏముంది, డబ్బులిస్తే ఏముంది? నీళ్లు ఎక్కడైతే ఐడెంటిఫై చేస్తున్నామో, ఆ నీళ్లని ఏఏ గ్రామాలకు, మండలాలకు, కరువు పీడిత ప్రాంతాలకు ఏ అవసరార్థం కోసంగా, ఎప్పటి నుండి ఎంత కేటాయించి సప్లై చేస్తామనే కాంప్రెహెన్సివ్ సమాధానం మంత్రి గారు ఇవ్వాల్సిన అవసరముంది. మరి ఆశావహంగా ఉండేలా ఎన్నికల ప్రణాళిక మాదిరిగా ప్రకటించారు. అధికారంలోకి వచ్చి ఆర్నెల్లు అయిపోయింది. హనీమూన్ అయిపోయిన తరువాత, సంసారం మొదలుపెట్టాలి. ఆ సంగతి మాత్రం ఎక్కడా కనపడటం లేదు. కాబట్టి, మంత్రివర్యులు సమాధానం చెప్పేటప్పుడు, అనంతపురం జిల్లాకు రూ.25 కోట్లు ఇస్తారా, లేదా అని అడిగారు. 28, 29 వ తేదీల్లో ఇస్తామని మంత్రి గారు చెప్పడం కాంప్రెహెన్సివ్‌గా ఉన్నది. 30, 31 తేదీల్లో డబ్బులిస్తారని అనుకుంటున్నాము. కానీ, ప్రభుత్వం వచ్చి ఆర్నెల్లు అయినా ఎన్‌డిడిఎఫ్ ముందు దరఖాస్తు ఎందుకు పెట్టలేదనే దానికి మాత్రం మా గౌరవ మంత్రి గారు సమాధానం చెప్పాలి.

శ్రీ ఎం.వి.ఎస్.శర్మః చిన్న క్లారిఫికేషన్ సార్. ఇప్పుడు ఈ కరువు పీడిత జిల్లాల్లో రెండు జిల్లాల నుండి వచ్చిన ప్రపోజల్స్‌ని పూర్తిగా తిరస్కరించారు. విశాఖపట్నం జిల్లాలో 26 మండలాలు, పశ్చిమ గోదావరి జిల్లాలో 29 మండలాలేమో ఉన్నాయి. కరువు మండలాలుగా ప్రకటించాలని కోరుతూ ప్రతిపాదనలు ఆ జిల్లాల నుండి వచ్చినా, ప్రభుత్వం మాత్రం ఆ జిల్లాల్లో కరువు లేదని నిర్ధారణకు వచ్చినట్లుంది. ఆ రెండు జిల్లాలకు ఏవిధమైన రిలీఫ్ లేదు. క్రింది నుండి ప్రతిపాదనలు వచ్చినా, ఆ జిల్లాల్లోని మండలాలకు రిలీఫ్ ఎందుకు ఇవ్వలేదో మంత్రి గారు చెప్పాలి.

శ్రీ ఆర్. రెడ్డప రెడ్డిః క్వాంటమ్ మెజర్స్‌కి రూ.2000 కోట్లు అవసరం. Not Rs.25,000 Cr. or Rs.30,000. Whether they were allocating that Budget or not ? అనేది స్పెసిఫిక్‌గా టైం బౌండ్‌గా చెప్పాలి. Otherwise, God bless you, Government will bless you అని అంటుంటే, this is not Correct and we are not expecting that answer from the Government. కాబట్టి, అది కరెక్టు కాదు. కావాలంటే, మీరు హోం వర్కు చేయండి. పర్మినెంట్‌గా వీటిని టేకప్ చేస్తారా? ఎంత టైం ఫ్రేంలో చేస్తారు? మీకు బడ్జెట్ ఉందా? Because, it is linked with thousands of crores. కాబట్టి, ఆ విషయంలో స్పెసిఫిక్‌గా మంత్రి గారు సమాధానం చెబితే బాగుంటుంది.

శ్రీ కె.ఎస్. లక్ష్మణ రావు (ఉపాధ్యాయ నియోజకవర్గం, కృష్ణా, గుంటూరు)ః అధ్యక్షా, గుంటూరు జిల్లాలో నాలుగు మండలాలను మాత్రమే కరువు జిల్లాలుగా ప్రకటించారు. వాస్తవానికి పల్నాడు ప్రాంతంలో పది మండలాలున్నాయి. ఆ పది మండలాలు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. మీ ద్వారా మంత్రి గారిని కోరేదేమంటే– జిల్లా యంత్రాంగం నుండి మరొక్కసారి నివేదికను తెప్పించుకుని, మిగిలిన మండలాలను కూడా ఈ కరువు మండలాల జాబితాలో చేర్చాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

డా. పల్లె రఘునాథ రెడ్డిః అధ్యక్షా, కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సరైన ప్రతిపాదనలు పోలేదని ఆరోపించడం సరైంది కాదు. ఎందుకంటే, ఇంతకుముందే నేను ఖచ్చితంగాను, స్పష్టంగాను చెప్పాను. ఎన్ఆర్ఇజిఎస్ కోసం రెండు నెలల క్రితం రూ.1300 కోట్లకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాము. అదేవిధంగా పిఎంసియు రోడ్లకు గానీ, ఇతరత్రా రోడ్లకు గానీ కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే నిధులు ఒక్క పైసా కూడా వేస్ట్ చేయకుండా మనకు వచ్చేందుకు ప్రయత్నం చేస్తాము. గతంలో కూడా మీకు తెలుసు. మా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, మెప్పించి తెప్పించిన మేము, ఈనాడు ఒక్క పైసాని కూడా వదిలిపెట్టము. ఆ విషయంలో సభ్యులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు. రెండవదేమంటే, కొన్ని జిల్లాలను వదిలిపెట్టారని చెప్పారు. కరువు జిల్లాలుగా ప్రకటించాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు ఒక మెమో పంపితే, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి, కృష్ణా జిల్లాల కలెక్టర్లు తమ జిల్లాల్లో కరువు పీడిత ప్రాంతాల్లేవని తెలిపారు. మిగిలిన 9 జిల్లాల కలెక్టర్లు కరువు ప్రాంతాలుగా ప్రకటించేందుకు 324 మండలాలను గుర్తించి, ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఇంకా ఏమన్నా మండలాలను సభ్యులు ప్రతిపాదిస్తే, మరొక్కసారి ఎగ్జామిన్ చేసి, వాటిని కూడా కరువు మండలాలుగా ప్రకటించేందుకు చర్యలు తీసుకుంటాము. ఈ అర్హతలను బట్టి, గైడ్‌లైన్స్ పరిధిలోకి వస్తే, తప్పకుండా వాటిని కూడా జాబితాలో చేర్చే ప్రయత్నం చేస్తామని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. అదేవిధంగా గుంటూరు జిల్లాలోని కొన్ని మండలాల గురించి సభ్యులు చెప్పారు. ఇంకా మీరు ప్రతిపాదనలు పంపిస్తే, వెరిఫై చేసి, ఆ గైడ్‌లైన్స్ పరిధిలోకి వస్తే, వాటిని కూడా తప్పకుండా వాటిని కరువు పీడిత మండలాలుగా ప్రకటించడానికి అవకాశం ఉంటుంది.

శ్రీ జి. తిప్పేస్వామి (శాసనసభ నియోజకవర్గం)ః అధ్యక్షా, మీ ద్వారా మంత్రి గారిని అడుగుతున్నాను. అనంతపురం జిల్లాలోని కరువును జాతీయ విపత్తుగా ప్రకటించడానికి ఈ సభ ద్వారా తీర్మానం చేయాల్సిందిగా కోరుతున్నాను. దయచేసి, అనంతపురం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటిస్తే, అనేకరకాల ఫండ్స్ రావడానికి అవకాశముంటుంది. దయచేసి, ఆ విధంగా తీర్మానం చేయవలసిందిగా కోరుతున్నాను.

డా.ఎం. గేయానంద్ః అధ్యక్షా, మంత్రి గారు సభ్యుల ప్రశ్నలకు జవాబు చెప్పారు. చాలా సంతోషం. అనంతపురం జిల్లాలో ప్రత్యేకించి ఇప్పుడున్న ఇన్సూరెన్స్ పథకం సరిగ్గా పనిచేయడం లేదు, దానివల్ల ఉపయోగం లేదని చెప్పారు. మీ ద్వారా నేను కోరేదేమంటే – అనంతపురం జిల్లాలో ఉన్న ప్రత్యేకమైన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, అక్కడ ప్రత్యేకమైన ఇన్సూరెన్స్ పథకాన్ని డెవలప్ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

డా. పల్లె రఘునాథ రెడ్డిః అధ్యక్షా, ఇన్సూరెన్స్ వల్ల ఉపయోగం లేదని చెప్పడం కంటే కూడా, నేషనల్ అగ్రికల్చరల్ ఇన్సూరెన్స్ పథకం క్రింద ఇప్పుడుండే ఇన్సూరెన్స్ పద్ధతిని అవలంభిస్తే, వాళ్లకు కొద్దిగా నష్టం వస్తుంది. వాతావరణం కొద్దిగా మెరుగైనప్పటికీ దాని వల్ల కూడా నష్టం వస్తోంది. బెస్ట్ 5 ఇయర్స్‌లో, వన్ ఇయర్ తీసుకుని, దాని ప్రకారం మదింపు చేస్తే, ఫ్రెష్‌గా తీసుకుంటే ఉపయోగం ఉంటుందని ప్రభుత్వానికి లేఖ రాశాము. సభ్యులందరి అందరి అభిప్రాయాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుని ఏ విధంగా చేస్తే మెరుగ్గా ఉంటుంది, అనంతపురం జిల్లా ప్రజలకు ఉపయోగపడుతుంది అన్నది చూసి, ఆ దిశగా ప్రభుత్వం ముందుకుపోతుంది.

శ్రీ బి. చంగల్ రాయుడుః అధ్యక్షా, గుజరాత్‌లో యానిమల్ హాస్టల్ సిస్టం ఒకటి నరేంద్ర మోడీ గారు ముఖ్యమంత్రిగా ఉండగా క్రియేట్ చేశారు. నేను కూడా పోయి చూసి వచ్చాను. ముఖ్యంగా మంత్రివర్యులు శ్రీ పల్లె రఘునాథ రెడ్డి గారు చెప్పిన మాటల్ని బట్టి, నీళ్లు లేని చోట్ల విత్తనాలు ఇచ్చేదానికన్నా ఈ హాస్టల్ సిస్టం మెరుగైనది. ఎక్కడి నుండో గడ్డి తీసుకువచ్చి, పశువులను మేపించి రైతులను ప్రభుత్వం వారు ఆదుకుంటున్నారు. వాటి ద్వారా వచ్చే పాలు కూడా రైతులకే చెందుతాయి. గుజరాత్‌లో మాదిరిగా యానిమల్ హాస్టల్ సిస్టంని ఇక్కడ కూడా తీసుకురావడానికి ప్రయత్నం చేయాలి. ముఖ్యంగా రాయలసీమ ప్రాంత లెజిస్లేటర్లని అక్కడకి పంపించి, స్టడీ చేయవలసిందిగా కోరుతూ, ఆ బృందానికి మంత్రివర్యులు శ్రీ పల్లె రఘునాథ రెడ్డి గారిని నాయకత్వం వహించాల్సిందిగా కోరుతున్నాను.

మ.12.30

డా. పల్లె రఘునాథ రెడ్డి ః గౌరవ సభ్యులు చెప్పినట్లు ఎక్కడైతే నీళ్లు ఉండవో, అక్కడ గడ్డిని ప్రొవైడ్ చేస్తాము. దానిని సవరించుకోవాలని సభ్యులకు మనవిచేస్తున్నాను. ఏదైనా సభ్యులు చెప్పిన సలహాలను పరిగణనలోకి తీసుకుంటాము. ఉచిత గడ్డి కేంద్రాలను ఏర్పాటు చేసి సరఫరా చేస్తాము. ప్రస్తుతానికి తాత్కాలికంగా ఏర్పాటు చేశాము. గౌరవ సభ్యులు చెప్పినదానిని సీరియస్‌గా తీసుకుని ఏ విధంగా చేస్తే బాగుంటుందో చూసి ఆ విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

డా. ఎం. గేయానంద్ః చివరగా ఒక్క విషయం మంత్రిగారికి మనవి చేస్తాను. జాతీయ ఉపాధి హామీ పథకం అనంతపురంలో చాలా ముఖ్యమైన పథకం. దానిని కుదిస్తున్నారు. దానిని కుదించకుండా యథాతథంగా అమలు చేయాలని అనంతపురం జిల్లా పరిషత్తు తీర్మానం చేసింది. కాబట్టి, ఉపాధి హామీకి సంబంధించి కుదింపు లేకుండా రాష్ట్రంలో అన్ని మండలాల్లో ఏ విధంగా ఉన్నదో ఆ విధంగానే చేయాలని యథాతథంగా అమలయ్యేలా చూడాలని, అవసరమైతే మనం కూడా ఒక తీర్మానం చేసి పంపించాలని కోరుతున్నాను. తెలంగాణా ప్రభుత్వం వారు చేసి పంపించారు.

శ్రీ సి.హెచ్. అయ్యన్నపాత్రుడు ః గౌరవ సభ్యులు చెప్పినట్లు జాతీయ ఉపాధి హామీ పథకం కుదిస్తున్నారన్న మాట వాస్తవం కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో దాని మీద చర్చ లేదు, ఆ ఆలోచన లేదు. కాబట్టి, దాని గురించి సభ్యులు ఇబ్బంది పడవలసిన అవసరం లేదు. రెండవది, అధ్యక్షా, తమ ద్వారా సభకు ఒక చిన్న అప్పీల్ చేయదల్చుకున్నాను. కరువు గురించి అందరమూ మాట్లాడాము. ఎక్కడెక్కడ వనరులు ఉన్నాయో అందరూ సలహాలు ఇవ్వవలసిన అవసరం ఉన్నది. ఉదాహరణకు కడప జిల్లాలో పులివెందుల నియోజకవర్గంలో పెద్ద స్కీము ఉన్నది. దాని ద్వారా మిగతా వాటికి నీటి సౌకర్యం కల్పించబడుతుంది. అయితే, అక్కడ మోటారు ఫెయిల్ అయిందని నా దృష్టికి వచ్చింది. నేను 24 గంటలలో రూ. 40 లక్షలు మంజూరు చేశాను. కానీ, అది అమలు జరగకుండా అక్కడ ఛైర్మన్ కోర్టుకు వెళ్లి స్టే తీసుకువచ్చారు. ఒక పక్క ప్రజలు నీళ్లు లేక బాధ పడుతుంటే, ఇటువంటి సంఘటనలు జరుగుతున్నప్పుడు ఆ జిల్లాలో ఉన్న పెద్దలు కలుగజేసుకుని కోర్టులో స్టే వెకేట్ చేయిస్తే, సుమారు 200 గ్రామాలకు మంచినీటి సౌకర్యం కలుగుతుంది. ఇటువంటి సందర్భాలలో గౌరవ సభ్యుల సహకారం కావాలని తమ ద్వారా అప్పీల్ చేస్తున్నాను.

## హుద్ హుద్ తుఫాన్ పై లఘు చర్చ కొనసాగింపు – తీర్మానం

MR. CHAIRMAN : Now, we will continue the discussion on Hud-Hud.

శ్రీ డి.వి. సూర్యనారాయణ రాజు (స్థానిక సంస్థలు, విశాఖపట్టణం): అధ్యక్షా, హుద్‌హుద్ తుఫాను మీద మాట్లాడడానికి నాకు అవకాశమిచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. అక్టోబరు, 12వ తారీఖు నాడు మధ్యాహ్నం వరకూ తక్కువగానే గాలులు వీచాయి. ముందుగానే మీడియా, ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేయడం వల్ల ప్రాణ నష్టం తగ్గించుకోగలిగాము. మధ్యాహ్నం 1 గంట నుండి 2 గంటల వరకూ గాలి ఉధృతి తగ్గిన తరువాత సాయంత్రం మూడు గంటల ప్రాంతంలో దాదాపు 220 కి.మీ. పైబడిన విపరీతమైన గాలులు వీచి, వర్షం పడడం అనేది ఇప్పటికీ కళ్లముందు కనబడుతున్నది. ప్రత్యక్షంగా మేము ఆ ప్రాంతంలో ఉన్నాము కాబట్టి, మేము చూశాము. పక్కా ఇళ్లు కూడా ఉంటాయా, ఉండవా మా పరిస్థితి ఏమిటి అన్న విషయాన్ని గుర్తు చేసుకుంటే ఇప్పటికీ చాలా బాధ కలుగుతుంది. ప్రభుత్వం యంత్రాంగం, ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు సరైన సమయానికి వచ్చి వారి ప్రయత్నం వారు చేశారు గానీ, ప్రతిఫలం మాత్రం కొంచెం తక్కువగానే ఉన్నదని చెప్పక తప్పదు. ముందుగా నిత్యావసర సరుకుల గురించి చెప్పాలి. విశాఖపట్టణంలో పాలు, నీళ్లు, పెట్రోలు చాలా ఎక్కువ రేట్లకు విక్రయించడం వల్ల సాధారణ ప్రజలు ఇబ్బంది పడ్డారు. మూడు రోజులు గడచిన తరువాత పాల సరఫరా, నీటి సరఫరాలను పునరుద్ధరించడం జరిగింది. ఎవరైతే 3, 4 రోజులు ఈ విధానానికి పాల్పడ్డారో వారిపైన ఏ చర్యలు తీసుకున్నారు అన్న సంగతి ప్రభుత్వం గుర్తుంచుకోవాలి. ఇళ్లకు జరిగిన నష్టపరిహారం విషయానికి వస్తే, ఎక్కువగా మా జిల్లాలో వేల ఇళ్లు నేలమట్టమైపోయినప్పటికీ కూడా, పాక్షికంగానే నష్టపోయాయని నమోదయ్యాయి. దానికి రూ.5,000లు మాత్రమే నష్టపరిహారం ఇవ్వడం జరిగింది. అది కూడా లబ్ధిదారుల యొక్క అకౌంట్లకు 80 శాతం అందాయి. మిగతాది ఇంకా రావల్సి ఉన్నది. అలాగే, నిత్యావసర వస్తువులు సరఫరా చేసేటప్పుడు తెల్ల కార్డులు కానీ, మిగతా కార్డులు గానీ, ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో విధంగా సప్లై చేయడం జరిగిందని తమ ద్వారా తెలియచేస్తున్నాను. ఎందుకంటే, తుఫాను సముద్రం దగ్గరే కాదు, యావత్ జిల్లాను చుట్టుముట్టింది. అటువంటప్పుడు విశాఖపట్టణం నగరంలో గానీ, సముద్ర తీర ప్రాంత మండలాలలో గానీ, 25కె.జీలు, 50 కె.జీలు బియ్యం, 9 రకాల నిత్యావసర సరుకులు ఇవ్వడం జరిగింది. మా ప్రాంతానికి వచ్చేసరికి 10 కే.జీల బియ్యాన్ని ఇచ్చారనే సంగతి సభ దృష్టికి తీసుకువస్తున్నాను. వీటికి ఏవో కొన్ని నిబంధనలు పెట్టుకున్నారు. తుఫాను వచ్చిన 5, 6 రోజులే కాకుండా నెల రోజులు పనులు లేనప్పుడు ఆ సరుకులు ఉపయోగపడతాయని ఇవ్వడం జరిగింది. ఇవి కూడా ఒక దగ్గర 5 రకాలు, మరో చోట 9 రకాలు ఇచ్చారు. 12 లక్షల రేషన్ కార్డులుంటే 14 లక్షల మందికి సరుకులు ఇచ్చామని ప్రభుత్వ నివేదికలో చెప్పారు. అధ్యక్షా,చివరలో ఎమ్‌ఎల్‌ఏలు ప్రతిపాదించిన వ్యక్తులకు ఇవ్వడం వల్ల కొద్దిగా తప్పులు జరిగాయి. "తుఫాను సరుకులు స్వాహా" అని జ్యోతి పత్రికలో కూడా రావడం జరిగింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వారు బంగాళాదుంపలను, బియ్యాన్ని ఎక్కువ మోతాదులో పట్టుకోవడం జరిగిందని నేను సభకు తమ ద్వారా మనవి చేస్తున్నాను. నష్టపరిహారం గురించి ఈ విధంగా జరిగితే, గ్రామీణ రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది. విశాఖపట్టణం సిటీలో కంపెనీలకు, ప్రభుత్వానికి నష్టం జరిగింది తప్ప వ్యక్తిగతంగా జరిగిన నష్టం చాలా తక్కువ. ఏదైనా వ్యక్తిగతంగా నష్టం జరిగితే బీమా వల్ల లబ్ధి పొందారు. గ్రామీణ ప్రాంతానికి వచ్చేసరికి కనీవినీ ఎరుగని రీతిలో నష్టం జరిగింది. వరి, చెరుకు, పత్తి, కందులు, పొగాకు వంటి పంటలు ఒక సంవత్సరం నష్టపోయినా మరో సంవత్సరం

పండుతాయి. కానీ, మామిడి, జీడి, పామాయిల్, కొబ్బరి తోటలు వంటివి ఏ ఒక్క సంవత్సరం నష్టపోయినా మళ్లీ 5 సంవత్సరాల వరకూ ఆ వ్యవసాయాన్ని పునరుద్ధరించుకోలేని పరిస్థితి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం తరఫున గతంలో కంటే హెక్టారుకు నష్టపరిహారం పెంచడం వాస్తవమేనని తెలియచేస్తున్నాను. అయినప్పటికీ, వరికి సంబంధించి మొత్తం జిల్లాలో వరి సాగు 90 శాతం జరిగేది విశాఖపట్టణంలోనే. అందులో ఈ నష్ట పరిహారం చెల్లించిన భాగం కేవలం 5 నుండి 10 శాతం మాత్రమే. ప్రస్తుతం వరి పంటకు కోతలు కోస్తున్నారు, నూర్పులు అవుతున్నాయి. సోనామసూరి, 1001 రకాలలో ఎకరానికి 25 క్వింటాళ్లు పండవలసిన ధాన్యం 5, 6 క్వింటాళ్లకు సరిపెట్టుకోవలసిన పరిస్థితి ఏర్పడుతోంది. పంట నష్టపరిహారం ఇస్తున్నాము కాబట్టి, ప్రతి ఎకరానికి ఇవ్వవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉన్నదని తమరికి మనవి చేస్తున్నాను.

(గౌరవ డిప్యూటీ ఛైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు.)

చెరుకు విషయానికి వస్తే, నాలుగు షుగర్ ఫ్యాక్టరీలు విశాఖపట్టణంలో ఉన్నాయి. గత సంవత్సరంలో ఈ నాలుగు షుగర్ ఫ్యాక్టరీలలో దగ్గరదగ్గర 15 లక్షల టన్నుల చెరుకును గానుగ పట్టడమయింది. ఈ సంవత్సరం 7 లక్షల టన్నులకు మించి గానుగ ఆడే పరిస్థితి కనిపించడం లేదు.

మ.12.40

సుమారు 60 నుంచి 65 శాతం మేర చెరకు పంట నష్టం జరిగితే, నేడు చెరకు పంటకు ఇచ్చిన నష్టపరిహారం కేవలం 20 శాతం మాత్రమే అనే విషయాన్ని నేను సభ దృష్టికి తీసుకువస్తున్నాను.

పొగాకు, పత్తి, కందులు మొదలైన పంటలకు జరిగిన నష్టం ఎక్కువగా ఉండి, రైతులకు అందిన నష్టపరిహారం చాలా తక్కువ ఎకరాలకు ఇవ్వడం జరిగిందనే విషయాన్ని తమరిద్వారా నేను ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను. 50 నుంచి 60 సంవత్సరాల వయస్సున్న మామిడి మరియు జీడి తోటల్లో ఒక ఎకరంలో 25 నుంచి 40 మొక్కలుంటే, విపరీతంగా పత్తి మొక్కలు కూడా వేళ్లతో సహా పడిపోయిన పరిస్థితి అక్కడ ఉంది. వేలాది ఎకరాల్లో ఇటువంటి నష్టం జరిగింది. ఈ నష్టాన్ని అంచనా వేయడంలో ఉద్యానవన శాఖ పూర్తిగా వైఫల్యం చెందిందని నేను మనవిచేస్తున్నాను. ఎందుకంటే, నేను ప్రత్యక్షసాక్షిని. నాకున్న వ్యవసాయ క్షేత్రంలోనే అనేక మామిడి చెట్లు పడిపోవడం జరిగింది. సుమారు 50 సంవత్సరాల నుంచి పెంచుకున్నటువంటి కొన్ని లక్షల రూపాయల ఆదాయాన్ని తెచ్చిపెట్టే చెట్లు సర్వనాశనం అయిపోవడం జరిగింది. కానీ, నష్టపరిహారాన్ని సరిగా అంచనా వేయలేకపోయారు. ఉద్యానవనశాఖ పరిధిలో జరిగిన నష్టపరిహారాన్ని నేటి వరకూ కూడా ఎవరికి నష్టం జరిగింది, ఎవరికెంత నష్టపరిహారం ఇస్తామని ఇంకా గ్రామసభల్లో కూడా పెట్టిన పరిస్థితులు లేవని నేను తమరికి మనవిచేస్తున్నాను.

మేము గత రెండు నెలల నుంచి పడిపోయిన వృక్షాల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టాము. టన్ను ఒక్కంటికి సుమారు రూ. 1500 లు నుంచి రూ. 2 వేలు అమ్మే వంట చెరకు పంట నేడు రూ. 300 లు నుంచి రూ. 350 లకు అమ్ముకునే పరిస్థితి కనిపిస్తోంది. పడిపోయిన చెట్లను ఎవరైతే ఇంతకుముందు ఉండే రేటు కంటే తక్కువ రేటుకు అమ్మారో వారిని శిక్షించాలని కూడా ప్రభుత్వం చెప్పడం జరిగింది. అటువంటిదేదీ జరగలేదని నేను మనవిచేస్తున్నాను. హుద్ హుద్ తుఫాను వల్ల ప్రతి పంటకూ విపరీతమైన నష్టం వాటిల్లింది. ఎకరానికి సుమారు పది నుంచి

పన్నెండు టన్నులు వచ్చే పామాయిల్ నేడు ఎకరానికి రెండు లేదా మూడు టన్నులకు పడిపోయిన విషయాన్ని నేను మనవిచేస్తున్నాను. ఉద్యానవన పంటలకు ఎక్కువ నష్టం వాటిల్లింది. మళ్లీ నేడు మొక్కలు వేసి ఉద్యానవన పంటలను రక్షించుకోవాలంటే రమారమి ఐదారు సంవత్సరాల సమయం పట్టే పరిస్థితి ఉంది. మా మంత్రిగారు ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. మంత్రిగా కూడా ఒక విషయం అక్కడ తెలియజేయడం జరిగింది. పడిపోయిన చెట్లను తొలగించుకోవడానికి రూ. 150 ల నుంచి రూ. 200 ల వరకూ పరిహారాన్ని ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. పథకం నుంచి ఉపయోగించుకోవచ్చని ఆయన చెప్పడం జరిగింది. కానీ, ఆ చెట్లను అప్పుడే తొలగించుకోవడం జరిగిపోయింది. కానీ, ఏ ఒక్క చెట్టుకీ నష్టపరిహారం ఇంతవరకూ అందలేదు. ఇంకా ఆ చెట్లను ఫొటోలు తీయడంలోనే ఉన్నారు. చెట్టంతా అక్కడనుంచి తొలగించాక అక్కడ ఆ చెట్టుమొదలు మాత్రమే ఉంటుంది. కాబట్టి వెంటనే తగిన చర్యలు చేపట్టి చిన్నకారు రైతులకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం ముందుకు వెళ్లాలని నేను తమరిద్వారా మనవిచేస్తున్నాను.

సుమారు రూ. 60 వేల కోట్లు నుంచి రూ. 70 వేల కోట్లు తుఫాను వల్ల నష్టం జరిగిందని ఈనాడు వార్తాపత్రికలో ప్రచురించడం జరిగింది. ఆ తరువాత రూ. 30 వేల కోట్లు నష్టం అని అన్నారు. నేడు ప్రభుత్వం ఇచ్చిన సమాచారం ప్రకారం ఆ నష్టాన్ని రూ. 21 వేల కోట్లకు కుదించడం జరిగింది. మాకు ఇచ్చిన లెక్కల ప్రకారం ప్రభుత్వ పరంగా రూ. 844.60 కోట్లు నష్టపరిహారంగా ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వం నివేదిక ఇవ్వడం జరుగుతోంది. ఆ మొత్తంలో రూ. 400 కోట్లు కేంద్రప్రభుత్వం మరియు మిగిలిన రూ. 450 కోట్లు రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన సంగతి గుర్తుంచుకోవాలి. అంటే, మొత్తం నష్టపరిహారంలో కేవలం 2 శాతం నష్టపరిహారాన్ని రైతులకు మరియు ఇళ్లు కోల్పోయిన వారికి ఇవ్వడం జరిగిందన్న విషయాన్ని నేను మనవిచేస్తున్నాను.

మరొక విచిత్రమైన విషయం ఏమిటంటే, పక్కా ఇళ్లు పాక్షికంగా దెబ్బతింటే, వాటికి రూ. 5 వేల నష్టపరిహారాన్ని ప్రకటిస్తే, పశువుల పాకలకు రూ. 10 వేల నష్టపరిహారాన్ని ప్రభుత్వం ప్రకటించడం జరిగింది. పశువుల పాకలకు కూడా డబ్బులు ఇవ్వడం చాలా సంతోషం. అయినప్పటికీ, నేటి వరకూ ఎన్యుమరేషన్ జరగలేదు, ఆ లిస్టు ఫైనలైజ్ కాలేదు. ఇప్పటికే రైతులు పడిపోయిన ఆ పాకలను తిరిగి నిర్మించుకోవడం జరిగింది. ఎప్పటిలోగా ఆ పాకలకు నష్టపరిహారాన్ని ఇవ్వగలమో నాకు అర్థంకావడం లేదు.

శ్రీ సి.హెచ్.అయ్యన్నపాత్రుడు: అధ్యక్షా, సభ్యులు శ్రీ సూర్యనారాయణరాజు గారు విశాఖపట్నం జిల్లా వాస్తవ్యులు. హుద్ హుద్ తుఫానుకు సంబంధించిన తీవ్రత వారికి కూడా తెలుసు. గౌరవ ముఖ్యమంత్రిగారు మరియు మంత్రులు నిర్వహించిన తుఫానుకు సంబంధించిన సమావేశాల్లో వారు కూడా పాల్గొన్నారు. ప్రభుత్వానికి మరియు ప్రజలకు వారు తమ పూర్తి సహకారాన్ని కూడా అందించారు. నేను ఈ విషయంలో ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. పథకానికి సంబంధించిన మంత్రిగా గౌరవ ముఖ్యమంత్రిగారితో మాట్లాడడం జరిగింది. పొలాల్లో రైతులకు చెందిన చెట్లు పడిపోయాయి. వాటిని తొలగించడానికి కూడా కొంత మొత్తం ఖర్చవుతుంది కాబట్టి చెట్టుకు రూ. 150 ల నుంచి రూ. 200 ల వరకూ ఇచ్చి చెట్లను కట్‌చేసి వాటిని లిఫ్టింగ్ చేయడం కోసం ఇవ్వాలని మేము అనౌన్స్ చేయడం జరిగింది. ఎటువంటి అవకతవకలు జరగకూడదని ఈ విషయంలో మేము కొన్ని రూల్స్‌ను ఫ్రేమ్ చేశాము. మండల అభివృద్ధి అధికారి ద్వారా పడిపోయిన ఆ చెట్టుయొక్క ఫొటోలు తీయించి పంపించినట్లయితే ప్రతి చెట్టుకు రూ.150ల నుంచి

రూ.200లు ఇవ్వడానికి ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరం లేదని మేము ప్రకటించడం జరిగింది. కొంతమంది ఆధారాలతో సహా పంపించారు. మేము వారికి నష్టపరిహారాన్ని విడుదల చేశాము. ఎటువంటి ఆధారాలు లేకుండా నష్టపరిహారం ఇవ్వడం కుదరదు. ఎందుకంటే, నిధుల దుర్వినియోగం జరగవచ్చు. మరో విషయం, పశువుల పాకలగురించి గౌరవసభ్యులు చెప్పారు. మాప్రాంతంలోని శ్రీకాకుళం, విజయనగరం మరియు విశాఖపట్నం జిల్లాల్లో ఉన్న అలవాటు ఏమిటంటే, రైతుగా ఉన్నవారు భార్యాభర్తలు ఇద్దరూ కలిసి ఉదయం 6 గంటలకు పొలానికి వెళ్లి రాత్రి 8 గంటలకు ఇంటికి తిరిగి వస్తారు. వారు ఇంటిని ఏ విధంగా చూసుకుంటారో, పొలాల్లోని పశువుల పాకలను కూడా అదే విధంగా చూసుకుంటారు. అందుచేత, పశువుల పాకలన్నీ దెబ్బతిన్న విషయాన్ని నేను గౌరవ ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువెళ్లి ప్రతి పశువుల పాకకు కూడా రూ. 10 వేలు ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. దానికి జి.ఓ. కూడా విడుదల చేయడం జరిగింది. అక్కడున్న రైతు చెట్లయొక్క ఫొటోలు లేదా ఏదైనా ఆధారం చూపిస్తే తప్పకుండా నష్టపరిహారం చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అటువంటి మిస్ అయిన కేసులు ఏవైనా ఉంటే, సభ్యులు ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చినట్లయితే తప్పనిసరిగా నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని నేను తమరిద్వారా సభ్యులకు తెలియజేస్తున్నాను.

శ్రీ డి.వి. సూర్యనారాయణ రాజు: అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు మరియు మంత్రులు తుఫాను సంభవించిన తర్వాత జిల్లాలోనే ఉండి చాలా చక్కగా ఆ జిల్లాల్లో పరిస్థితులన్నీ సమీక్షించారని నేను ముందుగానే చెప్పాను. దానిలో ఎటువంటి సందేహం లేదు. కానీ, ఇచ్చినటువంటి ఆదేశాలను సక్రమంగా అమలుచేయకపోవడం వల్ల ఈ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని నేను మనవిచేస్తున్నాను.

కరెంటు సరఫరా విషయానికి వస్తే, 24 గంటల్లో కరెంటు వచ్చింది, 48 గంటల్లో కరెంటు వచ్చిందని చెప్పారు. విశాఖపట్నం సిటీలో సబ్‌స్టేషన్‌కు అతి సమీపంలో నాకు ఒక ఇల్లుంది. ఆ ఇంటికి కరెంటు రావడానికి మూడు రోజుల సమయం పట్టింది. అంత పెద్ద తుఫాను వచ్చిన తర్వాత మూడు రోజుల్లో కరెంటు సరఫరా చేయడం కూడా చాలా గొప్పవిషయమని నేను మనవిచేస్తున్నాను. చాలా సంతోషం. గ్రామాలలో ఉన్న గృహాలకు కరెంటు సరఫరా విషయంలో, మా మండలం మరియు మా చుట్టుప్రక్కల మండలాల్లో 15 రోజుల సమయం పట్టింది. తేది. 12.10.2014 న కరెంటు పోయింది. దీపావళి పండుగ నాడు కూడా గ్రామాల్లో కరెంటు లేదు. దానికి కూడా నేను తప్పుపట్టడం లేదు. తుఫాను వల్ల వేలాది కరెంటు స్థంభాలు విరిగిపోవడం జరిగింది. అందరూ చాలా కష్టపడి పనిచేశారు. కానీ, కరెంటును ఒక్క రోజులోనో, రెండు రోజుల్లోనో తిరిగి పునరుద్ధరించామని చెప్పడం సరైన పద్ధతి కాదని నేను భావిస్తున్నాను.

తుఫాను వచ్చాక నేటి వరకూ కూడా ఒక వర్షపు నీటి చుక్క కూడా రాలేదు. వరిధాన్యం పొట్టదశలో ఉంది. కొన్ని వరిపంటలను కోయడం జరుగుతోంది. కొన్ని పంటలు పాలుపోసుకునే పరిస్థితిలో ఉన్నాయి. అక్కడ ఇటువంటి పరిస్థితులుంటే, వర్షపు నీరు లేదు, వ్యవసాయ పంపుసెట్లను పునరుద్ధరించవలసి ఉంది. వాటిని పునరుద్ధరించడం కోసం ఈనాటికి కూడా నా మండలంలో 50 నుంచి 55 శాతం వ్యవసాయ పంపుసెట్లకు ఇంకా కరెంటు రాలేదనే విషయాన్ని నేను ప్రభుత్వదృష్టికి తమరిద్వారా తీసుకువస్తున్నాను.

సమస్యలున్నాయి, లేవని కాదు. ప్రభుత్వం పని చేయలేదని కానీ నేను మనవి చేయడం లేదు. సాక్షాత్తు ప్రధానమంత్రిగారే తన విశాఖజిల్లా పర్యటన సందర్భంగా రూ.1000 కోట్ల తక్షణ సహాయాన్ని ప్రకటించారు, ఇది తాత్కాలిక సహాయమేనని అన్నారు. కాబట్టి దాదాపు రూ. 5000 నుండి రూ.6000 కోట్ల వరకు ఆర్థిక సహాయం మన రాష్ట్రానికి అందవచ్చని, అందువల్ల మా మూడు జిల్లాల్లోని రైతులను ఆదుకోడానికి ప్రభుత్వానికి చేయూతగా ఉంటుందనుకొని భావించాం. ప్రకటించిన సహాయంలో ఇప్పటికి రూ.400 కోట్లు మాత్రమే మంజూరు చేశారు, మిగిలిన రూ.600 కోట్ల మంజూరీతోనే కేంద్ర సహాయం ముగిసిపోతుందేమోననే సందేహం ప్రజలకు కలుగుతోంది. కనుక కేంద్రప్రభుత్వంపై మనందరం ఒత్తిడి తీసుకువచ్చి మనకు ఎక్కువ సహాయం వచ్చే విధంగా ప్రయత్నం చేయాలని నేను కోరుతున్నాను. నష్టపరిహారం విషయంలో కూడా పునరాలోచించి వాస్తవంగా రైతులు ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు, సాగు చేసిన పంట దిగుబడి ఏ విధంగా వస్తున్నదనే విషయాలను పరిశీలించాలి. పంట దిగుబడి 50 శాతం కన్నా తక్కువగా ఉందా, లేదా అనే విషయాలను కూడా పరిశీలించాలి. ఎందుకంటే, 50 శాతం కంటే పంట దిగుబడి తక్కువగా ఉంటే నిబంధనల ప్రకారం నష్టపరిహారం ఇచ్చే అవకాశం ఉంటుంది. మామిడితోటలు పడిపోయాయి, కానీ, పరిహారం కేవలం పంట నష్టానికి మాత్రమే ఇస్తున్నారు. పంట నష్టమంటే ఆ సంవత్సరంలో వచ్చే నష్టాన్ని కొద్దిగా పూరించుకోవడానికి రైతుకు ఇచ్చే సహాయం. పూర్తిగా మొక్క పడిపోతే దాని లైఫ్‌కి నష్టపరిహారం ఇవ్వాలి. కనుక ఆపదలో ఉన్న రైతుకి తప్పకుండా సహాయమందించి వారిని కాపాడాలని కోరుతున్నాను. ఇది సందర్భం కాకపోయినా చెప్పదలచు కున్నాను. అవి ఏమిటంటే – కలెక్టరు గారు 26 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడానికి ప్రతిపాదనలు పంపించడం జరిగింది. కనుక సదరు 26 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుకుంటూ, నాకు ఈ అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పీరుకట్ల విశ్వ ప్రసాదరావు (స్థానిక సంస్థలు, శ్రీకాకుళం) : అధ్యక్షా, హుద్ హుద్ తుఫానుపై మాట్లాడటానికి నాకు అవకాశం ఇచ్చినందుకు మీకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. 12–10–2014న హుద్ హుద్ తుఫాను అనేది ఉత్తరకోస్తా జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో చాలా తీవ్రంగా ఉండటం వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. తుఫాను తాకిడికి దాదాపు 220 కి.మీ. గాలి వేగంతో వీచడం, 57 సె.మీ. వర్షపాతం వల్ల జిల్లాల్లోని రైతులు నష్టపోవడం జరిగిందని మీ ద్వారా మనవి చేస్తున్నాను. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో వరిసాగు ప్రధానమైన పంట. ఒక పంటపైనే ఎక్కువ మంది ఆధారపడి ఉంటున్నారు. వరి సంవత్సరానికి ఒకే పంట కాబట్టి మొట్టమొదటిసారిగా నారు వేసి, దమ్ముపట్టి, విత్తనాలు చల్లి, ఒడిసి, ఎరువులు కూడా వేసిన తరువాత పూత సమయంలో ఈ తుఫాను రావడం జరిగింది. అనేక మదుపులు పెట్టి బ్యాంకుల నుంచి, ప్రైవేటు వ్యక్తుల నుంచి రైతు అప్పులు చేసి పంట చేతికి వస్తుందనుకునే సమయంలో తుఫాను భారీగా రావడంతో పూత పూర్తిగా రాలిపోయి దిగుబడి పూర్తిగా పడిపోయి రైతు పూర్తిగా నష్టపోవడం జరిగిందని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. రైతులు చాలా మట్టుకు మదుపులను పెట్టారు, తుఫాను వల్ల తీవ్రమైన గాలి వల్ల చాలావరకు మెట్ట ప్రాంతంలోని చెట్ల సంపద టేకు, బాసి, జీడిమామిడి, మామిడి మొదలైన రైతుకు దీర్ఘకాలికంగా ప్రయోజనాన్ని ఇచ్చే చెట్లన్నీ మొదలుతో సహా పడిపోయాయి. ఇందువల్ల చాలా మంది రైతు కుటుంబాలు దెబ్బతిన్నాయి. ధాన్యం విషయంలో

కూడా రైతులు అమ్ముకొనే పరిస్థితులు లేవు. కనుక దానిపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని రైతులు ధాన్యాన్ని మార్కెట్‌లో అమ్ముకునే విధంగా పరిస్థితులను కల్పించాలని ఈ సందర్భంగా మీకు మనవి చేస్తున్నాను. తుఫాను, వరదల వల్ల కొన్ని చోట్ల వేసిన చెరకు పంటంతా భూమిపాలైంది. అది చెరకు ఫ్యాక్టరీకి వేయడానికి, బెల్లం తయారీకి కూడా పనికి రాకుండా పోయింది.. అలాంటి రైతులను కూడా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కనుక తక్షణమే ప్రభుత్వం వారిని ఆదుకోవాలని తమరి ద్వారా కోరుతున్నాను. కొబ్బరి పంట నష్టం విషయంలో కౌన్సిల్ ఛైర్మన్ గారు మరియు వైస్ ఛైర్మన్ గారైన మీరు నష్టం సంభవించిన మూడు జిల్లాల్లో పర్యటించారు. జిల్లా కలెక్టర్లు, అధికారులతో రెవ్యూ కూడా నిర్వహించారు. మా జిల్లాలోని కొన్ని మండలాల్లోని పొలాలకి వెళ్లి కొబ్బరి తోటలు కూడా పరిశీలించారు. మీరు అక్కడికి రావడం వల్ల రైతులు చాలా ఆనందించారు. కౌన్సిల్ ఛైర్మన్ గారు మరియు వైస్ ఛైర్మన్‌గారు పర్యటించడం వల్ల ప్రజల్లో కౌన్సిల్‌పై గౌరవం కూడా బాగా పెరిగింది, వారు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. జరిగిన నష్టానికి పరిష్కార మార్గాలు చూపే విధంగా కౌన్సిల్ ద్వారా చర్చిస్తామని భరోసా ఇవ్వడం వల్ల వారు చాలా ఆనందించారు. ఆ నాడు రణస్థల మండలం పాతరపల్లి గ్రామంలో మీరు పరిశీలించినప్పుడు కొబ్బరి చెట్లు పూర్తిగా పడిపోయిన స్థితిలో ఉన్నాయి. ఒకవేళ చెట్లు పడిపోకుండా ఉన్నా మొవ్వలు రాలిపోవడం వల్ల మరలా భవిష్యత్తులో అవి ఎటువంటి ఫలం ఇవ్వవు. కనుక దానివల్ల కూడా రైతుకు నష్టమే. రైతులు చెబుతున్న విషయమేమిటంటే – పడిపోయిన చెట్లకే పరిహారం ఇస్తున్నారు, కానీ చెట్లు నిలబడి ఉన్నా, మొవ్వ రాలిపోయి ఎందుకు పనిరాని చెట్ల విషయంలో పరిహారం ఇవ్వడం లేదని మీ దృష్టికి తీసుకురావడం జరిగింది. కాబట్టి ప్రభుత్వం ఆలోచన చేసి సర్వే జరిపించి ఎందుకూ పనికిరాని చెట్లకు కూడా నష్టపరిహారం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మీ ద్వారా కోరుతున్నాను. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలో కోళ్ల పరిశ్రమల పరిస్థితి ఛైర్మన్ గారు, మీరూ చూశారు. యంఏ, యంబిఏ, యంఎస్సీ చదివిన నిరుద్యోగులైన యువకులు పూరిగుడిసెలు వేసుకొని భృతి కొరకు ఈ కోళ్ల ఫారాలను పెట్టుకున్నామని, తుఫాను వల్ల వందల, వేల సంఖ్యలో కోళ్లు చనిపోయాయి కనుక ప్రభుత్వం పరిశీలన చేసి వాటికి నష్టపరిహారం ఇచ్చేందుకు సిఫార్సు చేయడం జరిగిందని వారు చెప్పారు.

మ 1.00

వాళ్లు నిరుద్యోగులు కాబట్టి పర్మనెంట్ షెడ్లు వేసుకోలేరు. వాళ్లంతా తాటాకు షెడ్లు వేసుకుని ఉన్నారు. ఆ తాటాకుల షెడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. అలాంటి వాటికి ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వదని, మాకు నష్టపరిహారం అందదని వాళ్లు పడుతున్న ఆందోళనని ప్రభుత్వ దృష్టికి, ఛైర్మన్ గారి దృష్టికి తీసుకరావడం జరిగింది. దెబ్బతిన్న పర్మనెంట్ షెడ్లకు మాత్రమే గాకుండా గుడిసెలు వేసుకుని నష్టపోయిన వారికి కూడా ఎంతో కొంత నష్టపరిహారం అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. భారీ వర్షాల వల్ల, గాలుల వల్ల మాజిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో పశువులు గానీ, యాదవ కులాల వారికి చెందిన గొర్రెలు గానీ చాలా చనిపోయాయి. వారం రోజుల పాటు ఎవరూ కూడా ఇంటి నుంచి బయటకి వెళ్లి పశువులు ఎలా ఉన్నాయి, గొర్రెలు ఎలా ఉన్నాయో చూసుకునే పరిస్థితులు లేకుండా పోయాయి. మేము గ్రామీణ ప్రాంతంలో ఉన్నాం కాబట్టి, మేము కూడా ఆ తుఫాను బాధితులమే కాబట్టి పరిస్థితి తెలుసు. ఎవరి పశువులు ఏమయ్యాయో, ఎవరి గొర్రెలు ఏమయ్యాయో తెలుసుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. గొర్రెల పెంపకందార్లకి నష్టం జరిగింది. ఆవిధంగా నష్టపోయిన వాళ్లను కూడా ఆదుకోవలసిందిగా తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

కరెంటు విషయం చాలా మంది సభ్యులు చెప్పారు. వైజాగ్.. టౌను కాబట్టి అక్కడ విద్యుత్ సమస్య ఏర్పడితే వెంటనే రెక్టిఫై చేశారు. గౌరవ ముఖ్యమంత్రి గారు అక్కడే ఉండి, మూడు రోజుల్లో విద్యుత్ దీపాలు వెలిగించారని పత్రికలలో చూశాం. గ్రామీణ ప్రాంతాలలో వారం, పది రోజులు కరెంటు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడిన పరిస్థితులను మేము చూశాం. కరెంటు పోల్స్ విరిగి ఇళ్ల మీద పడడం వల్ల ఇళ్లు కూడా ధ్వంసం అయ్యాయి. ఆస్తి నష్టం కూడా జరిగింది. కరెంటు లేక మంచినీటి కొరత ఏర్పడి ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. రోజుల తరబడి గ్రామాలు గాఢాంధకారంలో ఉండిపోయి చాలా నష్టం వాటిల్లింది. విరిగి పోయిన కరెంటు పోల్స్ని రీప్లేస్ చేసి, ఒక దీర్ఘకాలిక ప్రణాళికను రూపొందించి, భవిష్యత్తులో విద్యుత్కి సంబంధించి ఎటువంటి సమస్యలు రాకుండా శాశ్వత పరిష్కార మార్గాల గురించి ఆలోచించాలని కోరుతున్నాను.

మాప్రాంతంలో 57శాతం అదనంగా వర్షపాతం నమోదు అయింది. ఈ భారీ వర్షాల వల్ల ఎక్కడ చూసినా వాగులు, వంకలు పొంగి పొర్లాయి. తెల్లారి చూస్తే ఎక్కడ చూసినా తెల్లగా నీరే కనబడుతోంది. నీరెటు వెళ్లిపోతోందోనని ప్రజలు తీవ్ర ఆందోళన చెందారు. అధిక నీటి ప్రవాహం మూలంగా మైనర్ ఇరిగేషన్ మరియు పంచాయతీ రాజ్ ట్యాంకులకు గండ్లు ఏర్పడ్డాయి. ఆ గండ్ల ప్రభావం వల్ల రైతులు చాలా నష్టపోయారు. పంట పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి కాబట్టి అలాంటి రైతులకు కూడా ఎంతో కొంత నష్టపరిహారం చెల్లించి వారిని కూడా ఆదుకోవాలని ఈసందర్భంగా మనవి చేస్తున్నాను.

మా జిల్లాలో వంశధార, నాగావళి అనే రెండు జీవనదులు ఉన్నాయి. భారీ వర్షాల వల్ల ఈ నదులు పూర్తిగా పొంగడం మూలంగా పెద్ద ఎత్తున నష్టం ఏర్పడింది. రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు 2007లో కరకట్టల నిర్మాణానికి రూ.310కోట్లు మంజూరు చేశారు. వంశధార, నాగావళి నదులకు కరకట్టలు లేకపోవడం వల్ల ప్రతి సంవత్సరం వచ్చే వరదల వల్ల రైతులు దెబ్బతింటున్నారు, తీర ప్రాంతాలలో ఉండే గ్రామాల ప్రజలు కూడా చాలా నష్టపోతున్నారని ఆనాటి ప్రభుత్వం ఆలోచన చేసి, వీటి నిర్మాణానికి రూ.310కోట్లు మంజూరు చేశారు. కానీ కాంట్రాక్టర్లు అక్కడక్కడ మాత్రమే కరకట్టలు ఏర్పాటు చేయడం వల్ల ఆ గ్యాపులు అలాగే ఉండిపోయాయి. దీని మూలంగా మొన్న వచ్చిన వరదల వల్ల ఆ గ్యాపుల్లో నీరు విపరీతంగా వచ్చేసి చాలా పంట నష్టం వాటిల్లింది. పంట నష్టమే గాకుండా ఆ వరద నీటి ధాటికి గ్రామాలు ఎక్కడ కొట్టుకపోతయోనని ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళనకి గురయ్యారు. ఇరిగేషన్ అంశం మీద సమీక్షా సమావేశం జరిగినపుడు, బాధ్యులైన కాంట్రాక్టర్ల మీద చర్యలు తీసుకోమని, లేకపోతే ఆ కాంట్రాక్టులను రద్దు చేయమని జిల్లా మంత్రులను కోరడం జరిగింది. 2007లో మంజూరైన రూ.310కోట్లలో కేవలం రూ.47కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు చూపించారు, మిగతా ఖర్చు ఎందుకు పెట్టలేదని అడగడం జరిగింది. ఈ కరకట్టలను పూర్తి స్థాయిలో నిర్మాణం చేయకపోతే ప్రతి సంవత్సరమూ వచ్చే వరదల వల్ల నష్టం జరుగుతుంది. ఒరిస్సాలో వర్షం పడితే ఈ రెండు జీవనదులు మా జిల్లాలో పొంగే ప్రమాదం ఉంది కాబట్టి ఈ నదులకు సంబంధించిన కరకట్టల గ్యాపులను భర్తీ చేయాలని, ఈ విషయంలో గౌరవ ముఖ్యమంత్రిగారు, ఇరిగేషన్ శాఖా మంత్రి గారు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పూర్తి స్థాయిలో ఈ కరకట్టల నిర్మాణం చేపట్టాలని ఈ సభా ముఖంగా కోరుతున్నాను.

అధ్యక్షా, ఈ తీర ప్రాంతంలో ఉన్న విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఇతర ఐదు జిల్లాలు గానీ,లేదా పది జిల్లాలు గానీ, మొత్తం ఈ కోస్టల్ బెల్ట్‌లో ప్రతి సంవత్సరమూ ఏదో ఒక తుఫాను వస్తోంది. ఒక సంవత్సరం లైలా తుఫాను, ఇంకొక సంవత్సరం జల్ తుఫాను, మరొక సంవత్సరం పైలిన్ ఈవిధంగా ఏదో ఒక తుఫాను కంటిన్యూగా వస్తున్నాయి. పంటలు వచ్చే సమయానికి ఈ తుఫానులు రావడం మూలంగా మా ప్రాంతంలోని మూడు జిల్లాల రైతులు తీవ్రంగా దెబ్బతింటున్నారు. ప్రతి సంవత్సరమూ ఈవిధంగా వచ్చే తుఫానులను మనం ఏవిధంగా తట్టుకోగలం, రైతులను ఏవిధంగా ఆదుకోగలమో ఆలోచించి, దానికి అనుగుణంగా దీర్ఘకాలిక ప్రణాళికను రూపొందించాలి. నీలం, జల్, పైలిన్, లైలా, హుద్‌హుద్ అని ఈవిధంగా పలు రకాల పేర్లతో ప్రతి సంవత్సరమూ తుఫాన్లు వస్తున్నాయి. ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వపరంగా రైతులకు విత్తనాలు, ఎరువుల వంటి వాటికి సంబంధించి ఎంత ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చినా ఈ తుఫానుల వల్ల కష్టానికి దగ్గ ఫలితం రైతుకు దక్కడం లేదు. వ్యవసాయోత్పత్తుల మీద ఆధారపడి చాలా కుల వృత్తుల సంఘాలు బతుకుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో వడ్రంగి, కుమ్మరి, కమ్మరి తదితర కులాల వాళ్లు రైతు మీదే ఆధారపడి బతుకుతున్నారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులను ఆదుకోవలసిన అవసరం ఉందని మనవి చేస్తున్నాను. ఈ మూడు జిల్లాలకు ప్రతి సంవత్సరమూ వచ్చే తుఫానులను ఎదుర్కోవడానికి అవసరమైన చర్యల గురించి ఆలోచించాలి. తుఫాను తాకిడికి చాలా వరకు గుడిసెలు ధ్వంసం అయ్యాయి. గోడలు పడిపోయాయి, ఈవిధంగా గోడలు పడిపోయిన ఇళ్లకు గతంలో రూ.4000వేల చొప్పున ఇచ్చారు, ఇప్పుడు రూ.5000లు ఇచ్చామని అంటున్నారు కానీ అది చాలదు.

మ.01.10

కానీ, అది కూడా చాలదు. గతంలో గృహనిర్మాణశాఖ ద్వారా గృహాలు కట్టుకుంటున్న వాళ్లు అవి పూర్తి కాక, తుఫాను వచ్చేసరికి గుడిసెలు కట్టుకుని నివసిస్తున్నారు. అవి పూర్తిగా ధ్వంసమైపోయాయి. ఒకవైపు ఇళ్లు కట్టుకోవడానికి బిల్లులు రాక, బేస్‌మెంట్‌లు కట్టుకున్న వాళ్లు చాలామంది ఈజిల్లాలో ఉన్నారు. అలాగే స్లాబ్ లెవల్ వరకూ కట్టుకున్న వాళ్లు ఉన్నారు. స్లాబులు వేసి, పేమెంట్స్ లేక చిన్న చిన్న గుడిసెలలో ఉంటున్నారు. అవి పూర్తిగా ధ్వంసమయ్యాయి. అటువంటి వాళ్లు జిల్లాలో ఎవరైతే ఉన్నారో వాళ్లకు తక్షణమే ఏ స్టేజ్‌లో ఉంటే ఆ స్టేజ్‌లో గృహనిర్మాణశాఖ ద్వారా పేమెంట్ ఇవ్వాలని మీద్వారా కోరుతున్నాను. ఈనాడు పంచాయితీ రోడ్లు, రోడ్లు మరియు భవనాల శాఖ నిర్మించిన రోడ్లు ఈ మూడు జిల్లాలలో పూర్తిగా ధ్వంసమైపోయాయి. కాబట్టి వాటికి ప్రాధాన్యత ఇచ్చి ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. పథకం ద్వారా పంచాయితీ రాజ్ రోడ్లుని వెంటనే పర్మినెంట్ రోడ్లను ఏర్పాటు చేయాలని తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఎన్నో తుఫానులు వస్తున్నాయి కాబట్టి ఒక స్పెషల్ ప్యాకేజీని కేటాయించాలని నేను కోరుతున్నాను. ఈనాడు జరిగిన నష్టం చూస్తే ఏదో పంచాము, ఏదో చేశామని కాకుండా దీర్ఘకాలికంగా, శాశ్వతంగా రైతాంగానికి, ప్రజలకు దీర్ఘకాలిక ప్రణాళిక ద్వారా స్పెషల్ ప్యాకేజిని మంజూరుచేసి ఈ మూడు జిల్లాలను ఆదుకోవాలని మీద్వారా కోరుతున్నాము. త్రాగునీటి విషయంలో కూడా బోర్లు వేసినప్పటికీ వేసవికాలంలో పైపులకు నీళ్లు అందక, చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. కొన్ని గ్రామాలలో ఓవర్‌హెడ్ ట్యాంకర్స్‌ని చూస్తున్నాము, అవి బాగానే పని చేస్తున్నాయి. ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించుకుని, మోటార్లద్వారా వాటిని నింపుకుంటే

గ్రామంలోని వారందరికీ నీళ్లు బాగానే సరఫరా అవుతాయి. కాబట్టి గ్రామ పంచాయితీలలో ఓవర్‌హెడ్ ట్యాంకులను పెట్టి హెల్పర్ ద్వారా నీళ్లు నిల్వచేస్తే నీటిని అందించవచ్చని సభద్వారా తెలియజేస్తున్నాను. హుద్ హుద్ తుఫానును ఒక జాతీయ విపత్తుగా పరిగణించి, మన శాసనమండలి ద్వారా ఒకతీర్మానం చేసి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ తీర్మానాన్ని కేంద్రప్రభుత్వానికి పంపించాలని తమరిద్వారా నేను కోరుకుంటున్నాను. ఈ గ్రామాలలోని ప్రజలకు పంటరుణాలు ఇవ్వాలి, గృహనిర్మాణ బిల్లులు ఇవ్వాలి, కొబ్బరిచెట్ల రైతులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం ఇవ్వాలి, వంశధార, నాగావళి, కరకట్ల పూర్తిచేయాలి. మత్స్యకారులకు గతంలో నిర్మించిన తుఫాను షెల్టర్లు పూర్తి శిధిలావస్థలో ఉన్నాయి. తుఫాను వచ్చినప్పుడు పునరావాస కేంద్రాలను పాఠశాల భవనాల్లో పెట్టడం జరుగుతోంది. తుఫాను వచ్చేముందు తీరప్రాంతాల్లో నివసించే ప్రజలను ఆ పునరావాస కేంద్రాలకు రావాలని కోరితే అవి సరిగా లేకపోవడం వల్ల ఎవరూ రావడం లేదు. కాబట్టి, పునరావాస కేంద్రాలను అన్ని హంగులతో తీరప్రాంతాల్లో శాశ్వతంగా నిర్మించాలని మీద్వారా కోరుతున్నాను. నాకు ఈ అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ. ఎం.వి.యస్ శర్మ : అధ్యక్షా, గతంలో ఎన్ని తుఫానులు వచ్చినా, హుద్‌హుద్ తుఫాను మాత్రం కనివిని ఎరుగని రీతిలో అనుభవాన్ని మాకు కలిగించింది. బహుశా విశాఖపట్టణంలో డాల్ఫిన్‌నోస్, కంబాల కొండ, గాలికొండ లేకపోయి ఉంటే పెద్దపెద్ద భవనాలతో సహా మొత్తం కొట్టుకు పోయి ఉండేవి. ఆ తుఫాను తీవ్రతను కొండలు తగ్గించాయి. తుఫాను ముందు నుండి ప్రభుత్వం ప్రజలను హెచ్చరించడం, బలవంతంగానైనా ప్రజలను స్లమ్స్ నుండి కాళీ చేయించి, సురక్షిత ప్రాంతాలకు తరలించడం, ముఖ్యమంత్రిగారు ఇతర మంత్రులు ప్రత్యక్షంగా వారం రోజులపాటు అక్కడే ఉండి ప్రజలకు సహాయ కార్యక్రమాలు పర్యవేక్షించడం జరిగింది. దీనివల్ల ప్రభుత్వం అందరి మన్నల్ని పొందడం జరిగింది. మేమందరం చాలా సంతోషించాము, ఒకపెద్ద విపత్తు వచ్చినప్పుడు ఒక కాన్ఫిడెన్సు బూస్టర్ కింద ఇది పనిచేసింది. ప్రభుత్వం చేసిన ఆ కృషికి నేను వారిని అభినందిస్తున్నాను. అయితే తరువాత కాలంలో ఎన్యూమరేషన్‌తో మొదలు పెట్టి క్రమంగా తుఫాను సహాయచర్యలు ప్రాధాన్యత అలా పల్చపడిపోతూ వచ్చింది. నాకు అనిపించింది ఏమిటంటే, అన్ని సహాయ చర్యలు అందేవరకూ ముఖ్యమంత్రిగారు అక్కడే ఉంటే తప్ప క్రింది స్థాయి అధికారులు పనిచేయరేమో అనిపించింది. ముఖ్యమంత్రిగారు, క్యాబినెట్ మంత్రులు ఉండి వెంటపడినంత కాలం అధికారులు పనులు చేశారు. ఇతర జిల్లాల నుండి ఎన్యుమరేటర్స్ వచ్చి నష్టపరిహారాన్ని ఎన్యుమరేట్ చేశారు. వాళ్లు ఎన్యుమరేట్ చేస్తున్నప్పుడు మేము వాళ్లతో అక్కడే ఉండి మాకు మేము పరిచయం చేసుకోకుండా మామూలు ప్రజలలాగ అక్కడే ఉన్నాము. కొండవాలు ప్రాంతాలలో పైకి ఎక్కలేక పోతున్నారు, ఎన్ని ఇళ్లు నష్టపోయాయో ఎవరో చెప్పింది రాసుకుంటున్నారు, పూర్తి డామేజీ జరిగిందని రాయడానికి వాళ్లల్లో ఒక రిలెక్టెన్స్ ఉంది. పూర్తి డామేజీ జరిగిందనడానికి కొలబద్ధ ఏమిటో వాళ్ల దగ్గర స్పష్టత లేదు. రేకే కదా పడిపోయింది, గోడలు ఉన్నాయి కదా, ఇంటి పైకప్పుకు ఆస్‌బెస్టాస్, టార్పోలిన్ షీట్ కప్పుకున్నారు కదా కాబట్టి ఇది ఫుల్లీడామేజ్ కాదంటారు. ఫుల్లీడామేజ్ కాదు కాబట్టి వాళ్లకు రూ. 5 వేలు మాత్రమే వస్తున్నాయి. రూ. 5 వేలతో ఇంటిని రిపేర్ చేసుకోవడం సాధ్యం కాదు, దాదాపు 80 వేల నుండి లక్ష వరకూ కొండవాలు ప్రాంతాలున్నాయి. ఈనాటికీ అవి రెస్టోర్ కాలేదు. నగరంలో నష్టపరిహారాన్ని అంచనా వేయడానికి బయటనుండి డెప్యూటేషన్ మీద వచ్చినవాళ్లకి ఆ ప్రాంతాల గురించి కూడా తెలియదు. ఏవో కొన్ని కాకుల లెక్కలు రాసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ

విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళితే మీ రిపోర్టులు ఇవ్వండి వాటిని కూడా పరిశీలిస్తామని చెప్పారు కాని, ఇంతవరకూ వారికి ఆ నష్టం భర్తీ కాలేదు. మిగిలిన అంశాలలో, గౌరవసభ్యులు చెప్పని విషయాలు కొన్నింటిని నేను చెబుతాను. తుఫాను వచ్చిన నాలుగురోజులకే మత్స్యకారుల నష్టపరిహారానికి సంబంధించి ఒక జీ.ఓ. ఇచ్చారు. చేపలు పట్టేవారు తమ చేపలు అమ్ముకునే వరకూ ఐస్ బాక్సుల్లో నిల్వ ఉంచుకుంటారు. రెండవరోజో, మూడవరోజో వాటిని అమ్ముకుంటారు. ఈ రెండుమూడు రోజులు కరెంటు లేనందు వలన ఆ చేపలన్నీ కుళ్లిపోయాయి. వాళ్లు ఒక్కొక్కళ్లు రూ. 25 వేలు వరకూ వారు నష్టపోయారు. రూ. 10 వేలు నష్టపరిహారం ఇవ్వాలని సర్క్యులర్ ఇచ్చారు. కానీ విచిత్రంగా సర్క్యులర్ ప్రకారం ఫిషింగ్ హార్బర్‌లో ఉన్న ఫిషర్‌మెన్ కు మాత్రమే వర్తిసుంది. నేను ఆ సర్క్యులర్‌ను మూడు, నాలుగుసార్లు చదివాను. తుని ప్రాంతం నుండి శ్రీకాకుళం చివరివరకూ ఉన్న ప్రాంతంలో మత్స్యకారులు అన్నిచోట్ల దెబ్బతిన్నారు. విద్యుత్ సరఫరా అన్నిచోట్ల పోయింది. కాబట్టి, ఇది మత్స్యకారులందరికీ వర్తించాలి. ఫిషింగ్ హార్బర్ అవతలిప్రక్క ఉంది, కొండ ఇవతలిప్రక్క గంగవరం ఉంది. గంగవరంలోని మత్స్యకారులకు ఈ సర్క్యులర్ ఇప్పటికీ వర్తించదు. మత్స్యకారుల తక్షణ నష్టాన్ని తగ్గించే పని ఇప్పటివరకూ కూడా చేయలేదు. ఇప్పుడు దానిని ఎలా సర్వేచేస్తారనేది కూడా నాకు అర్థం కావడం లేదు. అక్టోబర్‌లో కుళ్లిపోయిన చేపల్ని వాళ్లు ఇప్పటివరకూ దాచుకోలేరు. మంత్రిగారు నష్టం జరిగిందని సాక్ష్యం ఇస్తే నష్టపరిహారం ఇస్తామన్నారు. కుళ్లిపోయిన చేపల్ని కుప్పలాగా పోశారు, మీడియావాళ్లు, పేపర్‌వాళ్లు రెండు మూడు ఫోటోలు తీసి పేపర్‌లో వేశారు. ఎవరింటిది ఏ చేపని ఎలా తెలుస్తుంది? బహుశా ఫిషర్‌మెన్ యెక్క కష్టాలు తెలియని వాళ్లు ఆ సర్క్యులర్ ఇచ్చి ఉంటారు. ఆ సర్క్యులర్ చాలా అన్యాయంగా ఉంది. అలాగే మునిగిపోయిన బోట్లుకు ఇచ్చిన నష్టపరిహారం కూడా ఏమీ చాలదు. ఈ ఫిషర్‌మెన్‌కు సంబంధించిన ప్రాంతాన్ని తమరు కూడా మన ఛైర్మన్‌గారితో కలిసి వచ్చి పర్యటించారు, చాలా ధన్యవాదాలు. విజయనగరం జిల్లా, పూసపాటిరేగ మండలం, తిప్పలవలస గ్రామంలో బోట్లన్నీ కొట్టుకుపోయాయి. తీరప్రాంతంలో ఉన్న ఇళ్లన్నీ ఎగిరిపోయాయి. వాళ్లు తీరప్రాంతం ఒడ్డునే ఉంటారు. గ్రామంలోపల ప్రభుత్వ బంజరు భూమి ఉంది, అక్కడ ఇళ్లు కట్టుకోవడానికి స్థలం కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. దానికి సంబంధించి అధికారులు సానుకూలంగా పరిశీలించాలని నేను తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. విజయనగరం జిల్లాలో సముద్రతీరం ఉన్న ప్రాంతం, అక్కడ చేపలు దొరికే అవకాశం ఉంది కాబట్టి తిప్పలవలస దగ్గర ఒక ఫిషింగ్‌హార్బర్‌ను నిర్మించవలసిందిగా నేను తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

మ.1.20

అధ్యక్షా, ఇక మూడవ విషయం స్కూల్స్, హాస్టల్స్‌కి సంబంధించింది. తుఫాన్ ప్రభావిత తొమ్మిది మండలాలలో గల పాఠశాలలను మేము సర్వే చేశాము. ఆ నివేదికలు మా దగ్గర ఉన్నాయి. చాలా పాఠశాలల్లో తరగతి గదులు, ప్రహరీ గోడలు, పై కప్పులు పడిపోయాయి. మరుగుదొడ్లు చాలా దెబ్బతిన్నాయి. వాటికి సంబంధించి ఇంతవరకూ మరమ్మత్తులు ప్రారంభం కాలేదు. ఇప్పుడు పరీక్షల సమయం కూడా. ఈ చలికాలంలో హాస్టల్స్‌లో కిటికీల తలుపులు విరిగిపోయి, పై రేకులు లేక విద్యుత్తు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. దానికి సంబంధించి

ఎటువంటి పనులు ఇంతవరకూ జరగలేదు. విశాఖపట్టణం దగ్గర అనకాపల్లిలో ఏఐఎం కాలేజీ చాలా పెద్దది. అది ఎయిడెడ్ కళాశాలగా ఉన్నది. అది పేరుకి మాత్రమే ప్రైవేటు వ్యక్తులది కానీ, ప్రభుత్వమే అన్ని కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. అక్కడ నాకు చాలా బాధ కలిగించిన విషయం ఏమిటంటే గత సంవత్సరమే యుజిసి నిధులతో ఒక క్రీడా ఆడిటోరియంను నెలకొల్పారు. లోపల అంతా చెక్క ఫ్లోరింగ్ వేసి, కొంత మోడ్రన్‌గా ఆ ఆడిటోరియం కట్టారు. ఆ ఆడిటోరియంకు పైన ప్లాస్టిక్ కప్పు వేశారు. కాంక్రీట్ గోడలకి, ప్లాస్టిక్ కప్పుకి మధ్య ఒక అడుగు ఖాళీ జాగా వదిలి పెట్టారు. ఆ ఖాళీలోంచి తుఫాను గాలి ప్రవేశించి మొత్తం కోటి రూపాయల విలువ గల ఆడిటోరియం నేలమట్టమైపోయింది. ఇంకా సంవత్సరం కూడా పూర్తికాలేదు. దానిని నమోదు చేసుకున్న దాఖలాలు కూడా లేవు. ఆ కళాశాలలో ఉన్న ప్రయోగశాలలు, తరగతి గదులు, పాత భవనాలు అన్నీ దెబ్బతిన్నాయి. ఆ కళాశాలకి సుమారు నాలుగు కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. ఆ కళాశాల వారు పూర్వ విద్యార్థులను సంప్రదించి వాళ్ళ తిప్పలు వారు పడుతున్నారు కానీ, అది ఏ మూలకు సరిపోదు. ఆ ఎయిడెడ్ కళాశాలలది ప్రత్యేక పరిస్థితిగా ఉన్నది. దానిని ప్రభుత్వం ప్రత్యేకంగా పరిశీలించి ఆదుకోవాలని, ఈ విషయమై కేంద్రానికి కూడా వ్రాసి, ప్రత్యేక గ్రాంట్లు మంజూరు అయ్యేలా ప్రయత్నం చేయాలని, తమ ద్వారా కోరుతున్నాను. ఎందుకంటే నాన్ ప్రాఫిట్ మేకింగ్ ఇన్‌స్టిట్యూషన్ కాబట్టి, దానికి తిరిగి యుజిసి గ్రాంట్లు మంజూరు అయ్యేలా మరియు దెబ్బతిన్న భవనాలకు తిరిగి మరమ్మత్తులు చేయించాలని, పునర్నిర్మించేలా తగిన ప్రయత్నం చేయాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అది ప్రైవేటు ఇన్‌స్టిట్యూషన్, మాకు బాధ్యత లేదని అనుకోకుండా, ప్రత్యేక బాధ్యత వహించి చేయాలని తమ ద్వారా కోరుతున్నాను. ఆ కళాశాల కొన్ని వేల మంది గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చాలా బలమైన ఆధారం. మరొకటి అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కళాశాల ఆచార్య ఎన్.జి. రంగా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉంది. ఈ కేంద్రానికి మనం డబ్బు రూపేణా లెక్క కట్టలేము. వారు పంటలన్నింటినీ ప్రయోగాత్మకంగా నిర్వహిస్తూ ఉంటారు. అన్నీ నాశనమయ్యాయి. ఈ సంవత్సరం ప్రయోగాలన్నీ నాశనమయినట్లే. దాని రీడింగ్స్ ఎలా తీస్తారు? వాటిని భవిష్యత్తులో ఎలా వాడుకుంటారు. అవన్నీ నష్టంతోనే కూడుకుని ఉన్నాయి. ప్రస్తుతం అవి ఎందుకూ పనికిరాని దశలో ఉన్నాయి. అలాగే, వారి ప్రయోగశాలలన్నీ దెబ్బతిన్నాయి. ఆ కళాశాల తాలూకు నష్టం ఏ మేరకు వాటిల్లిందో తెలిపే నివేదికలను తమకు పంపిస్తున్నాను. దయచేసి, వాటిని ప్రభుత్వం ఒకసారి పరిశీలించాలని తమ ద్వారా కోరుతున్నాను. సుమారు రెండు కోట్ల రూపాయల మేర వారికి నష్టం జరిగింది. మంత్రిగారు పై కళాశాలను కూడా దృష్టిలోపెట్టుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

మరొక అంశం ఏమిటంటే, ఏజన్సీ ప్రాంతాలలో కాఫీ తోటలకి నీడ కావాలి. అందుకోసం వారు సిల్వర్ ఓక్ చెట్లను పెంచారు. ఆ చెట్లు చాలావరకూ పడిపోయాయి, అందువలన కాఫీ పంట దెబ్బతింటోంది. ఆ చెట్లు పెద్ద ఎత్తున పెరగాలంటే, సుమారు 10 సంవత్సరముల సమయం పడుతుంది. ఇప్పుడు ఉన్న చెట్లన్నీ 1987, 1988 ప్రాంతాలలో వేసిన చెట్లు అవి. మళ్ళా చెట్లు బాగా పెరిగి నీడ వస్తే తప్ప, కాఫీ తోటల పెంపకం జరగదు, తద్వారా కాఫీ పంట చేతికి రాదు. ఆ పంటల మీద ఆధారపడ్డ రైతులు, పనిచేసే కూలీలు, ఏపిఎఫ్‌డిసి కూలీలు దాదాపు 12,000 మంది ఉంటారు. ఇప్పుడు వీరందరికీ ఉపాధి లేదు. ఎటువంటి ఆధారం లేదు. కాబట్టి, వారికి సంబంధించి ప్రభుత్వం ప్రత్యేకమైన నిర్ణయాలు చేసి వారిని ఆదుకోవాలి. ప్రత్యేకమైన నిర్ణయాల ద్వారా ప్రభుత్వం పైన పేర్కొన్న వారందరినీ ఆదుకుంటే తప్ప పరిష్కారం అయ్యే అంశాలు కావు.

విశాఖ జిల్లాలో సుమారు లక్ష మందికి పైన భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. వీరందరికీ సుమారు అక్టోబరు నెల నుంచి ఇప్పటివరకూ పనులు లేవు. ఎందుకు లేవంటే – నష్టపోయిన వారికి నష్టపరిహారం, ఇళ్ళు కట్టుకోవడానికి ఇసుక సమస్య మొదలైనవన్నీ వచ్చాయి. అందువలన ఇప్పుడు భవన నిర్మాణ కార్మికులు ఆకలితో నకనకలాడే పరిస్థితి వచ్చింది. ప్రత్యేకంగా ఫలానా యజమాని అని అతను నిందించలేని పరిస్థితిలో ఉన్నాడు. కానీ, భవన నిర్మాణ కార్మికుల ప్రత్యేక నిధి ప్రభుత్వం దగ్గర సుమారు రూ.1,000కోట్లు పైగా ఉంది. దానికి సంబంధించి తెలంగాణా, ఆంధ్ర ప్రభుత్వాల మధ్య పంపకాలలో తేడాలు కూడా వచ్చి తగవులు వచ్చాయి. నిధి ఉంది కానీ, ఆ భవన కార్మికులను తుఫాను బాధితులుగా గుర్తించి, ముఖ్యంగా విశాఖ జిల్లాలో ఉన్న 9 మండలాలలో ఉన్నవారిని తుఫాను బాధితులుగా ప్రత్యేకంగా గుర్తించే నిర్ణయం ప్రభుత్వం ఇంతవరకూ చేయలేదు. ఆ నిర్ణయం చేసి, వారికి ఆ సంక్షేమ నిధి నుంచే వారి కుటుంబాల పోషణకు డబ్బులు కేటాయించినట్లయితే, వారు ఊపిరి పీల్చుకోవడానికి వీలవుతుంది. లేకపోయినట్లయితే, వాళ్ళు గ్రామాలలో బ్రతకలేక పట్టణాలకు వస్తే, ప్రస్తుతం పట్టణాలలో కూడా పని లేక బ్రతకలేని పరిస్థితులలో చాలా దుర్భరమైన వార్తలు మనం వినవలసి వస్తుందేమోనని మేము భయపడుతున్నాం.

ఇక్కడ కొండవాగులో ఇళ్ళకు సంబంధించి ప్రభుత్వం ఒక రకంగా మనం అదృష్టవంతులం. ఎందుకంటే, తుఫాన్ వచ్చి, దానితో రావలసిన వర్షం ఆగిపోయింది. ఆ వర్షమే భారీగా మరో నాలుగైదు గంటలు పడి ఉంటే, ఈ 80,000 ఇళ్ళల్లో కనీసం 40,000 ఇళ్ళు క్రిందకి జారిపోయి, క్రింద ఉన్న ఇళ్ళ మీద పడి, క్రింద వాళ్ళు, పైన ఇళ్ళ వారు అందరూ చనిపోయి అపారమైన ప్రాణ, ఆస్థి నష్టం జరిగి ఉండేది. ఆ తుఫాను వచ్చిన తరువాత గాలి, ఆగిపోయి, వర్షం రాలేదు కాబట్టి, ఆ ఇళ్ళు అలా ఉండిపోయాయి. భవిష్యత్తులోనైనా భారీ వర్షాలు వస్తే భారీ నష్టం జరుగుతుంది కాబట్టి, అవి క్రింద పడిపోకుండా సిమెంటు వేసి, కాంక్రీటు సపోర్టు పెట్టి ఏవైనా చెయ్యాలి. లేకపోతే, వారికి వేరే ప్రాంతాలలో హౌసింగ్ కాలనీలు కట్టి, అక్కడకైనా వారిని తరలించాలి. ఇది ఒక ప్రత్యేకమైన ప్రాజెక్టుగా చేపట్టి ప్రభుత్వం చేయాలని తమ ద్వారా కోరుతున్నాను.

అంతేగాకుండా, కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో చాలా అన్యాయంగా వ్యవహరిస్తోంది. వారి పరిధిలో ఉన్న ప్రాంతాలకు సంబంధించి ఎటువంటి రిలీఫ్ లేదు. రైల్వే స్టేషన్ ఉంది కానీ, సిగ్గు చేటు, ఈరోజుకీ రైల్వే స్టేషనులో ఎగిరిపోయినటువంటి పై కప్పులను తిరిగి వేసే పరిస్థితి లేదు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి రిపేరు వర్కు లేదు. విమానాశ్రయంలో కూడా ఎటువంటి మరమ్మత్తులు చేయలేదు. ప్రధానమంత్రిగారు వచ్చి ఎప్పుడో ప్రకటన చేసి వెళ్ళిపోయారు, ఆ డబ్బులు కొంత వచ్చాయి, కొంత రాలేదు. రాష్ట్రప్రభుత్వం ఇంత పెద్ద తాకిడిని, ఇంత పెద్ద సవాలుని ఎదుర్కొంటున్నప్పుడు కేంద్రం చాలా నామమాత్రంగా వ్యవహరించిందని నాకు కనిపిస్తోంది. ప్రజలు కూడా అదే అభిప్రాయంతో ఉన్నారు. కాబట్టి, కేంద్రం వెనువెంటనే స్పందించి కేంద్ర సంస్థలైన స్టీల్ ప్లాంటు, పోర్టు, షిప్‌యార్డు మొదలైన వాటికి జరిగిన నష్టానికి సంబంధించిన పరిహారం ఇవ్వడం, మిగిలినవాటిని మరమ్మత్తులు చేయడం మొదలైన వాటికి సంబంధించి కేంద్రప్రభుత్వం కదిలే విధంగా మన రాష్ట్రం వారికి విజ్ఞప్తులు పంపాలని కోరుతూ, నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

శ్రీ అంగర రామమోహన్‌: అధ్యక్షా, హుద్‌హుద్‌ తుఫాను వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని అందరూ భావిస్తున్నారు. హుద్‌హుద్‌ తుఫాను వల్ల అతలాకుతలమైపోయిన విశాఖ పట్టణాన్ని మునుపెన్నడూ ఇలా చూడలేదని శ్రీ ఎం.వి.యస్‌ శర్మ గారు అన్నారు. ఈ తుఫాను వచ్చి వెళ్లిన వెంటనే ముఖ్యమంత్రిగారు 24 గంటలలో అక్కడకు వెళ్లి, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని అక్కడ 8 రోజుల పాటు ఉంచి సహాయ కార్యక్రమాలు చేపట్టడం చాలా గొప్పవిషయం. ఈ విపత్కర పరిణామాలను ఎవరూ ఆపలేరు. కానీ ముందు జాగ్రత్త చర్యల వల్ల తక్కువ నష్టం జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఋజువు చేశారు. మన ముఖ్యమంత్రిగారు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించడం వల్ల మరణాల సంఖ్య తగ్గిందని ప్రధాని గారు మాట్లాడారు. గతంలో సాంకేతిక పరిజ్ఞానం మరియు ముందు జాగ్రత్త చర్యలు లేకపోవడం వల్ల దివిసీమలో చాలా మంది చనిపోవడం జరిగింది. ముఖ్యమంత్రిగారు, రాష్ట్రప్రభుత్వ యంత్రాంగము ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని, ప్రధానమంత్రిగారిని కూడా రప్పించి ప్రజలకు అండగా ఉండే అనేక కార్యక్రమాలు చేయడం జరిగింది. గౌరవసభ్యులు బాల సుబ్రహ్మణ్యం గారు, శర్మ గారు మన ప్రజల యొక్క మనోభావాలు గురించి చక్కగా చెప్పడం జరిగింది. ఏదిఏమైనప్పటికి ఈనాడు పెద్దఎత్తున ప్రజలందరినీ ఆదుకోవడం జరిగింది. తుఫాను వల్ల నష్టం జరిగిన కుటుంబాలకు, మృతుల కుటుంబాలకు నష్టపరిహారం కింద గతంలో లక్షా యాభైవేలు ఉంటే 5 లక్షలు చేయడం జరిగింది. గత ప్రభుత్వాలకంటే నష్టపరిహారం ఈ ప్రభుత్వం ఎక్కువగా పెంచడం జరిగింది.

మ. 01.30

కానీ, కేంద్ర ప్రభుత్వం కూడా ఇంకా బాగా స్పందించాలని వారు కోరడం జరిగింది. ఎల్‌ఓపీ గారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధుల మీద నమ్మకం లేదని చెప్పడం జరిగింది. వాస్తవానికి వారికున్న నమ్మకాన్ని మేం కూడా కాదనలేము. ఎందుకంటే, గత పది సంవత్సరాల విపత్కర పరిణామాల్లో సుమారు రూ.40,000 కోట్ల మేర నష్టం వాటిల్లిందని, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అంచనాలు వేసి కేంద్రానికి పంపింది. అయితే, అప్పటి కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.7,000 కోట్లు మాత్రమే విడుదల చేయడం జరిగింది. ఇటువంటి అంచనాలు గతంలో ఉండబట్టే ఈనాడు ప్రతిపక్షాలకు అలాంటి అనుమానాలు ఉన్నాయి. కానీ, ఇప్పుడున్నటువంటి మన ప్రభుత్వం నష్ట వ్యయాన్ని రూ.21,000 కోట్లుగా అంచనా వేసి కేంద్రానికి పంపిస్తే, వారు రూ.400 కోట్లు విడుదల చేయడం జరిగిందని మన హోం శాఖామంత్రి గారు రిప్లైలో చెప్పారు. అందుచేత, ఈ రాష్ట్ర ప్రభుత్వం గానీ, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు గానీ తీవ్రమైన కృషి చేసి, కేంద్రం మీద ఒత్తిడి తెచ్చి పెద్ద ఎత్తున నిధులు సేకరించడానికి కృషి చేయవలసిన అవసరముంది.

ఇంకా ఎక్కడెక్కడైతే పునరావాస కార్యక్రమాల్లో లోటుపాట్లు తలెత్తాయో అవన్నీ నివారించడానికి కృషి చేయాలని కోరుతున్నాను. ఆ విధంగా ఈ విపత్కర పరిణామాలను ఎదుర్కొనేందుకు గాను టెక్నాలజీని ఉపయోగించుకుని, వెంటనే రిలీఫ్‌ కేంద్రాలకు ప్రజలను తరలించి వారికి అండగా నిలిచినందుకు ముఖ్యమంత్రి గారిని అభినందిస్తూ, ఒక తీర్మానం చేయాలని ఈ సభ ద్వారా సభ్యులందర్నీ కోరుతున్నాను. ఆ విధంగా నాకు అవకాశం కల్పించినందుకు మీకు నా హృదయపూర్వక నమస్కారాలు తెలియజేసుకుంటున్నాను.

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్‌: రుద్రరాజు పద్మరాజు గారూ.. దయచేసి రెండు నిమిషాలు మాత్రమే మాట్లాడండి.

SRI. RUDRARAJU PADMARAJU: Sir, Please allow me for 5 minutes. I will not go beyond that. అధ్యక్షా, అక్టోబర్ 12 వ తేదీన ఉత్తరాంధ్రలో వచ్చిన హుద్ హుద్ తుఫాను మీద మాట్లాడటానికి నాకు అవకాశం కల్పించినందుకు మీకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అక్టోబర్, 12 వ తేదీన ఉత్తర కోస్తా, తూర్పు గోదావరి జిల్లాల ప్రజల్ని ఈ తుఫాను వణికించింది, భయభ్రాంతులకు గురి చేసింది. అదొక కాళరాత్రి. హుద్ హుద్ అనేది ఇజ్రాయెల్‌కు సంబంధించిన జాతీయ పక్షి. ఆ విషయం మీకందరికీ తెలుసు. ఈ విధమైన తుఫాన్లు వచ్చినప్పుడు, ఏ విధమైన పేర్లు పెడతారు, ఏ, ఏ దేశాలు వీటి పరిధిలోకి వస్తాయనేది నేను ప్రత్యేకంగా చెప్పదలుచుకోలేదు. హుద్ హుద్ తుఫాను రోజున, మధ్యాహ్నం 12.00 గంటల నుండి 1.00 గంట మధ్య తుఫాను తీరాన్ని దాటినప్పుడు ఆ ప్రభావం ఉండదేమోనని భావించి, అందరూ కళ్లు మూసుకునే తరుణంలో, అదే రోజు రాత్రి తుఫాను తీవ్రతను చూపించడం ద్వారా ఆ ప్రాంత ప్రజల్ని వణికించింది.

ఇదివరకు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ కూడా విశాఖ నగరం కానీ, దాని పరిసరాలు కానీ ఇంతటి దయనీయమనైన, దురదృష్టకరమైన పరిస్థితిని చవి చూడలేదని చెప్పడానికి ఈ హుద్ హుద్ తుఫానుని ఒక ప్రత్యక్ష ఉదాహరణగా నేను తెలియజేస్తున్నాను. గత 123 సంవత్సరాలలో 77 సార్లు ఈ తుఫాను తాకిడికి ఈ ప్రాంతాలన్నీ కూడా తల్లడిల్లిన సందర్భాలు చూశాము. గడచిన రెండు, మూడు సంవత్సరాల్లో చూసినట్లయితే, వరుసగా వచ్చిన తుఫాన్లు, హైలీన్, పైలీన్, నీలం గానీ, తదుపరి అనేక రకాల తుఫాన్లు రావడం వల్ల కోస్తా తీరమంతా ఎంత అతలాకుతలమైంది, ఎంత నష్టాన్ని చవి చూసిందనేది మీకు నేను ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఎందుకంటే, ఆంధ్రప్రదేశ్ భౌగోళిక స్వరూపం ప్రత్యేకమైనది. అటు ఉత్తర, దక్షిణ కోస్తా ప్రాంతాలన్నీ ప్రతి సంవత్సరం అంటే, సంవత్సరం విడిచి సంవత్సరం 123 సంవత్సరాల్లో సుమారు 77 సార్లు తుఫాన్లు చవిచూసిన ఘనత, 974 కి.మీ. తీర ప్రాంతమున్న మన రాష్ట్రానిది. మరి అది దురదృష్టమా, లేక అదృష్టమా అనేది ఒక్కసారి ఆలోచన చేయండి.

అదేవిధంగా, రాయలసీమ ప్రాంతం విషయానికి వస్తే, అదెప్పుడూ కరువు కాటకాలతో తల్లడిల్లిపోతుంటుంది. ఇంతకుముందు చర్చల్లో మనం విన్నాము. ప్రాజెక్టుల్లో నీళ్లు లేక ప్రజలంతా అల్లాడిపోతున్న పరిస్థితి. రాష్ట్రంలో ఒకపక్క చూస్తే తుఫాను, వరదలు. మరోపక్క చూస్తే, త్రాగడానికి గుక్కెడు నీరు లేక గొంతెండిపోయే దయనీయమైన పరిస్థితి, దుస్థితి ఉంది. ఈ పరిస్థితుల్ని చూస్తే, ఆంధ్రప్రదేశ్‌కు ఎప్పుడూ కూడా ఏదో ఒకరకమైన కష్టాలు వస్తున్నాయి.

ఈ సందర్భంగా రాష్ట్ర విభజన గురించి నేను ప్రత్యేకంగా ప్రస్తావించనవసరం లేదు. ఈ రాష్ట్ర విభజన వల్ల ఈనాటికీ రాజధాని నిర్మాణం ఏవిధంగా చేసుకోవాలి, రెవిన్యూ డెఫిసిట్‌ని ఎలా అధిగమించాలి, తద్వారా నూతన రాష్ట్రాన్ని ప్రగతి పథం వైపు ముందుకు తీసుకువెళ్లడానికి ఈ రాష్ట్ర ప్రభుత్వంతో బాటు, మన మందరం కూడా ఎంతో కృషి చేస్తున్నాము.

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్‌: పద్మరాజు గారూ, దయచేసి, మీరు మాట్లాడుతున్న అంశానికే పరిమితం అవ్వండి. చరిత్ర, ఇతరత్రా అంశాల మీద మీరు మాట్లాడటం కరెక్టు కాదు. రెండు నిమిషాల సమయమిచ్చాము. ఆ రెండు నిమిషాలు మీరు స్పెసిఫిక్‌గా మాట్లాడండి.

SRI RUDRARAJU PADMARAJU: Sir, it is just a passing remark. Kindly, if you don't interrupt me, I will complete my speech as early as possible.

MR. DEPUTY CHAIRMAN: Please listen to me. You have asked two minutes time. I have already permitted you to speak in the given time. ఆ సమయంలో కూడా మీరు హిస్టరీలోకి వెళ్లి మాట్లాడుతున్నారు. ఇతర అంశాల మీద మాట్లాడటానికి అరగంట సేపు తీసుకోకుండా, స్పెసిఫిక్‌గా మాట్లాడండి.

SRI RUDRARAJU PADMARAJU: Sir, definitely I will speak very precisely and very compactly. Kindly bear with me. I have already mentioned my name. Kindly permit me to speak for few minutes. I will complete it. అధ్యక్షా, ఈ రోజు ఉత్తర కోస్తాకు సంబంధించి ఎంత మేరకు నష్టం వాటిల్లిందనేది ఎస్టిమేషన్స్ వేసి చూసినట్లయితే, రాష్ట్ర ప్రభుత్వం రూ.21,000 కోట్లు నష్టం జరిగిందని చెప్పింది. ఓకె. రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ఇలాంటి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ చేయాల్సి వచ్చినప్పుడు అనేక సందర్భాల్లో అటు రాజమండ్రిలో ఆనాడు వరదలు వచ్చినప్పుడు గానీ, ఒరిస్సాలో వరదలు వచ్చిన సమయంలో గానీ వారు తీసుకున్న చర్యలు ఖచ్చితంగా అభినందనీయమే. దాన్ని ఎవ్వరం కాదనలేము. కానీ, ఇక్కడ వచ్చిన పరిస్థితుల్లో కేంద్రం నుండి దేశ ప్రధాని 14 వ తేదీనే విశాఖపట్నం వచ్చి, రూ.1000 కోట్లు తక్షణ సాయంగా రిలీఫ్ అండ్ రీహాబిలిటేషన్ క్రింద ఇస్తామని ప్రామిస్ చేసి చెప్పినా కూడా, నేటికీ ఆ సాయం పొందలేకపోవడమంటే ఎంత దయనీయమైన పరిస్థితో అర్థం చేసుకోండి. కాబట్టి, ఖచ్చితంగా కేంద్రం మెడలు వంచి ఆ సాయాన్ని పొందాలని చెబుతున్నాను.

ఎందుచేతనంటే, రూ.1000 కోట్లు రాష్ట్రానికి ఇస్తానన్నప్పుడు, పత్రికా ప్రకటనల్లో నేను కూడా ఆ రోజున కేంద్రాన్ని అభ్యర్థించడం జరిగింది. తక్షణ సాయంగా రూ.2000 కోట్లు ఇవ్వకపోతే, ఈ ప్రాంతంలో ఉన్న ప్రజానీకానికి కనీసం తినడానికి తిండి కూడా లేనటువంటి పరిస్థితి ఉంటుంది కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితిని కూడా ఆ రోజున నేను పత్రికల ద్వారా చెప్పడం జరిగింది. అంటే ఈ రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితుల దృష్ట్యా నేను కూడా పత్రికల ద్వారా చెప్పానని మనవి చేస్తున్నాను. కానీ, నేటి వరకు మనకు అందిన సాయం చూస్తే, రూ.400 కోట్లు మాత్రమే. రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుపెట్టింది రూ.848 కోట్లు. అంత మంచి పని చేసింది. నేను కాదనడం లేదు. కానీ, దీన్ని కూడా ఒక జాతీయ విపత్తుగా చూడలవసిన పరిస్థితులు ఉన్నాయి. మేమందరం కూడా దీన్ని ఒక జాతీయ విపత్తుగా ప్రకటించండని, ఈ రాష్ట్రానికి నష్టం జరిగింది కాబట్టి కేంద్రం నుండి సహాయం అందించండని అడిగే క్రమంలో ప్రతిపక్షాలుగా మేం కూడా మీకందరికీ వత్తాసు పలికామే! అయినా, కేంద్రం ఎందుచేత రాష్ట్రంపై శీతకన్ను వేస్తోంది? ఈ రాష్ట్రం నుండి వచ్చే పన్నుల్ని మీరు తీసుకోవడం లేదా? రాష్ట్రంలో పన్నుల రూపేణా వసూలు చేసే వేలాది కోట్ల రూపాయల్లో, 32 శాతం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికిస్తోంది. మిగతా 68 శాతం వాళ్ల దగ్గరే పెట్టుకుంటోంది. కనీసం, ఇటువంటి పరిస్థితుల్లోనైనా, ప్రకృతివైపరీత్యాలు వచ్చినప్పుడన్నా కనీస జ్ఞానం లేకుండా, ఆలోచన లేకుండా, ధ్యాస లేకుండా ఉంటే ఎంత వరకు సబబు అని అడుగుతున్నాను. ఖచ్చితంగా దీన్ని ఒక జాతీయ విపత్తుగా గుర్తించేందుకు, మన సభ నుండి ఒక తీర్మానం చేసి, కేంద్రానికి పంపించవలసిన ఆవశ్యకత ఉందని అందరికీ మనవి చేస్తున్నాను.

ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో, సుమారుగా 6 లక్షల ఎకరాల్లో అంటే 2 లక్షల 48 వేల హెక్టార్లలో వ్యవసాయమంతా పూర్తిగా సర్వ నాశనమైపోయింది. సుమారుగా 6 లక్షల ఎకరాలకు ఇబ్బంది కలిగింది. అదేవిధంగా ఉద్యానవన పంటలు చూసినట్లయితే, మరింత నష్టపోవడం జరిగింది. దానికి సంబంధించి సుమారుగా రూ.1338 కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. మరీ ముఖ్యంగా చూసినట్లయితే, కొబ్బరి, మామిడి, జీడి మామిడి, బొప్పాయి మొదలైన ఉద్యానవన పంటలన్నింటికీ నష్టం ఎక్కువగా వాటిల్లిందని మనవి చేస్తున్నాను. ఆ మూడు జిల్లాలతోబాటు, తూర్పు గోదావరి జిల్లాలో 8 మండలాల్లో పాక్షికంగా నష్టం జరిగింది. అక్కడ రూ.930 కోట్ల మేర నష్టం జరిగింది.

ఎం.1.40

ఇన్ని వేల కోట్ల రూపాయలు నష్టం జరిగినప్పుడు కేంద్రం సహాయం చేయవలసిన ఆవశ్యకత ఉన్నప్పటికి కూడా ఎక్కడా ఉలుకు,పలుకు లేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి గారు అనేక పర్యాయాలు ఢిల్లీకి వెళ్లి కేంద్రం మీద ఒత్తిడి తీసుకువచ్చారు. అయినప్పటికి ఎటువంటి ఫలితం లేదు. ఈ విషయంలో కచ్చితంగా మా యొక్క సహకారం అందిస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈ తుఫాను వల్ల ఎక్కువగాతీరప్రాంతం నష్టపోయింది కాబట్టి అక్కడ ఉండే ఫిషర్‌మెన్ కమ్యునిటీ ఎక్కువగా నష్టపోయింది. రైతాంగం ఒక పక్క నష్టపోతే, తీరప్రాంతానికి అనుకొని నివసిస్తున్న ఫిషర్‌మెన్ కమ్యునిటీ నష్టపోయింది. ఇటువంటి కష్టాలు వచ్చినప్పుడు ఎటువంటి చర్యలు తీసుకోవాలో రాష్ట్ర ప్రభుత్వం కచ్చితంగా దాని మీద ఆలోచన చేయాలి. ఇటువంటి తుఫానులు రాకుండా ఇదివరలో తీరప్రాంతమంతా కూడా సరుగుడు చెట్లు, కాస్యురైనా ప్లాంటేషన్ ఉండేది. అదే విధంగా తూర్పు గోదావరి జిల్లా తాళ్లరేవుకు సంబంధించిన ప్రాంతాన్ని చూచినట్లయితే.. అక్కడ మడ అడవులు ఉన్నాయి. మడ అడవులను, కాస్యురైనొ ప్లాంటేషన్‌ను తీరప్రాంతంలో పెంచాలి. తద్వారా ఇటువంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు వాటికి అడ్డుకట్ట వేయడానికి, ఆ ప్రాంతంలో ఉన్నటువంటి ప్రజానీకానికి రక్షణ కల్పించడానికి, నష్టం తీవ్రతను తగ్గించడానికి ఇది తోడ్పడుతుందని కచ్చితంగా చెప్పగలను.

ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వాగ్దానంగా రుణమాఫీ చేస్తామని చెప్పినందుకు చాలా సంతోషం. దానికి ప్రయత్నం కూడా చేస్తున్నారు. కాని, ఆ మూడు జిల్లాలలో ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ఎంతో ఆత్రంగా ఎదురు చూస్తున్న ఆ రైతాంగం కనీసం ఇన్సూరెన్స్ కూడా కట్టలేదు. వాళ్లు ఇన్సురెన్స్ కట్టలేదు కాబట్టి వాళ్లకు నష్టపరిహారం కూడా రాని పరిస్థితి ఉంది కనుక రాష్ట్ర ప్రభుత్వం వారికి ఇన్సూరెన్స్ ఇవ్వవలసిన ఆవశ్యకత ఉందని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. ఈ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని వాళ్లు వేచి ఉన్నారు. ప్రభుత్వం రుణమాఫీ చేయలేదు. ఇన్సూరెన్స్ లేదు. ఎక్కడైతే ఈ 6 లక్షల ఎకరాలకు నష్టం వాటిల్లిందో ఆ 6 లక్షల ఎకరాలకు ఇన్సూరెన్స్ ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని గుర్తు చేస్తున్నాను. ఇటు మడ అడవులను కాని, కాస్యురైనొ ప్లాంటేషన్‌ను కాని పెంచి తుఫానుల ప్రభావాన్ని తగ్గించడానికి చర్యలు చేపట్టాలి. అదే విధంగా పకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు వారికి ప్రభుత్వం ఇతోధికమైన సహాయం అందించాలి.

నేను ఇప్పుడే చెప్పాను. రూ.311కోట్లు పౌర సరఫరా సంస్థ ద్వారా ఖర్చు పెట్టి విశాఖ పట్టణం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో తుఫాను దెబ్బతిన్న ప్రాంతాలలో నివసిస్తున్న వారందరికి కూడా బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను సరఫరా చేయడం జరిగింది. అక్కడే కొన్ని అవకతవకలు కూడా జరిగినట్లు మాకు సమాచారం ఉంది. దీని గురించి వెరిఫై చేయండి. కావాలంటే విచారణ జరిపించండి. అక్కడ ఉన్నటువంటి స్థానిక ప్రజాప్రతినిధులు వారి లెటర్ హెడ్స్ మీదనే అక్కడున్నటువంటి చౌకధరల దుకాణాలన్నింటికి ఉత్తరాలు వ్రాసారు. నేను వారు వ్రాసిన దానికి తప్పు పట్టడం లేదు. కాని, ఆ చౌక ధరల దుకాణాల వారు దానిని దుర్వినియోగం చేశారని మాత్రం నేను చెప్పదలచుకున్నారు. దయచేసి దాని మీద విచారణ జరిగించవలసిన బాధ్యత ఈ రాష్ట్ర ప్రభుత్వం మీద ఉందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఇక ముఖ్యంగా చూచినట్లయితే, ప్రతి సంవత్సరం ప్రకృతి వైపరీత్యాలు ఆనవాయితీగా వస్తున్న ఈ పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వం దీనిని ఒక అనుభవంగా తీసుకొని రాబోయే రోజులలో ఎటువంటి రెమిడియల్ మెజర్స్ తీసుకోవాలో వాటి గురించి అందరిని సంప్రదించి, అందరికి మంచిగా జరిగే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను. ధన్యవాదాలు.

శ్రీ బి. చంగల్ రాయుడు : రాజకుమారి గారిని ఉద్దేశించి... తాంబూలం ఇచ్చి, బొట్టు పెట్టి నా పేరు రాసుకెళ్లారు. నాకు అవకాశం ఇవ్వడం లేదు. మీ తాంబూలం వెనకకు తీసుకోండి.

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ : సభ్యులు దయచేసి ఒకటి గమనించాలి. సమయం అడిగిన ప్రతి ఒక్క సభ్యునికి మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడం కుదరదు. పార్టీకి ఇంత టైం అని అలాట్ చేసి ఉంటారు. ఆ టైం లోపునే సభ్యులు మాట్లాడాలి. Every speaker can't speak to his length. Please remember that we can't allow everybody, there is a time limit. I am not allowing anybody, సెషన్ ఎంతవరకు జరగాలనేది ముందుగానే నిర్ణయించబడుతుంది. ప్రతి ఒక్కరు గంటలు, గంటలు మాట్లాడాలంటే సభలో ఎలా అవుతుంది? దీనిని గుర్తు పెట్టుకోవాలని సభ్యులను కోరుతున్నాను.

(ప్యానల్ ఛైర్మన్ శ్రీమతి పి. శమంతకమణి గారు అధ్యక్ష స్థానం వహించారు)

శ్రీ నిమ్మకాయల చిన రాజప్ప : అధ్యక్షా, బంగాళాఖాతంలో వాయుగుండంగా ఏర్పడి అది 250 కి.మీ స్పీడ్‌లో తుఫానుగా మారింది. దానికి హుద్ హుద్ తుఫానుగా నామకరణం చేయడం, అది నాలుగు జిల్లాలలో విరుచుకుపడిన సంగతి మనందరికి తెలుసు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు తుఫాను రావడానికి ఐదు రోజుల ముందే దీనిని గమనించి, నాసా ఉపగ్రహాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకొని ఇంత పెద్ద ఎత్తున ముప్పు వస్తుంది కాబట్టి దీనికి అన్ని చర్యలు తీసుకోవాలనే ఉద్దేశ్యంతో ఆయన జిల్లా కలెక్టర్లందరిని కూడా అలర్ట్ చేయడం జరిగింది. జిల్లా కలెక్టర్లందరిని తీర ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశించడం జరిగింది. తీర ప్రాంతాలలో నివసిస్తున్న వారికి రిహాబిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేసి అక్కడ నివసిస్తున్న ప్రజలందరిని బయటకు తీసుకురమ్మని చెప్పడం జరిగింది. ఒకవేళ రాకపోతే పోలీసు ఫోర్స్‌ను ఉపయోగించైనా తీసుకురమ్మని చెప్పడం జరిగింది. ప్రమాదం తీవ్రంగా ఉంది కనుక ఆ విధంగా చెప్పడం జరిగింది. అదే విధంగా, ఎన్‌డిఆర్‌ఎఫ్ టీంలను కూడా తీసుకురావడం, వాళ్ల ద్వారా 310 క్యాంపులు కూడా పెట్టి వారందరికి కూడా భోజన వసతి కల్పించి, ఆ రాత్రంతా ప్రజలను బయటకు తీసుకురావడం వల్ల ప్రాణ నష్టం తగ్గిందని తెలియజేస్తున్నాను. తుఫాను విశాఖపట్టణం దగ్గర తీరం దాటి

విశాఖపట్టణం సిటీని తీవ్రంగా నష్టపెట్టింది. వెంటనే ముఖ్యమంత్రి గారు ఆ రాత్రే రాజమండ్రికి బయలుదేరి రావడం, అక్కడ నుండి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు విశాఖపట్టణం చేరడం జరిగింది. అక్కడకు వెళ్లేటప్పుడు ఆయనతో నేను కూడా ఉండడం జరిగింది. మొదట ఎయిర్‌పోర్ట్‌లో దిగడం, ఎయిర్‌పోర్టులో దిగినప్పుడు వాతావరణ పరిస్థితిని చూచినప్పుడు మొత్తం సిటీ అంతా చాలా దారుణంగా దెబ్బ తిన్నదని అర్థమైంది. అలాగే శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలో పూర్తిగా పంట నష్టం జరిగిందని అర్థమైంది. అక్కడ ఇళ్లు చాలా వరకు కూలిపోయాయని అర్థమైంది. ప్రజలందరూ ఆహారం, నీరు లేదని ఇబ్బంది పడే పరిస్థితులలో, వెంటనే ఆయన కలెక్టర్ ఆఫీసుకెళ్లి ఇతర జిల్లాల కలెక్టర్లందరితో మాట్లాడి హెలీకాప్టర్ ద్వారా ఆహార పదార్థాలను, పాలు, నీళ్లను తెప్పించి ప్రజలందరికి అందించిన సంగతి అందరికి తెలుసు. అలాగే, దారులన్నీ మూసుకుపోయాయి కనుక వెంటనే దారులన్నింటిని ముందుగా ఏర్పాటు చేసి రవాణ సౌకర్యాలు ఏర్పాటు చేస్తే నిత్యావసర వస్తువులన్నీ బయట నుండి వస్తాయి, అప్పుడు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఉండదనే ఉద్దేశ్యంతో రోడ్ల మీద చెట్లు అన్నింటిని కట్ చేయించి ముందుగా దారులను ఏర్పాటు చేయించడం జరిగింది. అలాగే పవర్ కూడా లేదు. దాదాపు 40వేల పోల్స్ పడిపోయాయి. కరెంట్ లేదు కనుక మంచి నీటి సౌకర్యాన్ని పునరుద్ధరించాలనే ఉద్దేశ్యంతో వెంటనే జనరేటర్స్‌ను ఏర్పాటు చేయించడం, అలాగే ఎలక్ట్రిసిటీని కూడా కొన్ని ప్రాంతాలలో రెండు రోజులలోనే పునరుద్ధరించడం జరిగింది. తరువాత అన్ని ప్రాంతాలలో ఏడెనిమిది రోజులకే అందించడం జరిగిందని తెలియజేస్తున్నాను. అలాగే ప్రధాన మంత్రి గారిని తీసుకురావడం, ప్రధానమంత్రి గారు వచ్చిన తరువాత ఆయన పరిస్థితినంతటిని చూడడం, రూ.1000కోట్లు తాత్కాలిక సహాయాన్ని ప్రకటించడం, దానిలో రూ.400కోట్లు విడుదల చేయడం జరిగింది. ప్రధానమంత్రి గారు కూడా వచ్చినప్పుడు ప్రజల పరిస్థితిని చూసారు. చంద్రబాబునాయుడు గారు చేసిన సేవలన్నింటిని గమనించి శభాష్ అని చెప్పి వెళ్లడం జరిగిందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. అలాగే, చంద్రబాబునాయుడు గారు విశాఖపట్టణం సిటీలోనే కాకుండా ఇటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు కూడా తిరిగి అక్కడ పాడైపోయిన పంటపొలాలను, పాడైపోయిన ఇళ్లను చూడడమే కాకుండా ప్రజలందరిని ఓదార్చి మీకు నేను తోడుగా ఉన్నాను, మీ అందరికి ఆర్థిక సహాయం చేస్తాను, మీకు ఇబ్బంది లేదని చెప్పి నిత్యావసరవస్తువులన్నీ అందే విధంగా అన్ని చర్యలు తీసుకోవడం జరిగింది. ఇతర రాష్ట్రాల నుండి, ఇతర జిల్లాల నుండి నిత్యావసర వస్తువులను, కూరగాయలను తెప్పించి ప్రజలకు అందించిన సంగతి అందరికి తెలుసు. ఆ కార్యక్రమం చేయడం వల్ల ప్రజలకు ఆహారం విషయంలో ఇబ్బంది లేకుండా బయట పడడం జరిగింది. అలాగే, మంచినీటి కోసం గ్రామాలలో కూడా జనరేటర్లను పెట్టి మంచినీటిని అందించడం జరిగింది. మంచినీటిని అందించానికి ముందు జిల్లా కలెక్టర్ స్థాయిలో ప్రతి గ్రామంలో రెవ్యూ చేసి అక్కడ పరిస్థితులన్నింటిని గమనించి వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశాలు కూడా ఇవ్వడం జరిగింది. అక్కడకు కలెక్టర్లే కాకుండా ప్రజాప్రతినిధులు, మంత్రులు, ప్రతి జిల్లాకు వెళ్లడం ఎం.ఎల్.ఏలు కూడా ఆ ప్రాంతాలలో ఉండి ఎప్పటికప్పుడు రెవ్యూ చేసుకొని ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకోవడం వల్ల ప్రజలంతా తొందరలోనే కోలుకోవడం జరిగిందని తెలియజేస్తున్నాను. అలాగే పంట పొలాలు పోయాయి. ఇళ్లు పోయాయి. వాటిన్నింటిని ఎన్యుమరేషన్ చేయించాలనే ఉద్దేశ్యంతో ఇతర జిల్లాల నుండి టీంలను తెప్పించి ఇటు పంటలను కాని, అటు ఇళ్లు కాని ఏమి నష్ట పోయాయనే వివరాలను సేకరించి లిస్టులను తయారుచేయడం జరిగింది.

ఈ విధంగా నష్టం తగ్గించడానికి అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియచేస్తున్నాను. నాలుగు జిల్లాలలో ఈ ప్రభావం ఉన్నది. 7,285 గ్రామాలు, 137 మండలాలు నష్టపోయాయి. తుఫాను క్యాంపులకు 2 లక్షల 22 వేలమందిని తరలించడం జరిగింది. 61 మంది చనిపోయారు. చనిపోయిన వారికి రూ.3 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షలు కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలని నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చెల్లించింది. కేంద్రం నుండి రిలీజ్ అయింది. వాటిని కూడా త్వరలోనే ఇవ్వడం జరుగుతుంది. లక్షా ముప్పైవేల ఇళ్లు ధ్వంసమయ్యాయి. 40 వేల విద్యుత్ స్థంభాలు పడిపోయాయి. 2,39,781 మంది రైతులు నష్టపోయారు. 81,455 హెక్టార్ల విస్తీర్ణంలో పంట దెబ్బతిన్నది. ప్రభుత్వం అన్ని శాఖలను క్రోడీకరించి నష్టాన్ని పూడ్చాలనే ఉద్దేశ్యంతో ఇప్పటివరకూ ప్రభుత్వం రూ.1,204 కోట్లు ఖర్చు పెట్టింది. అందులో రూ.844కోట్లు ప్రభుత్వం ఖర్చు చేయగా, రూ.360 కోట్లు ఎలక్ట్రిసిటీ శాఖ ఖర్చు పెట్టి అన్ని గ్రామాలకు కరెంటును సరఫరా చేయడం జరిగిందని తెలియచేస్తున్నాను. సభ్యులు చాలా మంది చాలా ప్రశ్నలు అడిగారు. రైతు, ఉద్యాన శాఖకు సంబంధించి ప్రభుత్వం 208 కోట్ల 96 లక్షలు రిలీజ్ చేసింది. వ్యవసాయ శాఖకు రూ.140 కోట్ల 34 లక్షలు, విద్యుత్తుకు రూ.300కోట్లు ఖర్చు పెట్టింది. నీటి సరఫరాకు రూ.73 కోట్లు, ఆహారం, వస్త్రాలు, ఇతర కార్యక్రమాలకు రూ.294 కోట్లు ఖర్చు పెట్టింది. ఇప్పటి వరకూ ఎన్నడూ లేని విధంగా దెబ్బతిన్న రిక్షాలకు, ఆటోలకు రూ.92 కోట్లు ఖర్చు పెట్టడం జరిగింది. టేకు, సరుగుడు చెట్లు, కోళ్ల పరిశ్రమకు నష్ట పరిహారం ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ అయిదు జిల్లాలలో వ్యవసాయం అనుబంధ శాఖలకు సంబంధించి రూ.5,830 కోట్లు నష్టం రాగా, ప్రభుత్వ ఆస్తులు రూ.8,660 కోట్లు, ప్రైవేటు ఆస్తులు రూ.7,411, మొత్తం రూ.21,900 కోట్లు నష్టం వాటిల్లింది. ఈ నష్ట పరిహారం ఇవ్వడం కోసం కేంద్రంపై వత్తిడి తీసుకురాగా రూ.400 కోట్లు రిలీజ్ చేసింది. అయినా, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని రూ.1200 కోట్లు ఖర్చుపెట్టింది. రైతులకు సంబంధించిన నష్ట పరిహారాన్ని ఇప్పటికే జిల్లాలకు అందించడం, ఆయా జిల్లా అధికారులు రైతుల అకౌంట్లకు ఆ డబ్బులు వేయాలని నిర్ణయించడం జరిగిందని తెలియచేస్తున్నాను. పెద్దలు శ్రీ డి.వి. సూర్యనారాయణ రాజు గారు మాట్లాడుతూ, పాలు, నీరు, నిత్యావసర వస్తువులు కొన్ని ప్రాంతాలలో అందలేదని చెప్పారు. గౌరవ ముఖ్యమంత్రి గారు తుఫాను వచ్చిన మరునాడే ఇతర ప్రాంతాల నుండి హెలికాప్టర్ నుండి నిత్యావసర వస్తువులను, ఆహార పదార్థాలను తెప్పించి అందించడం జరిగింద ని అందరికీ తెలుసు. కొన్ని మారుమూల ప్రాంతాలలో వెంటనే అందకపోయినప్పటికీ రెండు రోజులలోనే ఆ పరిస్థితిని అధిగమించి అన్ని జిల్లాలకు నిత్యావసరాలను అందించడం జరిగింది. గ్రామాలలో, పట్టణాలలో కూడా తక్కువ ధరకు సరుకులను అందించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయడం జరిగింది. సూర్యనారాయణ రాజు గారు ఇళ్ల డామేజి ఎక్కువగా ఉందని చెప్పారు. ఆ రోజు అధికారులను బయట నుండి తీసుకువచ్చి పరిశీలించి లిస్టులు తయారు చేసిన తరువాత రూ.5000లు ఇవ్వడం జరిగింది. ఇంకా ఏమైనా తేడా ఉంటే మళ్లీ వాటిని కూడా తీసుకోమని ప్రభుత్వం ఆదేశాలివ్వడం జరిగింది. నిత్యావసర వస్తువులను మత్స్యకారులు ఉండే కొన్ని ప్రాంతాలలో ఇచ్చారు, కొన్ని ప్రాంతాలకు అందలేదని సభ్యులు అన్నారు. మత్స్యకారులకు 50 కె.జి.ల బియ్యం, వీవర్స్‌కు 50 కె.జిలు ప్రకటించడం జరిగింది. బియ్యమే కాకుండా వాటికి అనుబంధంగా ఉన్న పప్పులు, నూనె వంటి 9 రకాల వంట పదార్థాలను ఇవ్వడం జరిగింది. ఇతర ప్రాంతాలకు 25 కె.జిలు ఇవ్వడం జరిగింది. మిగతా చోట్ల 10 కె.జిలు ఇచ్చి ప్రజలను ఆదుకోవడం జరిగింది. రైతుల విషయానికి వస్తే వరి, చెరుకు, మామిడి

పంటలు దారుణంగా పోయాయి. అన్ని పంటలకు పరిహారం పెంచి రైతులను ఆదుకోవడానికి హార్టీకల్చర్‌కు సంబంధించిన రైతుల అకౌంట్లలో కూడా డబ్బులు వేయడం జరుగుతున్నది. సభ్యులు శ్రీ విశ్వప్రసాద్ గారు కూడా చెట్లు పడిపోయాయి, రైతులు నష్టపోయారని కొన్ని సమస్యలను మా దృష్టికి తీసుకువచ్చారు. నష్ట పరిహారం కొంతవరకు ఇవ్వడం జరిగింది. ఇంకా కొంతమంది రైతుల అకౌంట్లకు వెళ్లవలసిన అవసరమున్నది. అందుకు సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటాము. దెబ్బతిన్న కొబ్బరి చెట్లకు కూడా రూ.500లు ఇవ్వడం జరుగుతుంది. తుఫాను షెల్టర్ల గురించి ఇవాళ చర్చించాము. ఇప్పటికే కొన్ని ఉన్నాయి. మిగతావి కూడా తప్పకుండా పూర్తి చేసి తీర ప్రాంత వాసులను ఆదుకుంటామని తెలియచేస్తున్నాను. కోళ్ల పరిశ్రమకు సంబంధించి చంద్రబాబు నాయుడు గారు రూ.15 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని అనౌన్స్ చేశారు. ప్రాజెక్టులు, వరదలు విషయానికి వస్తే, వరదల వల్ల కొంత నష్టం జరిగింది. నదులు పొంగడం వల్ల గ్రామాలలో గట్లు తెగిపోయి నడవడానికి కూడా దారి లేని పరిస్థితి ఏర్పడింది. తుఫాను ప్రభావిత ప్రాంతాలను సందర్శించినప్పుడు మాతో పాటు నీటిపారుదల శాఖా మంత్రి కూడా ఉన్నారు. మేము వీటిని పునరుద్ధరించడానికి అన్ని చర్యలు తీసుకుంటాము. పెద్దలు శర్మ గారు కూడా మంచి సూచనలు చేశారు. అనకాపల్లిలో దెబ్బ తిన్న ఎయిడెడ్ కళాశాలకు సంబంధించి తప్పకుండా చర్యలు తీసుకుంటాము. వంద సంవత్సరాల చరిత్ర ఉన్న వ్యవసాయ కళాశాలకు నేను కూడా వెళ్లడం జరిగింది. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తామని తెలియచేస్తున్నాను. మత్స్యకారుల గురించి, బోట్లు నష్ట పరిహారం గురించి కూడా సభ్యులు ప్రస్తావించారు. మత్స్యకారులకు ఐస్ బాక్సులకు నష్టపరిహారం చెల్లించాము. ఎక్కడైనా పొరపాటు జరిగితే దానిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తప్పకుండా చర్యలు తీసుకుంటాము. బిల్డింగ్ వర్కర్స్ విషయంలో, గత నాలుగు నెలల నుండి ఇసుక సమస్యతో పాటు ఇప్పుడు ఈ సమస్య కూడా వచ్చింది. కార్మిక శాఖా మంత్రితో మాట్లాడి వారికి కూడా నష్ట పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటాము. రైల్వే, ఎయిర్‌పోర్టుల గురించి కూడా కేంద్రంపై వత్తిడి తీసుకురావలసిన అవసరమున్నది. సభ్యులు శ్రీ అంగర రామ మోహన్ గారు చెప్పినట్లు, కేంద్రం నుండి నిధులు తీసుకురావలసిన అవసరమున్నది. 123 సంవత్సరాలలో 77 తుఫానులు వచ్చాయని పద్మరాజు గారు చెప్పడం జరిగింది. అది వాస్తవం. తీర ప్రాంతంలోని వెయ్యి కిలోమీటర్లలో ఎప్పుడు తుఫానుల తాకిడి ఉంటున్నది. కొబ్బరి చెట్లు, పంటలను మనం నష్టపోతున్నాము. నష్ట నివారణకు చర్యలు తీసుకుంటాము. తీర ప్రాంతంలో నష్ట నివారణకు సరుగుడు చెట్ల పెంపకం, మడ అడవుల పెంపకం గురించి సభ్యులు మంచి సూచనలు, సలహాలు ఇచ్చారు. అటవీ శాఖ ద్వారా మడ అడవులను పెంచడం జరుగుతున్నది. అలాగే, సరుగుడు చెట్లు పెంచడానికి తగిన చర్యలు తీసుకుంటాము.

మ.2.00

శ్రీ రుద్రరాజు పద్మరాజు: అధ్యక్షా, అంతర్వేదిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం చాలా ప్రసిద్ధిచెందిన దేవాలయం. ఈ విషయం మంత్రిగారికి కూడా బాగా తెలుసు. గడచిన రెండు సంవత్సరాలు చూసినట్లయితే ఆ దేవాలయం వద్ద ఒక కిలోమీటరు మేర కోతకు గురైంది. దానికి అడ్డుకట్ట వేయకపోతే రాబోయే రోజుల్లో ఆ దేవాలయం కూడా కోతకు గురయ్యే అవకాశముంటుంది. I request the Hon'ble Minister for Disaster Management to take effective steps in order to prevent it, if not, atleast minimize it. అదే విధంగా, కాకినాడ సమీపంలో ఉన్న ఉప్పాడ తీర ప్రాంతం కూడా ఈ రకమైన తుఫానులు సంభవించినపుడు

విపరీతమైన కోతకు గురవుతుంది కాబట్టి దీనిపై కూడా ప్రభుత్వం శ్రద్ధ వహించాలి. మడ అడవుల పెంపకం విషయంలో కూడా ఖచ్చితంగా ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలి. Cashew rhino plantation is also very much essential. ఈ విధమైన చర్యలు తీసుకున్నప్పుడు మాత్రమే మనం బాగా చేయడానికి అవకాశముంటుంది.

శ్రీ ఎన్. చినరాజప్ప: అధ్యక్షా, మడ అడవులను కూడా పెంచడం జరుగుతోంది. నేను ఈ మధ్యనే అంతర్వేది వెళ్లడం జరిగింది. అక్కడ చాలావరకూ ప్రాంతం కోతకు గురయ్యే పరిస్థితి ఉంది. ఈ విషయాన్ని కూడా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఉప్పాడ తీరప్రాంతం వద్ద ఈ తుఫాను వల్ల పూర్తిగా రోడ్డు కొట్టుకుపోవడం జరిగింది. ఆ సమయంలో నేను కూడా ఆ ప్రాంతానికి వెళ్లడం జరిగింది. కేంద్ర బృందానికి ఆ ప్రాంతాన్ని కూడా చూపించడం జరిగింది. తప్పనిసరిగా ఆ ప్రాంతమంతా కరకట్లను బలోపేతం చేయడం, సరుగుడు చెట్లను పెంచడానికి అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ముఖ్యంగా ఈ పనులన్నీ చేయడం కోసం కేంద్రం నుంచి నిధులను తీసుకురావలసిన అవసరముంది. ఇంకా ఏదైనా సమస్యలున్నా రాష్ట్రప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలియజేస్తూ నేను శెలవుతీసుకుంటున్నాను.

శ్రీ రుద్రరాజు పద్మరాజు: అధ్యక్షా, మీరు ఇచ్చినటువంటి నోట్‌లో చనిపోయినటువంటి వ్యక్తులకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా అని చెప్పారు. అసలు ఎంతమంది చనిపోయారనే సంఖ్యను దీనిలో మెన్షన్ చేయలేదు.

శ్రీ ఎన్. చినరాజప్ప: అధ్యక్షా, తుఫాను వల్ల మొత్తం 61 మంది చనిపోయారు.

శ్రీ కె.వి.వి.సత్యనారాయణ రాజు (ఉపాధ్యాయ నియోజకవర్గం, తూర్పు–పశ్చిమ గోదావరి): అధ్యక్షా, తేది. 12.10.2014 న సంభవించిన హుద్ హుద్ తుఫాను గురించి శాసనసభ మరియు శాసనపరిషత్తులోని సభ్యులంతా చాలా చక్కగా ప్రజంట్ చేశారు. మేము కూడా తేది. 14.10.2014 నుంచి తేది. 21.10.2014 వరకూ ఏడు రోజులపాటు అక్కడే ఉన్నాము. మధ్యలో రెండు రోజులపాటు విప్‌ల కాన్ఫరెన్స్ కోసం సభ్యులు శ్రీ పద్మరాజుగారు, శ్రీనివాసులునాయుడు గారు, నేను గోవా వెళ్లడం జరిగింది. తుఫాను సంభవించిన తర్వాత ఉపముఖ్యమంత్రిగారు, ఆర్థికశాఖామంత్రిగారు, జిల్లా మంత్రులు శ్రీ సి.హెచ్. అయ్యన్నపాత్రుడుగారు, శ్రీ గంటా శ్రీనివాసరావు గారితో పాటు మంత్రులంతా అక్కడే ఉన్నారు.

(ప్యానెల్ ఛైర్మన్ శ్రీ వాకాటి నారాయణ రెడ్డి గారు అధ్యక్ష స్థానం వహించారు)

తేది. 08.10.2014 నుంచి గౌరవ ముఖ్యమంత్రిగారు సచివాలయం, విశాఖపట్నం, విజయనగరం శ్రీకాకుళం, కాకినాడ, ఏలూరు కలెక్టర్ కార్యాలయాల్లో తుఫానుకోసం ప్రత్యేకమైన సెల్‌ను ఏర్పాటుచేసి హై అలర్ట్, రెడ్ అలర్ట్, సివియర్ అలర్ట్‌ల ద్వారా తుఫాను వల్ల జరిగే మరణాలను తగ్గించడం జరిగింది. తూర్పుగోదావరి మరియు పశ్చిమగోదావరి జిల్లాలకు రావలసిన ఈ తుఫాను ప్రభావం విశాఖపట్నం, శ్రీకాకుళం మరియు విజయనగరం జిల్లాలకు వెళ్లింది. తుఫాను ప్రభావం వల్ల నేను కూడా ఒక బాధితుడినే. హుద్ హుద్ తుఫాను వల్ల కేంద్రప్రభుత్వ

సంస్థలు, గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్, స్టీల్‌ప్లాంటు, ఎన్.ఎస్.టి.ఎల్., విశాఖ పోర్ట్ ట్రస్ట్, విమానాశ్రయం, ఆంధ్ర విశ్వవిద్యాలయంతో పాటు కమ్యూనికేషన్ వ్యవస్థ కూడా చాలా దెబ్బతినడం జరిగింది. నష్టపోయిన వారిలో పెద్ద వ్యాపారులు, చిన్న చిన్న వ్యాపారులు, రైతులు, పేదవారు కూడా ఎంతో మంది ఉన్నారు. తుఫాను జరిగిన తర్వాత విజయనగరం మరియు శ్రీకాకుళం జిల్లాల్లో గౌరవనీయులు శ్రీ చినరాజప్ప గారితో పాటు నేను కూడా బసచేయడం జరిగింది. ఆ తర్వాత విశాఖపట్నంలో కూడా నాలుగు రోజులు బసచేయడం జరిగింది. మళ్లీ నిన్ననే నేను అక్కడకు వెళ్లి వచ్చాను. మా సంస్థలకు కూడా దాదాపు రూ. 5 కోట్లు వరకూ నష్టం వాటిల్లింది. నేను క్లెయిమ్ అడగడం లేదు. మా సంస్థల తరపున రూ. 25 లక్షలు ముఖ్యమంత్రిగారి సహాయనిధికి నేను కూడా ఇవ్వడం జరిగింది. ఆ మొత్తంతోపాటు మరొక రూ. 25 లక్షలు ముఖ్యమంత్రిగారి సహాయనిధికి ఇస్తానని నేను చెప్పడం జరిగింది. ఆ నిధులతో అవసరం ఉన్న చోట ఒక హౌసింగ్ ప్రాజెక్టును చేపట్టడం కోసం గౌరవ ముఖ్యమంత్రిగారు జిల్లా కలెక్టరుకు లెటర్ రాయడం జరిగింది. మేము కూడా అక్కడ ఒక కాలనీలాగ టేకప్ చేస్తామని చెప్పడానికి చాలా సంతోషిస్తున్నాను. తుఫాను వల్ల నేను కూడా దెబ్బ తిన్నప్పటికీ ఇతరులకు సహాయం చేయాలనే ఉద్దేశ్యంతో ఇది చేయడం జరుగుతుంది. తేది. 06.11.1996 న తుఫాను సంభవించినపుడు గౌరవ ముఖ్యమంత్రిగారు మంత్రులందరినీ తీసుకువచ్చి 14 రోజులపాటు రాజమండ్రిలో ఉండి తుఫాను సహాయక చర్యలను చేయడం జరిగింది. కొబ్బరితోటలు, పళ్లతోటలు, కోళ్ల పరిశ్రమ, పాడిపరిశ్రమ, చేపల పరిశ్రమలు మొదలైనవన్నీ ఆనాడు భారీగా దెబ్బతినడం జరిగింది. అందుచేత, ఈ తుఫానును జాతీయ విపత్తుగా ఈ సభ తీర్మానం చేసి కేంద్రప్రభుత్వానికి పంపించవలసిందిగా తమరిద్వారా నేను కోరతున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, రేపటితో ఈ సమావేశాలు పూర్తవుతాయి. ఈ సందర్భంగా నేను ఒక విజ్ఞప్తిని చేయదలచుకున్నాను. అక్కడ సభంతా గందరగోళం మధ్య జరుగుతోంది. ఈ సభలో ఎటువంటి గందరగోళం లేకుండా ప్రతిపక్ష సభ్యులు, మిత్రపక్ష సభ్యులంతా చాలా చక్కగా మాట్లాడడం జరుగుతోంది. ఒక వార్తాపత్రిక లేదా టెలివిజన్ ఛానల్‌లోగానీ ఈ సభ గురించి ఎటువంటి ప్రాధాన్యత లేకుండా "శాసనమండలిలో కూడా చర్చ జరిగింది" అని రెండు చోట్ల "ప్రతిపక్ష సభ్యులు ఈ విధంగా కోరారు" అని తప్పితే అసలు పేర్లు రాయడానికి కూడా ఇష్టపడడం లేదు. ఇంతమంది పత్రికా విలేఖరులు ఇక్కడకు వచ్చి కూర్చుంటున్నారు. అసలు పొరపాటు ఎవరిదో, లోపం ఎక్కడుందో తెలియడం లేదు.

మిస్టర్ ఛైర్మన్: అది వారి పొరపాటు కాదమ్మా, అది వారి యాజమాన్యం పొరపాటు.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి: అధ్యక్షా, అంతమంది సభలో కూర్చుంటున్నారు. వారు కూడా ఈ విషయాన్ని యాజమాన్యంతో చెప్పవలసిన అవసరముంది. ఇది పెద్దల సభ. ఈసభకు ఎంత ప్రాధాన్యం ఉందంటే, శాసనసభ్యుల పదవీకాలం ఐదు సంవత్సరాలు, మా పదవీకాలం ఆరు సంవత్సరాలు. సీనియారిటీలో, ప్రోటోకాల్‌లో మేము ముందు తర్వాత వారు. ఎంతో అనుభవం కలిగిన సభ్యులు ఈ సభలో ఉన్నారు. పట్టభద్రుల తరపున మరియు ఉపాధ్యాయుల తరపున ఎంతో అనుభవం కలిగిన సభ్యులు వచ్చి మాట్లాడుతుంటే ఈ సభకు ప్రాధాన్యత లేకపోవడం చాలా దురదృష్టకరం. దయచేసి ఆ సీటు నుంచి మీరు కూడా విజ్ఞప్తి చేయవలసిన అవసరముంది. మేము వారితో పోట్లాడడం లేదు. వారిని డిమాండు చేయడం లేదు. కనీసం మేము వారిని కోరుతూ, ఇంత చెబుతున్నా కూడా ఒక్క వార్త కూడా మీడియాలో రావడం లేదు.

సభలో ఆ జిల్లాకు చెందిన మంత్రిగారు శ్రీ సి.హెచ్. అయ్యన్నపాత్రుడు గారు కూడా ఉన్నారు. జాతీయ విపత్తు అని మనం చెబుతూనే ఉన్నాము. వారు పెడచెవిన పెడుతూనే ఉన్నారు. ఈ చెవితో వింటున్నారు, ఆ చెవితో వదలివేస్తున్నారు. కానీ అలా కాకుండా, "విపత్తుల రాష్ట్రం"గా మన రాష్ట్రాన్ని ప్రకటించమని నేను కోరుతున్నాను. గత వంద లేక రెండు వందల సంవత్సరాల నుంచి లేదా గత 75 సంవత్సరాల నుంచి మీరు గణాంకాలను తీసుకోండి. మొన్న దివిసీమ తుఫాను దగ్గర నుంచి కృష్ణా జిల్లాలో, నెల్లూరు జిల్లాలో, గుంటూరు జిల్లాలో, ప్రకాశం జిల్లాల్లో, గోదావరి జిల్లాల్లో, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఎన్నిసార్లు ఇటువంటి తుఫానులు వచ్చాయనేది చూడండి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విపత్తుల రాష్ట్రంగా తీసుకుని ప్రత్యేక ప్రతిపత్తి కల్పించాలని, ప్రత్యేకమైన నిధులు కేటాయించాలని, ప్రత్యేక దృష్టితో చూసి దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని నేను కోరుతున్నాను. హోంశాఖ మంత్రిగారు సముద్రతీరానికి చెందిన మంత్రిగారు, దయచేసి మీరంతా ఈ రాష్ట్రాన్ని విపత్తుల రాష్ట్రంగా ప్రకటించమని కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం కోసం శాసనపరిషత్తు ద్వారా ఒక తీర్మానాన్ని చేయవలసిన అవసరముందని నేను భావిస్తున్నాను.

శ్రీ గాదె శ్రీనివాసులునాయుడు (ఉపాధ్యాయ నియోజకవర్గం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం): అధ్యక్షా, హుద్ హుద్ తుఫాను వల్ల విశాఖపట్నంలో ఉన్న ఆంధ్రా విశ్వవిద్యాలయం బాగా దెబ్బతిన్నది. ఉత్తరాంధ్రలో ఉన్న ఆ మూడు జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలలు, ప్రయివేటు పాఠశాలలు అనే తేడా లేకుండా అందరికీ నష్టపరిహారంగా ప్రత్యేక గ్రాంటును ఇవ్వాలని నేను తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. తుఫాను కారణంగా చాలామందికి చెందిన ఆస్థులు కూడా దోపిడీకి గురయ్యాయి. హోం శాఖ మంత్రిగారు దానిపై కూడా ప్రత్యేక విచారణ చేయించి దోపిడీకి గురైన ఆస్థులను తిరిగి వారికి ఇప్పించాలని కూడా నేను తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

(ప్యానెల్ ఛైర్మన్ శ్రీమతి పమిడి శమంతకమణి గారు అధ్యక్ష స్థానం వహించారు.)

మ.2.10

శ్రీ అంగర రామ మోహన్ : అధ్యక్షా, శాసన మండలి సమావేశాలు జరుగుతున్నట్లుగా ఈ రోజుకీ ప్రతికల్లో వార్త రావడంలేదు. దురదృష్టకర విషయం ఏమంటే – మేము హైదరాబాదులో సమావేశాల నిమిత్తం ఉన్నామని చెబితే శాసన సభతో పాటుగా శాసన పరిషత్తు సమావేశాలు కూడా జరుగుతాయా? అని ప్రజలు అడుగుతున్నారు. ఈ విధమైన భావాన్ని వ్యక్తపరచడం ద్వారా మన సభను మనమే అవమాన పరుచుకుంటున్నాం. ఇప్పటికైనా స్పందించి ఎందుకు ఈ విధంగా జరుగుతుందనే విషయమై ఆలోచించి, ఇందులో ప్రజల సమస్యలు గురించి చర్చించి వాటి పరిష్కార మార్గాలు సూచిస్తారనే భావన ప్రజలకు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని మీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

(గౌరవ డెప్యూటీ ఛైర్మన్ శ్రీ వెంకట సతీష్ కుమార్ రెడ్డి సింగారెడ్డి గారు అధ్యక్ష స్థానం వహించారు.)

శ్రీ బి. చంగల్ రాయుడు : అధ్యక్షా, హుద్ హుద్ తుఫాను విషయంలో ప్రి-హుద్ హుద్, పోస్ట్-హుద్ హుద్, కంప్యారిటివ్ స్టడీ అనే కొన్ని అంశాలను మీ ముందు పెట్టి నేను శెలవు తీసుకుంటాను. హోంమంత్రి గారు, డిజాస్టర్ మినిస్టర్ గారు నేను చర్చించే అంశాలపై క్లారిఫికేషన్ ఇవ్వాలని కోరుతున్నాను. ప్రి-హుద్ హుద్ గురించి – 06-10-2014న రాత్రి 8.22 గంటలకు తుఫాను గురించి నాసా నుంచి హెచ్చరిక నివేదిక ఇచ్చింది. కానీ మనందరం జన్మభూమి కార్యక్రమంలో ఉండటం మూలాన 9వ తేదీ నుంచి కూడా తగు ముందస్తు చర్యలు తీసుకోలేదు. ప్రికాషన్స్ తీసుకున్నామని అందరికీ చెపుతున్నారు. "సినిమాహాల్స్‌లో విరామ సమయంలో నో-స్మోకింగ్ అని ప్రకటన వేస్తే, అప్పుడే జనాలు బీడి కట్టను బయటికి తీసినట్లుగా మనం తీసుకున్న ముందస్తు జాగ్రత్త చర్యలు ఉన్నాయేమోనని నేను అనుకుంటున్నాను". ఏది ఏమైనా పోస్ట్ హుద్ హుద్ విషయంలో – ముఖ్యమంత్రిగారికి 75 శాతం మార్కులు, మంత్రులకు 95 శాతం, అధికారులు బాగా కష్టపడ్డారు కాబట్టి వారికి 99 శాతం మార్కులు ఇవ్వొచ్చు. ఏడు రోజుల తరువాత అధికారులు కొంత మెత్తపడడం ద్వారా పనులు వేగంగా జరుగలేదు, ఎన్యుమరేషన్ కూడా సక్రమంగా జరుగలేదు. ఒకసారి మీరు సర్వే చేయించారు, సర్వే అంతా ఒకే సారి పూర్తి కావాలంటే కూడా సాధ్యం కాని పని, కాబట్టి మరలా రెండవ సారి, మూడవ సారి కూడా సర్వే చేయించగలిగితే ఎక్కడైనా లోటుపాట్లు జరిగి ఉంటే, వాటిని అతిక్రమించడానికి రెండవ, మూడవ సర్వేలు ఉపయోగపడతాయని నేను మీ దృష్టికి తీసుకువస్తున్నాను. తప్పనిసరిగా సర్వే నిర్వహించి లెఫ్ట్ ఓవర్ అయిన, తప్పులు దొరిలిన వాటిని సరిచేయవలసిందిగా మీ ద్వారా సభ దృష్టికి తీసుకువస్తున్నాను. కంప్యారిటివ్ స్టడీ విషయమై ఒక విషయాన్ని చెప్పాలి. 1977 లో వచ్చిన ఉప్పెన అర్ధరాత్రిలో వచ్చింది. శాస్త్రీయంగా సరిగా ఎటువంటి అంచనాలు వేయలేని పరిస్థితుల్లో అది వచ్చింది. కానీ మరునాటికే అందరికీ కిరోసిన్ లాంతర్లను పంపిణీ చేశారు. కానీ ప్రస్తుతం వచ్చిన తుఫాను పట్టపగలే వచ్చింది, కనుక ఇక్కడ కొన్ని పోస్ట్ మెజర్స్ చేపట్టి ఉంటే బాగుండేది. ఇందులో ఛాంపియన్ అయిన నవీన్‌పట్నాయక్ గారి గురించి ఇక్కడ ప్రస్తావించాల్సి వస్తుంది. ఆయన ముందుగానే అన్ని ప్రికాషన్స్ తీసుకున్నారు, మనం తీసుకోలేకపోయాము. అయినా భవిష్యత్తులో కూడా ఈ వరదలు, కరువులు రాకపోవు కాబట్టి, ఈ అనుభవంతోనైనా సరే శాస్త్రీయంగా మనం ముందుకు వెడుతూ, జరుగుతున్న సంఘటనలను తెలుసుకుంటూ, ఏం చేయాలో ముందుగా ఒక ప్రణాళిక వేసుకుంటే బావుంటుంది. ఉదాహరణకి ఒక పెళ్ళి చేయాలంటే, ఒక సినిమాలో – "పెళ్ళి అంటే మేళాలు, తాళాలు, పందిళ్ళని అంటారు". మరి ఇలా కరువంటే మనకు ముందురోజు నుంచే కరంటు ఆపేస్తే కొవ్వొత్తులు, భోజనం, నీళ్ళు మొదలైనవన్నీ కావాలి. ఇవన్నీ మనం నాలుగు రోజుల ముందుగానే ఏర్పాటు చేసుకుని ఉంటే, ఆరోజున విశాఖలో అందరూ అంత ఆందోళనపడ వలసిన పనే లేదు. ఇప్పటికైనా ముందుజాగ్రత్తగా ఇవన్నీ చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే, సోలార్ విద్యుత్తు అన్నిచోట్లా వచ్చేశాయి. మనకు మామూలు విద్యుత్తు లేకపో యినా, ఈ సోలార్ విద్యుత్తు సాయంత్రం 6.00 గంటల నుండి రాత్రి 10 గంటల వరకూ ఉన్నా సరిపోతుంది. ముందుగానే వారం రోజుల వరకూ ఈ పద్ధతిలో విద్యుత్తును కూడా నిల్వ ఉంచుకుంటే మనకు ఎటువంటి విపత్కర పరిస్థితులు వచ్చినా మనం ఎదుర్కోగలం. అలాగే మనం పోస్ట్ మెజర్స్ కన్నా ప్రీ-మెజర్స్ మీద ఎక్కువ శ్రద్ధ వహిస్తే వరదలను, ఎటువంటి కష్టనష్టాలనైనా ఎదుర్కోవడానికి అవకాశం ఉంటుంది.

ఈ తుఫాన్ వల్ల మనకు విద్యుత్తు స్థంభాలు చాలా దెబ్బతిన్నాయి. ఇందులో విరిగిపోయినవి, దెబ్బతిన్నవి, కూలిపోయినవి ఎన్ని అనే వాటికి సంబంధించి ముందుగా ప్రభుత్వం

ఒక అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ తుఫాన్ వల్ల కూలిపోయిన వాటి సంఖ్యే ఎక్కువగా ఉంది. ఒక విద్యుత్తు స్థంభం వేయాలంటే, సుమారుగా 1/6వ వంతు స్థంభం భూమిలోకి వెళ్ళాలి. అలా కాకుండా కొంత లోతు వరకే స్థంభాన్ని భూమిలోకి పాతుతున్నారు. తుఫాను గాలి ఎక్కువ అవడంతో, అక్కడ ఎక్కువగా ఇసుక ప్రాంతం అవడం వల్ల స్థంబాలన్నీ వంగి పోయి ఉన్నాయి. ఒకవేళ స్థంభాలు విరిగిపోయి ఉంటే వాటిని సక్రమంగా నాటినట్లు. ఆ విషయాన్ని అక్కడికి వెళ్లిన సభ్యులెవరైనా గమనించారో, లేదో నాకు తెలియదు కానీ, తుఫాను సంభవించిన తరువాత 14, 15, 16 తారీఖులలో నేను అక్కడ ఉన్నప్పుడు అందరూ వివిధ కార్యక్రమాలలో పాల్గొని ఈ స్థంభాలను వెలికి తీస్తున్నారు. ఈ విద్యుత్తు స్థంభాల పైన భూమిలో ఎంత లోతు ఉండాలనే గుర్తులు కూడా పైనే కనిపిస్తున్నాయి. అంటే, అవి తగినంత లోతుగా స్థంభాలను భూమిలోకి పాతకపోవడం వల్ల ఎక్కువ నష్టం వాటిల్లిందని తమ ద్వారా తెలియజేస్తున్నాను. ఏది ఏమైనప్పటికీ ఈ ఉపద్రవాన్ని జయించే ప్రయత్నం మీరు చేశారు. కానీ మిత్రపక్షమైన కేంద్రం ద్వారా నిధులను రాబట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. దాన్ని ఏవిధంగా సాధించాలనే విషయమై దృష్టి సారించాలి. అందుకు మా అందరి సహకారం అవసరమనుకుంటే మీతోపాటు మేము కూడా మీ వెంట వచ్చి మా వంతు ప్రయత్నంగా అందరం కలిసి కేంద్రంపై ఒత్తిడి తీసుకువద్దాం. ప్రధానమంత్రిగారు విశాఖపట్నం వచ్చినప్పుడు ఆయనను శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు ఎందుకు తీసుకువెళ్లలేక పోయారో నాకు తెలియడం లేదు. వైజాగ్ నష్టం వేరు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నష్టం వేరు. ఆ రెండు జిల్లాల్లో అనేక పంటలు, చెట్లు, తోటలు పెద్దమొత్తంలో నాశనమయ్యాయి, ఆ దృశ్యం కంటికి కనబడుతుంది. ఇక్కడ పడిపోయిన చెట్లు, రేకులు, నామ ఫలకాలు, వంగిపోయిన స్థంభాలు కనిపిస్తున్నాయి. నేను మరియు పంచాయత్‌రాజ్ మంత్రిగారు శ్రీ సి.హెచ్.అయ్యన్నపాత్రుడు గారు కలిపి 19వ తేదిన అక్కడికి వెళ్లాం. ఈనాటికీ కొన్ని గ్రామాలలో విద్యుత్తు లేదు. నేను కొంతమంది అధికారులను ఆ విషయమై అడిగితే, విద్యుత్తు స్థంభాల కొరత ఎక్కువగా ఉందని వారు అన్నారు. అంతేగాకుండా, ఈ తుఫానుకు సంబంధించి మనకు పొరుగు రాష్ట్రాలే కాకుండా, అధికారులు, ఉద్యోగులు అందరూ తమ వంతు సహాయసహకారాలు అందించి పనులన్నీ చాలా చక్కగాచేశారు, విద్యుత్ శాఖకు సంబంధించి విశ్రాంత ఉద్యోగులు కూడా వచ్చి వారి వంత సహకారాన్ని అందించారు. నేను బాగా గమనిన విషయం ఏమిటంటే – 13వ తారీఖు అర్ధరాత్రికల్లా ఇచ్ఛాపురం వరకు రోడ్డు ట్రాన్స్‌పోర్టేషన్ చాలా చక్కగా జరిగింది. అందులో ఎటువంటి అనుమానం లేదు. మంత్రిగారు సభలో ఉంటే, నేను వారి ఎదుటే చెప్పేవాడిని. పంచాయితీరాజ్ శాఖకు సంబంధించిన ఉద్యోగులంతా ఇక్కడే పని చేశారు, ఉద్యోగులందరూ ఆషామాషీగా పని చేయలేదు. మంత్రులతో పాటు అంతేగాకుండా, కలెక్టర్లు, క్రింది సిబ్బంది తదితర శాఖల వారు తరతమ భేదాలు లేకుండా అన్ని కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ప్రభుత్వం ఆ సమయంలో సరిగానే స్పందించింది, కానీ ఒకసారి నవీన్ పట్నాయక్ గారినడిగి తగు సమాచారం, సలహాలు తీసుకుని, ప్రీ–మెజర్స్‌మీద ఎక్కువ శ్రద్ధ పెట్టాలని తమ ద్వారా మనవి చేస్తున్నాను. ధన్యవాదాలు.

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ : మంత్రిగారూ, హుద్ హుద్ తుఫానును జాతీయ విపత్తుగా కేంద్రం గుర్తించాలని సభ్యులందరి దగ్గరి నుంచి సభలో ఒక తీర్మానం ప్రవేశపెట్టాలనే ప్రతిపాదన వచ్చింది. దానిపై ప్రభుత్వం సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టే యోచనలో ఉన్నట్లయితే, దాన్ని రేపు ఆచరణలో పెడదాం.

శ్రీ సి.హెచ్.అయ్యన్నపాత్రుడు ః అధ్యక్షా, సభ్యులందరి ప్రతిపాదన మేరకు కేంద్రం దీన్ని జాతీయ విపత్తుగా గుర్తించాలని, అందుకు అనుగుణంగా సభలో ఒక తీర్మానం చేయాలని లేఖను కూడా సభకు వ్రాశాను. సభలో సభ్యులందరూ చర్చలో బాగా పాల్గొన్నందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

మ 2.20

అధ్యక్షా, హుద్‌హుద్ తుఫానుపై గౌరవ సభ్యులందరూ మాట్లాడారు. చాలా సంతోషం. జిల్లా మంత్రిగా ఆ సమయంలో అక్కడున్నాను కాబట్టి రెండు, మూడు విషయాలు మీకు చెప్పాల్సిన అవసరముంది. కనుక దయచేసి అనుమతివ్వాల్సిందిగా కోరుతున్నాను. 12వ తారీఖున వచ్చిన తుఫాను అంత ప్రభావం చూపుతుందని నేను కూడా అంచనావేయలేదు. గతంలో జరిగిన తుఫాన్లను బట్టి అంత నష్టం జరగదేమో అని ఊహించాము. 240 కిలోమీటర్ల వేగంతో వచ్చిన గాలుల వల్ల విపరీతమైన నష్టం జరిగింది. అయితే చంద్రబాబునాయుడుగారి దృష్టికి వచ్చిన వెంటనే వారు 13వ తారీఖున ఉదయానికల్లా విశాఖపట్నానికి వచ్చారు. తాము ఆపదలో ఉన్నామనీ, అంతా సర్వ నాశనమైపోయిందనీ, మా పరిస్థితి ఏమిటనే బాధలో ఉన్న ప్రజలలో ఒక కాన్ఫిడెన్స్ క్రియేట్ చెయ్యాలనే ప్రయత్నాన్ని చేశాం. అప్పుడు ప్రజలంతా కూడా సహకరించారు. సీనియర్ ఐ.ఏ.యస్ అధికారులు, అన్ని రాజకీయపార్టీలవారు వచ్చి పనిచేశారు. ప్రజలు కూడా పూర్తిగా సహకరించడం జరిగింది. అయితే ఆ మూడు రోజుల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా వారు తినడానికి తిండి, తాగడానికి నీరు ఇవ్వాలనే ఉద్దేశంతో అన్ని జిల్లాల నుంచి కూడా ఫుడ్ ప్యాకెట్స్, త్రాగునీరు, పాలప్యాకెట్లు తీసుకొచ్చి అందర్నీ సంతృప్తి పరచడం కోసం ప్రయత్నం చేయడం జరిగింది. మిగిలిన జిల్లాల కలెక్టర్ల నుండి కూడా పాల ప్యాకెట్లు, బియ్యం, కూరగాయలు అందచేసే విధంగా ఏర్పాట్లు చేశాము. తద్వారా బ్లాక్ మార్కెటింగ్‌కు అవకాశం లేకుండా, అధిక రేట్లకు అమ్మకాలు జరగకుండా నివారించే ప్రయత్నం చేశాము.

పంట నష్టాన్ని కూడా అంచనా వేశాము. అలా వేసిన తరువాత ఇతర జిల్లాల నుంచి టీమ్స్ వచ్చి పంట నష్టాన్ని నోట్ చేసి ప్రభుత్వానికివ్వడం జరిగింది. ఈ తుఫానువల్ల మత్స్యకారులకు, చేతివృత్తి పనివారలకు చాలా ఇబ్బంది ఎదురైంది. మత్స్యకారులైతే వారంరోజులవరకూ సముద్రంలో వేటకి వెళ్ళడానికి వీల్లేని పరిస్థితి. అలా వెళ్ళకపోతే వాళ్ళకి తినడానికి తిండి కూడా ఉండదు. అందుచేత వాళ్ళకి 50 కిలోల బియ్యం అందచేయాలనే నిర్ణయం తీసుకోవడం జరిగింది. వాళ్ళకి కావాల్సిన నూనె, కారం, ఉప్పు వంటి వస్తువులన్నింటినీ కూడా సరఫరా చేయడం జరిగింది.

అయితే, అదే పరిస్థితుల్లో ఏం జరుగుతుంది? మనం చేయాల్సిందేమిటనే విషయాలపై చంద్రబాబునాయుడుగారు పగలంతా రెవ్యూ చేసేవారు. పంట నష్టం ఎంతివ్వాలి? డ్యామేజికి ఎంతివ్వాలనే విషయాలకు సంబంధించి పాత జీ.ఓ ఉంది. ఆ జీ.ఓకన్నా ఎక్కువగా ఉదారంగా ఇవ్వాలనే ఉద్దేశంతో, అక్కడ నష్టాన్ని పూరించడం కోసం మేము ప్రయత్నం చేయడం జరిగింది. తీర ప్రాంతంలో డ్యామేజీ జరిగిందే కానీ, దూరప్రాంతంలో పెద్దగా డ్యామేజీ లేదనే విషయం శర్మగారికీ, పెద్దలందరికీ కూడా తెలుసు. అయినప్పటికీ కూడా ఒక నిర్ణయం తీసుకున్నాం. కేబినెట్ మంత్రులందరూ అక్కడే ఉన్నాం. మూడు జిల్లాల్లో తుఫాను వచ్చింది కాబట్టి కూలి పని ఉండదు, పనులుండవు, ఉపాధి ఉండదనే ఉద్దేశంతో కార్డున్నా, లేకపోయినా, డ్యామేజీ ఉన్నా

లేకపోయినా అందరికీ 20 కేజీల బియ్యం, నూనె, కిరోసిన్, కాయగూరలు అందరికీ సరఫరా చేయడం జరిగింది. అయితే ఇంత లార్జ్ స్కేల్‌లో చేస్తున్నప్పుడు అక్కడక్కడ చిన్న చిన్న పొరపాట్లు జరగవచ్చు. మేము కాదనడంలేదు. అవికూడా మా దృష్టికి వచ్చినప్పుడు దానిని కూడా రెక్టిఫై చేయడం జరిగింది.

గత 33 సంవత్సరాల నుంచి నేను రాజకీయాలలో ఉన్నాను. గతంలో చాలా తుఫాన్లని చూశాను. ప్రభుత్వమిచ్చిన సహాయం 50 శాతం కూడా నష్టపోయిన వ్యక్తికి వెళ్ళడంలేదు. కారణమేంటంటే మిడిల్‌మెన్ ద్వారా దోపిడీ జరుగుతోంది. అందుచేత మేము ఆలోచనచేసి మిడిల్‌మెన్ లేకుండా బ్యాంక్ అకౌంట్స్ ఓపెన్‌చేసి ఆధార్‌కార్డుతో అనుసంధానించి అందరికీ బ్యాంక్ అకౌంట్‌లోకే వెళ్ళే విధంగా ఏర్పాటుచేశాము. ఆ తరువాత 61 మంది చనిపోయినట్లు మా దృష్టికి రాగా, వారికి కూడా రాష్ట్ర ప్రభుత్వం నుండి మూడు లక్షల రూపాయలు, కేంద్రప్రభుత్వం నుండి రెండు లక్షల రూపాయలను అందజేయడం జరిగింది. అయితే ఇక్కడ కొన్ని వాస్తవాలు కూడా మాట్లాడాల్సిన అవసరముంది. నిన్న శాసనసభలో కూడా దీనిపైనే చర్చ జరిగింది. పాడేరులో ముగ్గురు చనిపోతే ఒక్కరికి కూడా పైసా ఇవ్వలేదని పాడేరు ఎం.ఎల్.ఏగారు మాట్లాడినారు. నేను వెంటనే బయటికొచ్చి జిల్లా కలెక్టర్‌గారితో మాట్లాడినాను. ఎం.ఎల్.ఏగారు రిపోర్టు ఇవ్వడం కరెక్టే. వారు ఇచ్చిన రిపోర్టులోని ఒకతను చనిపోయాడు. అది ప్రభుత్వం దృష్టిలో ఉంది. పేమెంట్ చేద్దామంటే ఆ చనిపోయిన వ్యక్తికి ఇద్దరు భార్యలు. వాళ్ళలో ఎవరికి ఇవ్వాలనేదే ప్రశ్న. సబ్ కలెక్టర్‌ను పిలిచి లీగల్‌గా ఎవరికి అథారిటీ ఉందో నిర్ణయం తీసుకుని వాళ్ళకి ఇవ్వమని చెప్పాము.

శ్రీ ఎం.వి.ఎస్.శర్మ : అధ్యక్షా, గిరిజనులకు బహుభార్యత్వమనేది సాంప్రదాయం. వాళ్ళకు ఎంతమంది ఉన్నా లీగలే.

శ్రీ సి.హెచ్.అయ్యన్నపాత్రుడు : అందుకే సబ్ కలెక్టర్‌గారిని ఒక నిర్ణయం తీసుకుని రిపోర్టు పంపితే ఆ అమౌంట్ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నామని తెలియజేశాము. అయితే ఇంకొక ఇబ్బందేమిటంటే 14వ తారీఖున ఆ వ్యక్తి చనిపోతే 21వ తారీఖున ఎం.ఎల్.ఏగారు ప్రభుత్వానికి రిపోర్టు ఇచ్చారు. అప్పటికే ఆరురోజులైపోయింది. కనీసం పోలీసు స్టేషన్‌లో రిపోర్టు ఇవ్వడంకానీ, పోస్టుమార్టం రిపోర్టుకానీ లేదు. ఎట్లా పేమెంట్ చేయాలనే సమస్య వచ్చింది. అయినా చంద్రబాబునాయుడుగారు, మంత్రులమంతా మానవతా దృష్టితో ఆలోచించి, అక్కడ పి.ఓ గారిని, సబ్ కలెక్టర్‌గారిని వాస్తవాలు తెలుసుకుని నిజంగా తుఫానులోనే చనిపోయి ఉంటే అయిదు లక్షల రూపాయలు ఇవ్వమని చెప్పడం జరిగింది. అంటే ఇటువంటి చిన్న చిన్న సమస్యలున్నప్పుడు మనం రెక్టిఫై చేసుకోవాల్సిన అవసరముంటుంది.

అలాగే ఎన్నో ఇళ్ళకు నష్టం వాటిల్లింది. మనం ఇస్తున్నటువంటి నష్టపరిహారమే కాకుండా సముద్రతీరంలో ఉండి, ఎప్పుడూ ఎఫెక్టు అవుతున్నటువంటి గ్రామాలను, కాలనీలను గుర్తించాము. ఇవన్నీ కూడా రాబోయే రోజుల్లో 240, 250 కిలోమీటర్ల స్పీడులో తుఫాను గాలులు వచ్చినా, డ్యామేజి జరగకుండా ఇళ్ళు కట్టాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. మీకందరికీ తెలుసు. చాలామంది ముందుకొచ్చారు. సినీ పరిశ్రమవారు, సినిమా నటులు, వ్యాపారస్థులు, కళాశాలలు, ఆఖరికి చిన్న పిల్లలకు వారి తల్లిదండ్రులిచ్చిన డబ్బుల్ని కూడా దాచుకుని విరాళంగా

ఇచ్చిన సంగతి మనకు తెలుసు. చాలా భారీ ఎత్తున మనకు విరాళాలొచ్చాయి. ఉద్యోగస్తులు కూడా రు.100 కోట్లు పైనే ఇచ్చారు. వచ్చిన విరాళాలను ఏం చేయాలనేదాని గురించి చంద్రబాబునాయుడుగారు, మంత్రులమంతా ఆలోచించి ఒక నిర్ణయానికి రావడం జరిగింది. అదేమంటే ఉదాహరణకు రు.200 కోట్లు వచ్చిందనుకోండి దానికి సమానంగా ప్రభుత్వం కూడా రు.200 కోట్లిచ్చి మొత్తం రు.400 కోట్లతోటి తుఫానులో నష్టపోయిన గ్రామాలను, కాలనీలను గుర్తించి వాటిని పునర్నిర్మాణం చెయ్యాలని ప్రభుత్వ పరంగా నిర్ణయం తీసుకోవడం జరిగింది. దీంట్లో చాలామంది సహకరించారు. వాళ్ళందరికీ కూడా సభాముఖంగా ధన్యవాదాలు చెప్పాల్సిన అవసరముంది.

రెండవది, 12వ తారీఖున తుఫాను వస్తే వెంటనే 14వ తారీఖునే ప్రధానమంత్రిగారు వచ్చారు. నా రాజకీయ జీవితంలో ప్రధానమంత్రిగారు స్వయంగా తక్కువ సమయంలో రావడం ఎప్పుడూ చూడలేదు. మొదటిసారిగా చూశాను. అదీగాక గతంలో ప్రధానమంత్రిగారు వస్తే ఏరియల్ సర్వే చేసి వెళ్ళేవారనే సంగతి మనందరికీ తెలిసిందే. కానీ ప్రధానమంత్రిగారు ఎయిర్‌పోర్టులో దిగి, వాహనంలో సిటీ అంతా తిరిగి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌గారి కార్యాలయంలో గంటన్నర కూర్చుని, అధికారులతో బ్రహ్మాండంగా సమీక్ష చేశారు. ఆరోజున ప్రధానమంత్రిగారి కార్యదర్శిగారు రు.400 కోట్ల సహాయాన్ని ప్రకటిద్దామన్నారు. అయితే ప్రధానమంత్రిగారు రు.1000 కోట్లు తాత్కాలిక సహాయం అందచేస్తామని వెంటనే ప్రెస్‌మీట్‌లో చెప్పడం జరిగింది. అలాగే తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చాలా విపత్తులు చూశాననీ, విపత్తులు వచ్చినప్పుడు ప్రజలు కోపంమీద ఉండి ప్రభుత్వం మాకు సహాయం చేయలేదనీ, రాజకీయనాయకుల మీద తిరుగుబాటు చేస్తుంటారనీ, అయితే విశాఖపట్నంలో కొత్త వాతావరణం చూసి ఆశ్చర్యపోతున్నాననీ, విశాఖపట్నం ప్రజలు తనకు స్వాగతం పలికారని వారు కామెంట్ పాస్ చేశారు. మేమంతా కూడా ఆశ్చర్యపోయాము. విశాఖపట్నం ప్రజలిచ్చిన స్వాగతం చూస్తుంటే చంద్రబాబునాయుడుగారి నాయకత్వంలో ప్రభుత్వం, అధికారులు, రాజకీయనాయకులు చేసిన కృషిని ప్రజలు ఆమోదించారని అనుకున్నాం. వాళ్ళు సహకారమందించారు. రాబోయే రోజుల్లో సిటీని ఇంకా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరముంది. తప్పనిసరిగా అభివృద్ధి చేస్తామని తెలియజేస్తున్నాను.

గిరిజన ప్రాంతముంది. నాలుగు జిల్లాలలో ఏజెన్సీ ఏరియాలున్నాయి. అక్కడ కాఫీ ప్లాంటేషన్ గిరిజనుల ప్రధాన ఆదాయం. కాఫీ ప్లాంటేషన్ మధ్యలో సిల్వర్ ఓక్ మొక్కలుంటాయి. సిల్వర్ ఓక్ మొక్కల నీడలో కాఫీ ప్లాంటేషన్, మిరియాల తోటలు వస్తాయి. ఆ మిరియాలమీద ఆదాయం వస్తుంది. కానీ దురదృష్టమేమంటే మొన్న వచ్చిన తుఫానులో ఆ చెట్లన్నీ పడిపోయాయి. చాలా నష్టం జరిగింది. మా అంచనా ప్రకారంగా, మా సర్వే ప్రకారంగా సుమారు 37,665 ఎకరాలలో డ్యామేజి జరిగిందని గుర్తించాము. పాపం ఆ గిరిజన తాలూకు ఆదాయానికి కూడా నష్టం జరిగింది. మళ్ళీ సిల్వర్ ఓక్ మొక్కలు రావాలంటే నాలుగైదు సంవత్సరాలు పడుతుంది. అప్పటివరకూ వారికి ఆదాయమేమిటి? ఇవన్నీ ఆలోచన చేసి చంద్రబాబు నాయుడుగారు వీళ్ళని ఆదుకోవాలని చెప్పి ఇమ్మిడియట్‌గా రు.29,000 కోట్ల రూపాయలు వారికి నష్టపరిహారం ఇవ్వాలని చెప్పి నిర్ణయం తీసుకోవడం జరిగింది.

అయితే ఈ నష్ట పరిహారం వాళ్లకి ఆదాయాన్ని తెచ్చి పెడుతుందని నేను అనను. ఇది కేవలం తాత్కాలిక సహాయంగా ప్రకటించడం జరిగింది. రాబోయే రోజులలో సహాయ కార్యక్రమాలు చేపట్టవలసిన ఆవశ్యకత ఉంది. ఏజెన్సీ ప్రాంతాలలో నష్టం జరిగినా, జరగకపోయినా నిత్యావసర సరుకులు సరఫరా చేశాము. అది అందరికీ తెలిసిన విషయమే. ఎక్కడైనా చిన్న చిన్న లోటుపాట్లు ఉంటే వాటిని సరిదిద్దవలసిన అవసరం ఉంది. వీటిని సరిదిద్దుకోవడంలో మీ సహకారం, సలహాలు కూడా స్వీకరిస్తాము. ఎం.ఎల్.ఎ లు సంతకాలు పెడితే బియ్యం ఇస్తున్నారని గౌరవ సభ్యులు అన్నారు. అది నిజమే. ఏసందర్భంలో అలా జరిగిందంటే కొంతమందికి తెల్లకార్డులు, పింక్ కార్డులు రెండూ లేవు. అటువంటి వాళ్లు కూడా నష్టపోయారు వాళ్లకి కూడా సహాయం చేయడం ఎలా అని చర్చించి, పరిష్కార మార్గంగా ఏ పార్టీకి చెందిన ఎం.ఎల్.ఎ లు అయినా సరే అక్కడున్న ప్రజలు నిజంగా నష్టపోతే లెటర్ రాసి ఇవ్వండి, ఆ లెటర్ ఆధారంగా వారికి కూడా నిత్యావసరాలు ఇస్తామని ఉదార స్వభావంతో చెప్పాము. ఆవిధంగా ఇచ్చామే తప్ప, దోపిడీ చేయడానికి కాదు, కార్యకర్తలు తీసుకోవడానికి కాదని మీ ద్వారా మనవి చేస్తున్నాను.

శ్రీ రుద్రరాజు పద్మరాజు : అధ్యక్షా, స్థానిక ప్రజాప్రతినిధులు తప్పు చేశారని నేను అనడం లేదు. మంత్రిగారు చెప్పింది వాస్తవం. కార్డులేని వారికి నిత్యావసర సరుకులు ఎలా ఇవ్వాలనే మీమాంస వచ్చింది, ఖచ్చితంగా నిర్ణయం తీసుకుని న్యాయం చేయాల్సిన అవసరం ఉంది. ఈ లెటర్స్ ఇవ్వడం వలన చౌక ధరల దుకాణాల వద్ద అవకతవకలు జరిగినట్లు మా వద్ద ఉన్న సమాచారం. ఇంతకుముందే చర్చకు వచ్చింది. ఆ విషయంలో అన్నాం తప్ప ప్రజాప్రతినిధులు దీనిని ఆసరాగా తీసుకుని సొమ్ము చేసుకున్నారనేది నా అభిమతం కాదు. చౌకధరల దుకాణాల మీద విచారణ జరపాలని కోరుతున్నాను.

శ్రీ సి.హెచ్ అయ్యన్నపాత్రుడు : ఏ సందర్భంలో ఆ నిర్ణయం తీసుకున్నామో చెప్పే ప్రయత్నం చేశాను. చెట్లన్నీ పడిపోయి రవాణాకు తీవ్ర అంతరాయం కలిగింది. పెద్దలు చెప్పినట్లు రోడ్లు, భవనాల శాఖ వారు, ఫైర్ శాఖ వారు చాలా అద్భుతంగా పని చేసి రెండవరోజుకే మొత్తం క్లియర్ చేశారు. ఆహారపదార్థాలు, మంచినీటి ప్యాకెట్స్ తీసుకువెళ్లడానికి ఆటంకం లేకుండా చేశాము. కరెంట్ లేకపోవడంతో మంచినీటి సమస్య వచ్చింది. దీనిని పరిష్కరించడానికి మొత్తం 13 జిల్లాల నుండి 5 వేల జనరేటర్స్ తెప్పించి మోటార్స్‌కి కనెక్ట్ చేసి డీజిల్ జనరేటర్స్ సహాయంతో, ఫైర్ ఇంజన్లను తీసుకువచ్చి మోటార్స్ త్రిప్పి వాటర్ ట్యాంక్స్ నింపాము. దానికి అన్ని పార్టీల సర్పంచ్‌లు కూడా సహాయం అందించారు. వాళ్లకు కూడా ఈ సభద్వారా ధన్యవాదాలు తెలియజేయాల్సిన అవసరం ఉంది. నిజంగా ప్రజలకు ఇబ్బంది లేకుండా చేశాము. ఇప్పుడు మన ముందు ఉన్న సమస్య పునర్నిర్మాణం. విశాఖపట్టణంకు పూర్వ వైభవం, పచ్చదనం తీసుకురావాలి. దానికోసం ప్రయత్నాలు చేస్తున్నాము. గౌరవ సభ్యులు సలహాలు ఇస్తే తీసుకుంటాము. ఎక్కడైనా లోటుపాట్లు జరిగితే వాటిని సరిదిద్దడానికి ప్రయత్నం చేస్తామని మీద్వారా తెలియజేస్తున్నాను.

శ్రీ నిమ్మకాయల చిన రాజప్ప : గౌరవసభ్యులు శ్రీ చంగల్‌రాయుడు గారు రెండు మూడు విషయాల గురించి మాట్లాడడం జరిగింది. నష్టపరిహారంలో ఇంకా కొంత ఇవ్వాల్సి ఉందని చెప్పారు. దాని సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తాము. అలాగే ఎలక్ట్రిక్ పోల్స్ గురించి చెప్పారు. ఎలక్ట్రిక్ పోల్స్ తక్కువ లోతు తీసి పాతడం వలన అవి పడిపోయాయి. పూర్వం ఎలక్ట్రిక్ పోల్స్ మీద

కాంక్రీట్ వేయడం వల్ల గట్టిగా ఉన్నాయి. ఈ విషయం గురించి కూడా ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తాము. నవీన్ పట్నాయక్ గారి సలహా తీసుకోమని చెప్పారు. శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు 1996 లో కోనసీమలో తుఫాను వచ్చినప్పుడు 8 రోజులు రాజమండ్రిలో ఉండి, అందరికీ సహాయం చేశారు. ఒరిస్సాలో తుఫాను వచ్చినప్పుడు కూడా చంద్రబాబు నాయుడు గారు సహాయం చేశారు. హుద్ హుద్ తుఫాను రాబోయే 5 రోజుల ముందు నుండీ అధికారులను, ప్రజాప్రతినిధులను అప్రమత్తం చేశారు. ఎలక్ట్రిక్ పోల్స్‌ని, కండక్టర్స్‌ను విశాఖపట్టణం కు పంపడం, నిత్యావసర సరుకులు అక్కడ ఉంచడం జరిగింది. కట్టర్స్‌ని ముందుగానే అక్కడ ఉంచి, రహదారులను బాగుచేయించి, వాహనాలు వెళ్లే విధంగా, అందరికీ నిత్యావసరాలు అందేలా చేసినందుకు అభినందించాలని కోరుతున్నాను.

MR. DEPUTY CHAIRMAN: Now, the Minister may move the Resolution.

శ్రీ నిమ్మకాయల చిన రాజప్ప : అధ్యక్షుల వారి అనుమతితో, నేను ఈ క్రింది తీర్మానాన్ని సభ అమోదం కొరకు ప్రవేశ పెడుతున్నాను.

## హుద్‌హుద్‌పై తీర్మానం

ఉత్తరాంధ్రలో కనీవినీ ఎరుగని రీతిలో విరుచుకుపడిన హుద్‌హుద్ తుఫాను విధ్వంసంలో బాధిత ప్రజానీకం చూపిన మనోనిబ్బరానికి, ఆత్మస్థయిర్యానికి శాసనమండలి అభినందనలు తెలియజేస్తోంది. సహాయ పునరావాస చర్యలలో చురుకుగా పాల్గొని, ప్రాణ నష్టాన్ని తగ్గించి, ప్రజలకు అండగా ఉన్న ప్రభుత్వ యంత్రాంగానికి అభినందనలు. అందరికంటే ముందుగా తుఫాను ప్రభావిత ప్రాంతాలకు చేరుకుని సహాయ, పునరావాస చర్యలను ముందుండి నడిపించిన గౌరవ ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు. బాధితులకు అండగా ఉండేందుకు స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య వర్గాలు, ప్రభుత్వ ఉద్యోగులు, మీడియా మిత్రులు, చలనచిత్ర కళాకారులు, మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం అందించిన వారందరికీ కృతజ్ఞతలు. తుఫాను భీభత్సం సమాచారం అందిన వెంటనే స్పందించి, తక్షణమే సందర్శించి, కేంద్రబృందాన్ని పంపిన ప్రధాన మంత్రిగారికి, కేంద్రప్రభుత్వానికి, తుఫాను ప్రభావిత ప్రాంతాలలో పర్యటించిన కేంద్ర బృంద సభ్యులకు ధన్యవాదాలు. సహాయ పునరావాస చర్యలలో తోడ్పాటు అందించిన ఇతర రాష్ట్ర ప్రభుత్వాలకు హృదయపూర్వక కృతజ్ఞతలు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో మళ్లీ యథాతథ పరిస్థితులు నెలకొల్పేందుకు, అభివృద్ధి సాధించేందుకు, "జాతీయ విపత్తు" గా ప్రకటించి పూర్తి తోడ్పాటును అందించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ శాసన మండలి తీర్మానం చేస్తోంది."

MR. DEPUTY CHAIRMAN: Since there is unanimity among all Members, the Resolution moved by the Hon'ble Deputy Chief Minister is hereby adopted unanimously.

Now, the House is adjourned to meet again at 10.00 a.m. tomorrow i.e. the 23rd December, 2014.

(The House then adjourned at 2.37 p.m. to meet again at 10.00 a.m. on Tuesday, the 23rd December, 2014.)

---